www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

మంగళవారం
29-10-2024

సంపుటి : 01 | సంచిక : 177 | పేజీలు : 15 | వెల : 5/-   తెలంగాణ / ఆంధ్రప్రదేశ్






## మోదీకే యుద్ధాన్ని ఆపే శక్తి సామర్థ్యాలున్నాయి

ఆయనకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉంది

రష్యా-ఉక్రెయిన్ చర్చలు భారత్‌లోనే జరగొచ్చు

భారత్ మీడియాతో వ్లాదిమిర్ జెలెన్‌స్కీ



**కీవ్:** రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపే శక్తి సామర్థ్యాలు భారత ప్రధాని నరేంద్రమోదీకి ఉన్నాయని ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ పేర్కొన్నారు. ఓ భారత మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ మోదీకి ప్రపంచవ్యాప్తంగా గొప్ప గుర్తింపు ఉందన్నారు. రష్యా-ఉక్రెయిన్ చర్చలు భారత్‌లోనే జరగొచ్చని వ్యాఖ్యానించారు. రష్యా భారత్‌కు చవకగా సరఫరా చేస్తున్న ఇంధనం కొనుగోళ్లను ఆపడం ద్వారా మోదీ రష్యా దూకుడుకు కళ్లెం వేయగలరని ఆయన అన్నారు. మా దేశంపై యుద్ధం జరుగుతున్నందువల్ల ప్రత్యర్థితో చర్చలు జరపడం ఎంతో కీలకమైన మిగతా2లో...



## హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతీసేందుకు యత్నిస్తే ఊరుకోం

రాజకీయంగా ఎవరి మీదా కేసు పెట్టాలని ప్రభుత్వం చూడలేదు: మంత్రి పొన్నం ప్రభాకర్



2



## అక్కినేని అవార్డుతో.. ఇన్నాళ్లకు ఇంట గెలిచా

- ఏయన్నార్ అవార్డు దక్కడం పూర్వజన్మ సుకృతం
- అమితాబచ్చన్ చేతుల మీదుగా అందుకోవడం ఆనందం
- నా సినీ జీవితానికి ఒక పరిపూర్ణత ఏర్పడింది
- నాడు లెజెండరీ అవార్డును క్యాప్సుల్ బాక్సులో వేశా
- పద్మవిభూషణ్ సహా ఎన్ని అవార్డులు వచ్చినా అసంతృప్తే
- భావోద్వేగానికి గురైన చిరంజీవి
- మెగాస్టార్ ఏఎన్‌ఆర్ జాతీయ అవార్డును ప్రదానం చేసిన బిగ్‌బీ

12

కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా "జనాభా లెక్కల" సేకరణకు సిద్ధమైంది. 2025లో దేశ జనాభాపై అధికారిక సర్వే అయిన జనగణను ప్రభుత్వం ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రక్రియ 2025లో ప్రారంభమై 2026 వరకు కొనసాగుతుందని సంబంధిత వర్గాలు సోమవారం తెలిపాయి. అయితే, జనాభా గణనకు సంబంధించి వివరాలను ఇంకా బహిరంగపరచలేదు.. ఈ జనాభా లెక్కల ఆధారంగా లోక్‌సభ స్థానాల పునర్విభజన ప్రక్రియ ప్రారంభం అవుతుందని, 2028 నాటికి ఈ పునర్వ్యవస్థీకరణ పూర్తవుతుందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

# జనగణనకు మోక్షం



## 2026 వరకు కొనసాగింపు

**2021 జరగాల్సి ఉన్నా.. ప్రతిబంధకంగా మారిన కోవిడ్ సంక్షోభం**

- మూడేళ్లుగా ఎప్పటికప్పుడు వాయిదా..
- జనాభా పెరిగినట్లు అంచనా తప్ప సరైన లెక్కల్లేవు
- జనగణన తర్వాత నియోజకవర్గాల పునర్విభజన
- ఓబీసీ జనాభాను తెలుసుకోవాలని డిమాండ్..
- భారత్.. జనాభాలో చైనాను అధిగమించినట్లు ప్రకటించిన యూఎన్ఓ

**ఢిల్లీ:** జనగణనకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు సంబంధిత వర్గాల సమాచారం. వచ్చే ఏడాది నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమవుతుందని, 2026 వరకు కొనసాగవచ్చని తాజాగా ప్రభుత్వవర్గాలు పేర్కొన్నాయి. అనంతరం లోక్‌సభ స్థానాల పునర్విభజన ప్రక్రియ ప్రారంభమవుతుందని, అది 2028కి ముగుస్తుందని వెల్లడించాయి.

**మూడేళ్లుగా ఎప్పటికప్పుడు వాయిదా..**

ప్రతి పది సంవత్సరాలకోసారి ఆనవాయితీగా నిర్వహించాల్సిన జనగణన మూడేళ్లుగా ఎప్పటికప్పుడు వాయిదా పడుతూ వస్తోంది. రాష్ట్రాలవారీగా, జాతీయస్థాయిలో రకరకాల అభివృద్ధి పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు రూపొందించి అమలుపరచడానికి ఈ జనగణనే కీలకం. కొవిడ్ సంక్షోభం 2021 సెన్సస్‌కు ప్రతిబంధకంగా మారింది. తర్వాత ఈ ప్రక్రియ వాయిదా పడుతోంది. దీనిపై కేంద్ర మిగతా2లో...

## కులగణనపై రాని క్లారిటీ

- జనగణనతో పాటు కులగణన కూడా చేపట్టాలి
- పట్టుపడుతున్న ప్రతిపక్షాలు
- స్పష్టత ఇవ్వాలన్న జైరాం రమేశ్
- కులగణన చేయకపోతే ఓబీసీలకు ద్రోహం చేయడమేనన్న మాణికం ఠాగూర్

2



## ఏపీ హైకోర్టులో ముగ్గురు అదనపు న్యాయమూర్తుల ప్రమాణ స్వీకారం

**విశ్వంభర, అమరావతి:** ఏపీ హైకోర్టులో ముగ్గురు అదనపు న్యాయమూర్తులు ప్రమాణస్వీకారం చేశారు. వారితో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ప్రమాణం చేయించారు. హైకోర్టు న్యాయమూర్తులుగా జస్టిస్ చల్లా గుణరంజన్, జస్టిస్ మహేశ్వరరావు కుంచం, జస్టిస్ తూట చంద్ర ధనశేఖర్ ప్రమాణం చేశారు. మిగతా2లో...

## కాళేశ్వరం డీపీఆర్‌ను కేసీఆర్ ఆమోదించారు



- డిజైన్లను ఫైనల్ చేయమని చెప్పారు
- విశ్రాంత ఈఎన్‌సీ వెంకటేశ్వర్లు
- విచారణ కమిషన్‌కు సంబంధిత దస్త్రాలు సమర్పించిన మాజీ ఈఎన్‌సీ

2

## అస్వస్థతకు గురైన కేజీబీవీ విద్యార్థినులకు మెరుగైన చికిత్స

- బాలికల తల్లి దండ్రులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పాం
- మంత్రి శ్రీధర్ బాబు పరామర్శ

**విశ్వంభర, భూపాలపల్లి:** కేజీబీవీలో అస్వస్థతకు గురైన విద్యార్థినులు పూర్తిస్థాయిలో కోలుకునే వరకు మెరుగైన వైద్య చికిత్స మిగతా2లో...



మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి



### నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 123 | ₹ 146 |
| స్కిన్ | స్కిన్ లెస్ |
| ₹ 210 | ₹ 239 |

## రైతుల గోస పట్టడం లేదు

- దసరాకే కాదు.. దీపావళికి కూడా వారిని దివాలా తీయిస్తారా?
- కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి ధాన్యం మూలుగుతోంది..
- వాటిని కొనాలని అధికారులకు ఆదేశాలు అందలేదు
- రాజకీయాల్లో రాక్షసక్రీడలను మానేసి.. రైతులను ఆదుకోవడంపై దృష్టి కేంద్రీకరించాలన్న కేటీఆర్



2



2

## కొకైన్ ఎక్కడి నుంచి వచ్చింది?

జన్వాడ ఫామ్‌హౌజ్ కేసులో కొనసాగుతున్న దర్యాప్తు

విచారణకు హాజరుకాని రాజ్ పాకాల స్నేహితుడు విజయ్ మద్దూరి

## సామాన్యులపై ఎలాంటి విద్యుత్ భారం ఉండదు



- 800 యూనిట్లు దాటిన వారికి స్వల్పంగా ఛార్జీల పెంపు
- నష్టాలు తగ్గించుకునేందుకు ప్రభుత్వం నుంచి బకాయిలు తీసుకోవాలి
- డిస్కం ప్రతిపాదనలపై ఈఆర్‌సీ ఛైర్మన్ శ్రీరంగారావు బహిరంగ విచారణ

**హైదరాబాద్:** సామాన్యులపై ఎలాంటి విద్యుత్ భారం ఉండబోదని ఈఆర్‌సీ ఛైర్మన్ శ్రీరంగారావు తెలిపారు. 800 యూనిట్లు దాటిన వారిపై స్వల్పంగా ఛార్జీల పెంపు ఉంటుందన్నారు. ప్రభుత్వం నుంచి డిస్కంలకు రావాల్సిన బకాయిలు సుమారు రూ. 25వేల కోట్లుగా ఉందని, డిస్కంలు నష్టాలు తగ్గించుకునేందుకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు వీలైనంత త్వరగా తీసుకోవాలని సూచించారు. ఎరియర్స్ తొందరగా ఇస్తే.. డిస్కంలు తొందరగా నష్టాల నుంచి బయటపడతాయని అభిప్రాయం మిగతా2లో...

## పంచాంగం

**29-10-2024, మంగళవారం**

శ్రీ క్రోధినామ సంవత్సరం
ఆశ్వయుజ మాసం కృష్ణపక్షం
**తిథి:** ద్వాదశి ఉ.10.32 వరకు తర్వాత త్రయోదశి
**నక్షత్రం:** ఉత్తర సా.06.28 వరకు
**సూర్యోదయం:** ఉ.6.17
**సూర్యాస్తమయం:** సా.5.42
**వర్జ్యం:** తె.04.04 నుంచి తె.05.52వరకు
**దుర్ముహూర్తం:** ఉ.08.34 నుంచి ఉ.09.20 వరకు తిరిగి రా.10.44 నుంచి రా.11.34 వరకు
**రాహుకాలం:** మ.02.51 నుంచి సా.04.16 వరకు
**అమృత ఘడియలు:** ఉ.10.25 నుంచి మ.12.13 వరకు

# కొకైన్ ఎక్కడి నుంచి వచ్చింది?



**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్ర రాజకీయాల్లో పెను ప్రకంపనల సృష్టించిన జన్వాడ ఫామ్‌హౌజ్ కేసులో దర్యాప్తు కొనసాగుతోంది. పార్టీలో పాల్గొన్న రాజ్ పాకాల స్నేహితుడు, కొకైన్ తీసుకున్నట్లు తేలిన విజయ్ మద్దూరి సోమవారం పోలీసుల ఎదుట విచారణకు హాజరుకాలేదు. ఇప్పటికే వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు.. ఫామ్‌హౌజ్‌లో గేమ్ ఆడినట్లు దర్యాప్తులో తేలితే మరో కేసు నమోదు చేసే అవకాశం ఉంది. ఫామ్‌హౌజ్‌లో పార్టీ జరుగుతోందని సమాచారం అందుకున్న పోలీసులు శనివారం అర్ధరాత్రి అక్కడికి వెళ్లి సోదాలు నిర్వహించిన సమయంలో అక్కడున్న మొబైల్‌ను ఓ మహిళ దాచి పెట్టింది. దానిని ఆదివారమే విజయ్ మద్దూరి పోలీసులకు అప్పగించారు. అందులో ఉన్న సమాచారం అధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కొకైన్ తీసుకొచ్చి విజయ్ మద్దూరికి ఎవరు ఇచ్చారన్న దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

**రాజ్ పాకాల పిటిషన్‌పై హైకోర్టులో విచారణ**

పోలీసుల నోటీసుల నేపథ్యంలో రాజ్ పాకాల హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. పోలీసులు అక్రమంగా ఈ కేసులో ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని, తనను అరెస్ట్ చేయకుండా ఆదేశాలివ్వాలని పిటిషన్‌లో ఆయన కోరారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు.. పోలీసుల ఎదుట హాజయ్యేందుకు ఆయనకు రెండు రోజుల సమయం ఇచ్చింది. రాజ్ పాకాల తరఫున మయూర్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఇంట్లో పార్టీ చేసుకుంటే అక్రమంగా పోలీసులు వచ్చి దాడి చేశారన్నారు. ఆయన సంస్థలో పని చేసే ఉద్యోగికి డ్రగ్స్ పాజిటివ్ వస్తే రాజ్ పాకాలను నిందితుడిగా చేర్చారని కోర్టుకు వివరించారు. రాజకీయ దురుద్దేశంతోనే కేసు పెట్టారని, సోమవారం ఉదయం 9.30కి నోటీసులు ఇచ్చి.. 11 గంటలకు విచారణకు రమ్మన్నారని కోర్టుకు తెలిపారు.
పోలీసుల తరఫున అదనపు ఏజీ ఇమ్రాన్ ఖాన్ వాదనలు వినిపించారు. అరెస్టు చేస్తామని తాము ఎక్కడా చెప్పలేదని, ఇప్పటి వరకు ఈ కేసులో ఎవరినీ అరెస్టు చేయలేదని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. అక్రమంగా మద్యం బాటిళ్లు లభించడంతోపాటు విజయ్ మద్దూరి అనే వ్యక్తికి డ్రగ్స్ పరీక్షలో పాజిటివ్ వచ్చిందని చెప్పారు. ఇందులో ఎలాంటి రాజకీయ ప్రమేయం లేదని, నిబంధనల ప్రకారమే రాజ్ పాకాలకు 41ఏ నోటీసులు ఇచ్చామని వివరించారు. దర్యాప్తులో తీవ్ర నిర్ణయాలేమీ తీసుకోబోమని కోర్టుకు తెలిపారు. ఇరువైపు వాదనలు విన్న న్యాయస్థానం పోలీసుల ఎదుట హాజరయ్యేందుకు పిటిషనర్‌కు రెండు రోజుల గడువు ఇచ్చింది. చట్టప్రకారం ముందుకెళ్లాలని పోలీసులను ఆదేశించింది.

## కేటీఆర్.. మీ బావమరిది కోసం ఇష్టమొచ్చినట్లు మాట్లాడతారా?

**మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు**

**విశ్వంభర, హైదరాబాద్:** మంత్రిగా పని చేసిన కేటీఆర్‌కు చట్టాలపై కనీస అవగాహన లేదని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. బావమరిదిని కాపాడుకోవడం కోసం కేటీఆర్ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆరోపించారు. పార్టీల్లో 6.50 లీటర్ల కంటే ఎక్కువ మద్యం ఉంటే ఎక్సైజ్ పోలీసుల నుంచి అనుమతి తీసుకోవాలన్న నిబంధన ఉందని ఆయన గుర్తు చేశారు. ఈ మేరకు సోమవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

**''111 జీవోని అతిక్రమిస్తూ రాజ్ పాకాల జన్వాడలో ఇల్లు ఎలా నిర్మించారు?**

ఎక్సైజ్ శాఖ పోలీసులు తనిఖీ చేయడానికి ఎలాంటి వారెంటు అవసరం లేదు. రేవ్ పార్టీ జరిగిందని ప్రభుత్వం ఎక్కడా చెప్పలేదు. మీడియాలో కథనాలు మాత్రమే వచ్చాయని గుర్తించాలి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దగ్గరుండి ప్రచారం చేయించినట్లు ప్రతిపక్ష నేతలు అక్కసు వెళ్లగక్కుతున్నారు. మీ ప్రభుత్వం గతంలో చేసినట్లుగా ఫామ్‌హౌస్‌లో స్టింగ్, కోవర్ట్ ఆపరేషన్లు ఇప్పుడు జరగలేదు. జన్వాడ ఫామ్‌హౌస్‌లో ఎలాంటి స్టింగ్ ఆపరేషన్ చేయలేదు. జూబ్లీహిల్స్ హై లైఫ్ పబ్‌కు రాజ్ పాకాల గతంలో యజమానిగా ఉన్నారు. డ్రగ్స్ తీసుకున్న జూబ్లీహిల్స్ గ్యాంగ్‌లో రాజ్ పాకాల సభ్యుడనే ప్రచారం కూడా జరిగింది. గత ప్రభుత్వ హయాంలో జూబ్లీహిల్స్‌లో పబ్‌లకు అనుమతులు ఇప్పించింది రాజ్ పాకాలనే. డ్రగ్స్‌కు స్వర్గం అని చెప్పే సన్‌బర్న్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో నిర్వహించడానికి రాజ్ పాకాల ప్రయత్నించారు. జన్వాడ ఫామ్‌హౌజ్‌లో జరిగిన పార్టీకి సంబధించి రాజ్ పాకాల మీడియా ముందుకు వచ్చి వివరణ ఇచ్చి ఉంటే అనుమానాలు వచ్చేవి కావు. డ్రగ్స్ తీసుకోలేదని రాజ్ పాకాల నిరూపించుకోవాలి. రాజ్ పాకాల వెంటనే పోలీసులకు లొంగిపోయి వివరణ ఇవ్వాలి. తనకు రాజ్ పాకాలనే కొకైన్ ఇచ్చాడని విజయ్ మద్దూరి పోలీసులకు స్టేట్‌మెంట్ ఇచ్చాడు.. ఇది చాలా తీవ్రంగా పరిగణించాల్సిన విషయం'' అని అన్నారు.

## కాళేశ్వరం డీపీఆర్‌ను కేసీఆర్ ఆమోదించారు

**విశ్వంభర, హైదరాబాద్:** కాళేశ్వరం డీపీఆర్‌ను అప్పటి సీఎం కేసీఆర్ ఆమోదించినట్లు విశ్రాంత ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు విచారణ కమిషన్ కు తెలిపారు. సోమవారం ఆయన కాళేశ్వరం కమిషన్ ముందు విచారణకు హాజరయ్యారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించిన అంశాలపై విచారణ సాగింది. కాళేశ్వరం డీపీఆర్‌ను అప్పటి సీఎం కేసీఆర్ ఆమోదించినట్లు విచారణ సందర్భంగా వెంకటేశ్వర్లు కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు సంబంధించిన దస్త్రాలను కమిషన్‌కు అందించారు. కాళేశ్వరం డిజైన్లను ఫైనల్ చేయమని కేసీఆర్ చెప్పినట్లు వెంకటేశ్వర్లు తెలిపారు. మినిట్స్‌కు సంబంధించిన దస్త్రాలు, మూడు బ్యారేజీల వివరాలను సమర్పించారు. మేడిగడ్డ కుంగుబాటుకు నిర్వహణ లోపమే కారణమా? మూడు బ్యారేజీల్లో నీరు నింపాలని ఎవరు ఆదేశించారని కమిషన్ ప్రశ్నించినట్లు తెలుస్తోంది. దీనికి అప్పటి ప్రభుత్వాధినేత ఆదేశించారని వెంకటేశ్వర్లు బదులిచ్చినట్లు సమాచారం.

## రైతుల గోస పట్టడం లేదు..

**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దసరాకే కాదు.. దీపావళికి కూడా రైతులను దివాలా తీయిస్తారా అని ప్రశ్నించారు. కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి ధాన్యం మూలుగుతున్నా.. వాటిని కొనాలని అధికారులకు ఆదేశాలు అందలేదని విమర్శించారు. ప్రభుత్వానికి రైతుల గోస పట్టడం లేదని మండిపడ్డారు. రాజకీయాలపై పెట్టిన దృష్టి ధాన్యం కొనుగోళ్లపై ఎందుకు పెట్టరని, రైతులంటే ఎందుకంత అలుసని నిలదీశారు. మీ గారడీ హామీలను రైతులు విశ్వసించి మోసపోతున్నందుకా? అర్థించడం తప్ప అక్రోషించడం తెలియని అమాయకులైనందుకా? అని ప్రశ్నించారు. రాజకీయాల్లో రాక్షసక్రీడలను మానేసి.. రైతులను ఆదుకోవడంపై దృష్టి కేంద్రీకరించాలని హితవుపలికారు. దయచేసి రైతుల విషయంలో రాజకీయాలు చేయవద్దని ఎక్స్ వేదికగా కోరారు.


## కులగణనపై రాని క్లారిటీ

**విశ్వంభర, హైదరాబాద్:** జనాభా లెక్కల గురించి వివరాలు వెల్లడైన నేపథ్యంలో కులగణనపై స్పష్టమైన క్లారిటీ ఇవ్వలేదు. దీంతో ప్రతిపక్షాలు కులగణనపై చర్చను లేవనెత్తాయి. దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన కూడా చేపట్టాలని కాంగ్రెస్‌తో సహా ఇతర ప్రతిపక్షాలు పట్టుబడుతున్నాయి. ఈసారి జరగనున్న జనాభా లెక్కల్లో కులగణన ఉంటుందా లేదా, లోక్‌సభలో రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని నిర్ణయించేందుకు ఈ లెక్కలు ఉపయోగిస్తారా లేదా అని అంశాలపై కాంగ్రెస్ స్పష్టత కోరింది. ఇందుకోసం అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని కేంద్రానికి సోమవారం సూచించింది.కుల గణన, లోక్‌సభ డీలిమిటేషన్‌కు సంబంధించిన విషయాలను స్పష్టం చేసేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నేత జైరాం రమేష్ కేంద్రాన్ని కోరారు. జైరాం రమేష్ మాట్లాడుతూ.. రెండు కీలక విషయాలపై ఇంకా స్పష్టత రాలేదని, ఈ జనాభా లెక్కల్లో కులగణన ఉంటుందా..? కుటుంబ నియంత్రణలో అగ్రగామి ఉన్న రాష్ట్రాలపై లోక్‌సభ పునర్విభజన ప్రతికూలతగా మారుతుందా..? అని ప్రశ్నించారు.భారత రాజ్యాంగం ప్రకారం, అలాంటి కులగణన చేపట్టడం కేంద్ర ప్రభుత్వం బాధ్యత అని పేర్కొన్నారు. కుల గణనకు కేంద్ర ప్రభుత్వం నిరాకరించడం ఓబీసీ వర్గాలకు ద్రోహం చేయడమేనని కాంగ్రెస్ నేత మాణికం ఠాగూర్ అన్నారు.

## సామాన్యులపై ఎలాంటి విద్యుత్ భారం ఉండదు

(మొదటి పేజీ తరువాయి)
వ్యక్తం చేశారు. డిస్కం వార్షిక టారిఫ్ ప్రతిపాదనలపై ఈఆర్సీ సోమవారం బహిరంగ విచారణ నిర్వహించింది. విద్యుత్ సంస్థల ఆర్థిక స్థితిగతులు, వినియోగదారులు, ప్రభుత్వ రాయితీలను దృష్టిలో పెట్టుకొని కమిషన్ నిర్ణయం తీసుకుంటుందన్నారు. ప్రస్తుతం విద్యుత్ ఛార్జీలు ఏ కేటగిరిలోనూ పెంచడం లేదన్నారు. స్థిర ఛార్జీలు రూ.10.. యాథాతథంగా ఉంటుందన్నారు. నీటిపారుదలకు సంబంధించి టైమ్ ఆఫ్ డే పీక్ అవర్‌లో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేశారు. రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల మధ్య.. నాన్ పీక్ అవర్‌లో రాయితీని రూపాయి నుంచి రూపాయిన్నరకు పెంచినట్లు చెప్పారు. గృహ వినియోగదారులకు మినిమం ఛార్జీలు తొలగించామన్నారు. గ్రిడ్ సపోర్ట్ ఛార్జీలను కమిషన్ ఆమోదించిందని ఛైర్మన్ రంగారావు తెలిపారు. అయితే, ఇవి కేవలం ఐదు నెలల వరకే ఉంటాయన్నారు.పౌల్ట్రీ, గోట్ ఫాంలను కమిషన్ ఆమోదించలేదని చెప్పారు. చేనేత కార్మికులకు హార్స్ పవర్ పెంచామని.. హెచ్‌పీ 10 నుంచి 25కి పెంచామన్నారు.

## హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతీసేందుకు యత్నిస్తే ఊరుకోం



**విశ్వంభర, హైదరాబాద్:** రాజకీయంగా ఎవరి మీదా కేసు పెట్టాలని ప్రభుత్వం చూడలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జన్వాడ ఫామ్‌హౌస్ పార్టీ వ్యవహారంలో అర్ధరాత్రి డీజే సౌండ్ పెట్టి చుట్టుపక్కల వాళ్లకు ఇబ్బంది కలిగించారని చెప్పారు. ప్రభుత్వానికి ఎవరి మీదా కక్ష సాధింపు చర్యలు లేవని తెలిపారు. రాజకీయ లబ్ధి కోసం ప్రభుత్వాన్ని బదనాం చేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతీసేందు యత్నిస్తే ఊరుకోమని పొన్నం ప్రభాకర్ తెలిపారు.

## అస్వస్థతకు గురైన కేజీబీవీ విద్యార్థినులకు మెరుగైన చికిత్స

(మొదటి పేజీ తరువాయి)
అందిస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు అన్నారు. సోమవారం మంత్రి డి.శ్రీధర్ బాబు పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముత్తారం మండల కేంద్రంలోని విద్యార్థినులను జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తో కలిసి పరామర్శించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముత్తారం మండలంలోని కేజీబీవీలోని బాలికలు అస్వస్థతకు గురైతే హాస్టల్ వార్డెన్ సమాచారం అందించడంతో వెంటనే జిల్లా ఆసుపత్రికి 53 మంది బాలికలను తరలించి 10 మంది వైద్యులు, 20 మంది స్టాఫ్ నర్సుల ఆధ్వర్యంలో అత్యుత్తమ చికిత్స అందించామని అన్నారు.బాలికలకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి ఐవీ ఫ్లూయిడ్స్, స్టెరాయిడ్స్ మొదలైన చికిత్సను అందించామని అన్నారు. కొంత మంది బాలికలకు చలికాలంలో శ్వాస సంబంధిత ఇబ్బందులు ఎదుర్కొనే మెడికల్ హిస్టరీ ఉందని, వారికి ఆసుపత్రిలో ఆక్సిజన్ సౌకర్యం చికిత్స అందుబాటులో పెట్టామని అన్నారు.ఆసుపత్రిలో రెవెన్యూ శాఖకు సంబంధించిన అధికారిని ఇంచార్జిగా పెట్టి చికిత్సను పర్యవేక్షిస్తున్నామని, బాలికల తల్లిదండ్రులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పామని అన్నారు. బాలికలు ఒకేసారి అస్వస్థతకు గురికావడానికి గల కారణాలను విచారిస్తున్నామని, అక్కడికి సమీపంలో గల డంప్ యార్డ్ ను తరలించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామని మంత్రి తెలిపారు. 53 మంది బాలికలు క్షేమంగా ఉన్నారని, ఎవరూ ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారు పూర్తిస్థాయిలో కోలుకునే వరకు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది వైద్యులు, కలెక్టర్ నిరంతరం పర్యవేక్షిస్తారని అన్నారు. కేజీబీవీ పాఠశాలలో కూడా పారిశుధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత పై కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ వహిస్తారని, భవిష్యత్తులో బాలికలకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని అన్నారు. ఈ పర్యటనలో మంత్రి వెంట రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ , జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## జనగణనకు మోక్షం

(మొదటి పేజీ తరువాయి)
హోం మంత్రి అమిత్‌షా కొద్దినెలల క్రితం మాట్లాడుతూ..''తగిన సమయంలో ఈ ప్రక్రియను నిర్వహిస్తాం. దానిపై నిర్ణయం తీసుకున్న తర్వాత అది ఎలా జరుగుతుందో నేను ప్రకటిస్తాను. ఈసారి పూర్తిగా డిజిటల్ విధానంలో ఈ సర్వే ఉంటుంది'' అని వెల్లడించారు. వచ్చే ఏడాది జరిగే జనగణనతో భవిష్యత్ సెన్సస్ సైకిల్స్ మారే అవకాశం ఉంది. అంటే ఈ జనగణన 2025-2035 కాలానికే చేపడితే, వచ్చేసారి 2035-2045 కాలానికి లెక్కిస్తారు.

**జనాభా లెక్కలు- 31 ప్రశ్నలు**

ఈ సారి జనగణనలో ప్రజలను అడిగే 31 ప్రశ్నలను రిజిస్ట్రార్ జనరల్, సెన్సస్ కమిషనర్ కార్యాలయం ఇప్పటికే సిద్ధం చేసింది. క్రితం సారి జనాభా లెక్కింపులో అడిగినట్లు కుటుంబ పెద్ద ఎస్సీ లేదా ఎస్టీ సామాజిక వర్గానికి చెందినవారా కాదా అని అడుగుతారు. కుటుంబంలో నివసించే వ్యక్తుల సంఖ్య, కుటుంబ పెద్ద మహిళా కాదా, ఇంట్లో నివాసం ఉండే గదుల సంఖ్య, కుటుంబంలో పెళ్లైన జంటల సంఖ్య వంటి ప్రశ్నలు అడుగుతారు. వీటితో పాటు కుటుంబానికి టెలిఫోన్, ఇంటర్నెట్ కనెక్షన్, మొబైల్/స్మార్ట్‌ఫోన్, సైకిల్, స్కూటర్ లేదా మోటార్ సైకిల్, మోపెడ్, కారు, జీప్ లేదా వ్యాన్ వంటి వాహనాలున్నాయా అనే ప్రశ్నలు అడుగుతారు.

**ఓబీసీ జనాభాను తెలుసుకోవాలి**

ఓబీ సీ జనాభాను తెలుసుకునేందుకు కుల గణన చేపట్టాలని కాంగ్రెస్, ఆర్జేడీ పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. జనాభా లెక్కింపు తర్వాత పార్లమెంట్ నియోజవకర్గాల పునర్ విభజన జరిగే అవకాశాలు ఉన్నాయని, దీని వల్ల దక్షిణాది రాష్ట్రాలు చాలా వరకు సీట్లను కోల్పోయే ప్రమాదం ఉన్నట్లు కొందరు నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.జనాభా నియంత్రలో ఉత్తరాదితో పోలిస్తే దక్షిణాది రాష్ట్రాలు సక్సెస్ అయినట్లు తెలుస్తోంది. ఒకవేళ జనాభా లెక్కల ప్రకారం నియోజకవర్గాలను పునర్ విభజిస్తే, అప్పుడు ఆర్టికల్ 82కు సవరణ చేపట్టాల్సి ఉంటుంది.

**కొవిడ్ కారణంగా ఆగిన జనగణన**

దేశంలో జనగణన ప్రతి పదేళ్లకొకసారి ఆనవాయితీగా నిర్వహించాల్సి ఉంటుంది. కొవిడ్ కారణంగా 2021లో ఆగిన జనగణన- ఆ తర్వాత ఎప్పటికప్పుడు వాయిదా పడుతూ వస్తోంది. రాష్ట్రాలవారీగా, జాతీయస్థాయిలో వేర్వేరు పథకాలకు సంబంధించి 2011 నాటి గణాంకాల ఆధారంగానే లక్ష్యాలు, వ్యయ అంచనాలు రూపొందిస్తున్నారు. తొమ్మిదేళ్ల వ్యవధిలో దాదాపు 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని ఇటీవల నీతి ఆయోగ్ లెక్కలు వెల్లడించాయి. సరైన గణాంకాలు లేకుండా ఈ ప్రకటన చేయడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి.

**జనాభాలో చైనాను అధిగమించినట్లు ప్రకటించిన ఐరాస**

నిరుడు ఏప్రిల్‌లో చైనాను అధిగమించి అత్యధిక జనాభా కలిగిన దేశంగా ఇండియా ఆవిర్భవించినట్లు ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. ప్రస్తుతం చైనా జనాభా 142 కోట్ల కన్నా భారతీయ జనాభా రెండు కోట్లు అధికమన్నది ఒక అంచనాయే తప్ప.. కచ్చితమైన లెక్కలు లేవు. వేర్వేరు పథకాలకు సంబంధించి 2011 నాటి గణాంకాల ఆధారంగానే లక్ష్యాలు, వ్యయ అంచనాలు రూపొందిస్తున్నారు. తొమ్మిదేళ్ల వ్యవధిలో దాదాపు 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారన్న నీతి ఆయోగ్ లెక్కలు వెల్లడించాయి. సరైన గణాంకాలు లేకుండా ఈ ప్రకటన చేయడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అలాగే జనగణన ఒక కొలిక్కి వచ్చేదాకా నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణా ఆగాల్సిందే. ఇదిలాఉంటే.. కులగణన గురించి ప్రతిపక్షాల నుంచి తీవ్ర డిమాండ్లు వస్తున్నాయి. ఈ తరుణంలో తాజా వార్తలు వచ్చాయి. అయితే ప్రభుత్వం దీనిపై అధికారిక ప్రకటన చేయాల్సిఉంది.

## తెలంగాణ సచివాలయ భద్రతా సిబ్బందికి సీఎస్‌వో కీలక ఆదేశాలు

**విశ్వంభర, హైదరాబాద్:** సచివాలయ భద్రతా సిబ్బందికి చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ (సీఎస్‌వో) పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. సచివాలయం చుట్టూ 2 కి.మీ వరకు 144 సెక్షన్ అమల్లో ఉందన్నారు. సిబ్బంది కదలికలు, సోషల్ మీడియాపై నిఘా ఉందన్నారు. పోలీసు అధికారులపై రెచ్చగొట్టే పోస్టులు పెట్టే వాట్సప్ గ్రూపుల నుంచి ఎగ్జిట్ కావాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వం, పోలీసు శాఖకు వ్యతిరేకంగా ఎలాంటి పోస్టులు షేర్, లైక్ చేయొద్దన్నారు. తప్పు జరిగితే వెంటనే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## మోదీకే యుద్ధాన్ని ఆపే శక్తి సామర్థ్యాలున్నాయి

(మొదటి పేజీ తరువాయి)
విషయమన్నారు. ఇందుకోసం నవంబర్‌లో జరగనున్న రెండో ప్రపంచ శాంతి సదస్సుకు ముందు దేశం తనను తాను సిద్ధం చేసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కాగా ఉక్రెయిన్ తన మొదటి శాంతి శిఖరాగ్ర సమావేశాన్ని స్విట్జర్లాండ్‌లో నిర్వహించింది. ఇందులో రష్యా మినహా 92 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. నవంబర్ 5న అమెరికాలో జరగనున్న ఎన్నికల్లో మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వస్తే రష్యాకు మరింత సైనిక సహాయం అందుతుందని జెలెన్‌స్కీ ఆందోళన వ్యక్తంచేశారు. ఇప్పటికే ఉక్రెయిన్‌పై తరచూ దాడులకు పాల్పడుతున్న రష్యాకు ఆయుధ, సైనిక సహాయం అందితే తమపై తీవ్రస్థాయిలో విరుచుకుపడే ప్రమాదం ఉందని అన్నారు. కాబట్టి తాము రూపొందించిన విక్టరీ ప్లాన్‌పై ప్రపంచ దేశాలు తక్షణం చర్చలు జరపాలని కోరారు. నాటో సభ్యత్వాన్ని వెంటనే ఇవ్వమని తాము కోరట్లేదని.. కేవలం ఆహ్వానం మాత్రమే అడుగుతున్నామని ఆయన అన్నారు. రష్యా అత్యాధునిక ఆయుధాలతో తమపై విరుచుకుపడుతుండటంతో గత కొన్ని నెలలుగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పశ్చిమదేశాలను ఆయుధాల కోసం పలుమార్లు అభ్యర్థించారు. రష్యా భీకర దాడులతో అల్లాడిపోతున్న ఉక్రెయిన్‌కు తాము ఐదు వ్యూహాత్మక ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను సరఫరా చేస్తామని అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ ఇటీవల ప్రకటించారు. ఈ యుద్ధం నేపథ్యంలో అమెరికా, రష్యాల మధ్య సంబంధాలు తీవ్రస్థాయిలో దెబ్బతిన్నట్లుగా తెలుస్తోంది. అయితే అమెరికా ఉక్రెయిన్‌కు సైనిక, ఆర్థికసాయం అందించడాన్ని ట్రంప్ తప్పుపట్టారు. అమెరికా ఎన్నికల్లో డెమోక్రటిక్ అభ్యర్థి కమలాహారిస్ కాకుండా రిపబ్లికన్ అభ్యర్థి ట్రంప్ గెలిస్తే ఆయన రష్యాకు మద్దతిస్తారని.. దీంతో రష్యా ఉక్రెయిన్‌పై భారీస్థాయిలో విరుచుకుపడే అవకాశం ఉంటుందని ఉక్రెయిన్ భావిస్తోంది.

## తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

**ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ శాంతికుమారి**

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో భారీగా ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. రంగారెడ్డి కలెక్టర్‌గా నారాయణరెడ్డి, నల్గొండ జిల్లా కలెక్టర్‌గా త్రిపాఠి, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్‌గా హనుమంతరావు నియమితులయ్యారు. బదిలీ అయిన ఐఏఎస్‌ల వివరాలు ఇలా ఉన్నాయి.

- టి.కె.శ్రీదేవి - పురపాలక శాఖ డైరెక్టర్
- మంద మకరందు - సీసీఎల్ఏ ప్రాజెక్టు డైరెక్టర్
- జెడ్.కె. హనుమంతులు - పర్యాటకశాఖ డైరెక్టర్
- దేవాదాయశాఖ సంచాలకులుగా జెడ్.కె. హనుమంతులకు అదనపు బాధ్యతలు
- శశాంక- రాష్ట్ర ప్రాధాన్య ప్రాజెక్టుల కమిషనర్
- ఎస్.హరీశ్ - ఐ అండ్ పీఆర్ ప్రత్యేక కమిషనర్
- హరీశ్‌కు విపత్తు నిర్వహణశాఖ సంయుక్త కార్యదర్శిగా అదనపు బాధ్యతలు
- వినయ్‌కృష్ణారెడ్డి - ఆర్ అండ్ ఆర్ భూసేకరణ కమిషనర్
- ఆయేషా మస్రత్ - వైద్య ఆరోగ్యశాఖ సంయుక్త కార్యదర్శి
- వాణిజ్య పన్నులశాఖ అదనపు కమిషనర్‌గా నిఖిల్ చక్రవర్తికి అదనపు బాధ్యతలు
- కె. చంద్రశేఖర్‌రెడ్డి - డెయిరీ కార్పొరేషన్ ఎండీ
- ఎస్. దిలీప్‌కుమార్ - నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్
- సోని బాలదేవి - క్రీడాశాఖ సంచాలకులు (అదనపు బాధ్యతలు)
- కొర్రా లక్ష్మి - రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ ఎండీ
- స్టేట్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్‌గా కొర్రా లక్ష్మికి అదనపు బాధ్యతలు
- ఎన్. క్షితిజ - ఎస్సీ అభివృద్ధి కార్పొరేషన్ ఎండీ
- సుభద్రా దేవి - జీహెచ్‌ఎంసీ అర్బన్ ఫారెస్ట్రీ అదనపు కమిషనర్
- జి.జ్ఞానేశ్వర్ - వికారాబాద్ డీఎఫ్ఓ

# ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యలపై సీఎంతో చర్చిస్తా..

## ఎమ్మెల్సీ ప్రొ.కోదండరాం



**విశ్వంభర, హైదరాబాద్ :** ప్రైవేట్ ఉపాధ్యాయులపై చర్చించి న్యాయం చేస్తానని ఎమ్మెల్సీ ప్రొ.కోదండరాం అన్నారు. నాంపల్లి లో టీజేఎస్ కార్యాలయంలో టీపీయూసీ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ.. విద్యాభివృద్ధిలో ప్రైవేటు టీచర్ల పాత్ర కీలకమైనదన్నారు. తప్పకుండా న్యాయం జరిగేలా చూస్తానన్నారు. ఈ సందర్భంగా కోదండరాం 20మంది టీచర్లను సన్మానించారు. కార్యక్రమంలో ట్రస్మా రాష్ట కమిటీ సభ్యులు పల్లె వినయ్ కుమార్, అబ్దుల్ సమీర్, అనూష్‌పాషా, సురేంధర్, అజయ్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.








పొంగులేటి శ్రీనివాసరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన టీజీవోల ప్రెసిడెంట్ ఏలూరి శ్రీనివాసరావు, అసోసియేట్ ప్రెసిడెంట్ బీ.శ్యామ్ తదితరులు.

- విశ్వంభర, హైదరాబాద్



డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ వాణి మేడంని కలిసి allied హెల్త్ కేర్ ప్రొఫెషనల్ అసోసియేషన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి కే వంశీ ప్రసాద్, bvoc కనే అర్హత లేని కోర్సులు నడిపిస్తున్న కాలేజ్‌పై విద్యార్థుల సర్టిఫికెట్లను బంధించి వారిని బ్లాక్‌మెయిల్ చేయడం ఆనావాయితిగా వస్తుందని, ఇలాంటి దుశ్చర్యల చేష్టలను అరికట్టాలన్నారు. మోసాలకు పాల్పడుతున్న కొన్ని కాలేజీలపై క్రిమినల్ కేసులు పెట్టి, వాటిని సీజ్ చేయాలని కోరారు.

- విశ్వంభర, హైదరాబాద్

## మాజీ మంత్రి హరీశ్ రావును

# వెంటనే అరెస్ట్ చేయాలి

### ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్



**విశ్వంభర, హైదరాబాద్ :** మాజీ మంత్రి హరీశ్ రావును వెంటనే అరెస్ట్ చేయాలని తెలంగాణ ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. గాంధీ భవన్ లో మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. హరీష్ రావుపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సీఎం అనే రాజ్యాంగబద్ధ పదవిని అగౌరవపరిచే విధంగా హరీశ్ రావు మాట్లాడారని.. ఇది చట్ట వ్యతిరేకమని, అందుకే ఆయనపై బేగం బజార్ పీఎస్‌లో సెక్షన్ 352, 353/1, 353/2 కింద ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఒక శాసన సభ్యుడిగా ఉన్న మీరే ఈ విధమైన వ్యాఖ్యలు చేస్తే.. సామాన్య ప్రజానీకానికి మీరిచ్చే సందేశం ఏమిటని హరీష్ రావు ను ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి గత పది నెలల్లో సీఎం పదవికి ఎంతో ఉన్నతిని తెచ్చారని, ఈ విషయం ప్రజలకు తెలుసన్నారు. సీఎం అనే పదానికి క్రెడిబిలిటీ తీసుకొచ్చిన ఘనత రేవంత్ రెడ్డికే దక్కుతుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ని అవమానకరంగా మాట్లాడితే ఉరుకోమ అని మెట్టు సాయి తెలిపారు. వెంటనే సీఎం రేవంత్ రెడ్డికి హారీష్ రావు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే హరీష్ రావుని అసెంబ్లీ లో అడుగు పెట్టనియ్యమని ఆయన హెచ్చరించారు.

## కల్చర్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో

# మెరిసిన తహనాన్

### అవార్డు అందుకున్న నిమిషా గుమ్మడి





**లాస్ ఏంజెల్స్:** అమెరికాలోని లాస్ ఏంజిల్స్లో ప్రొడక్షన్ డిజైనర్‌గా పనిచేస్తున్న భారతీయ మహిళ లక్ష్మి నిమిషా గుమ్మడి, ప్రస్తుతం అమెజాన్ ప్రైమ్‌లో ప్రసారం అవుతున్న ఫీచర్ ఫిల్మ్ 'తహనాన్'కి అవార్డును అందుకుంది. ఇటీవల కల్వర్ సిటీ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'తహనాన్' ఉత్తమ చలనచిత్ర అవార్డును గెలుచుకుంది.ఈమె లాస్ ఏంజిల్స్‌లోని అమెరికన్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ నుండి గ్రాడ్యుయేట్ పూర్తిచేసింది. అనేక షార్ట్ ఫిల్మ్‌లు, మ్యూజిక్ వీడియోలు వాణిజ్య ప్రకటనలకు ప్రొడక్షన్ డిజైనర్‌గా పనిచేసింది. నిమిషా ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు పట్టణానికి చెందినవారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కల్వర్ ఫిలిం ఫెస్టివల్‌లో తహనాన్ గెలుపొందడం సినిమా విజయం మాత్రమే కాదు, ప్రపంచ వేదికపై ఉన్న భారతీయ ప్రతిభకు మాత్రమే అని గుమ్మడి నిమిషా అన్నారు.ఇటీవలే ఆమె తెలుగు చలనచిత్రాన్ని నిర్మించిన రవికుమార్ నాసు దర్శకత్వం వహించి, శివకుమార్ రామచంద్రవరపు నటించిన 2025లో విడుదల కానుంది.

## నల్గొండ నూతన కలెక్టర్‌గా

# ఇలా త్రిపాఠీ

# బాధ్యతల స్వీకరణ



**విశ్వంభర, నల్గొండ :** సోమవారం నల్గొండ నూతన కలెక్టర్‌గా ఇలా త్రిపాఠీ ఐఏఎస్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం పలువురు కలెక్టర్లను బదిలీ చేస్తూ.. సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. నల్గొండ కలెక్టర్‌గా పనిచేస్తున్న సీ నారాయణరెడ్డిని రంగారెడ్డి జిల్లాకు బదిలీ చేయగా, ఆయన స్థానంలో (2017) ఐఏఎస్ బ్యాచ్ అధికారిణి ఇలా త్రిపాఠిని నియమించింది. రాష్ట్ర పర్యాటక శాఖ సంచాలకులుగా పనిచేస్తున్న ఇలా త్రిపాఠి సోమవారం నల్గొండ జిల్లా నూతన కలెక్టర్‌గా పదవీ బాధ్యతలను చేపట్టారు. నల్గొండ జిల్లా నూతన కలెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన ఇలా త్రిపాఠీకి కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి మోతిలాల్, పలువురు విభాగాల అధిపతులు శుభాకాంక్షలు తెలిపారు.










## సమకాలీన సమాజ దర్పణాలు

# వట్టి కోట నవలలు

సమకాలీనత, యధార్థ జీవన చిత్రణ, సమగ్రత నవలకు ప్రధాన లక్షణాలుగా చెబుతారు. సాధారణంగా కథ ఒక సంఘటన లేదా కొన్ని సంఘటనల మధ్య సంబంధాన్ని చిత్రిస్తే నవల జీవితాన్ని ఒడిసిపడుతుంది. ఆ కాలపు సామాజిక చరిత్రను రికార్డు చేస్తుంది. అలా చేసిన నవలలే తెలుగు సాహిత్యంలో నిలబడగలిగాయి. తెలంగాణ జనజీవితాన్ని అత్యంత వాస్తవిక దృక్పథంతో ఆవిష్కరించిన అతి కొద్ది గొప్ప నవలల్లో వట్టికోట ఆళ్వారుస్వామి ప్రజల మనిషి, గంగు నవలలు పేరెన్నిక గన్నాయి . ప్రజల మనిషి నవల 1935 - 40 మధ్యకాలపు సామాజిక పరిస్థితులను చిత్రిస్తే గంగు నవల 1940-45 మధ్యకాలపు సామాజిక జీవన స్థితిగతులను ఆవిష్కరించింది. తెలంగాణ తొలి సామాజిక నవల ప్రజల మనిషిలో నిజామాబాద్ పరిసర ప్రాంతాలు ఆవిష్కృతం అవుతాయి. కాగా గంగు నవలలో నల్లగొండ పరిసర ప్రాంతాలు కళ్లకు కట్టినట్టు కనిపిస్తాయి. ప్రజల మనిషి నవలలో దొరల దాష్టీకాలు, వెట్టిచాకిరి మత మార్పిడి ఇత్యాది అంశాలు చర్చకు రాగా, ఆంధ్ర మహాసభ ఆవిర్భావం... నిజాం వ్యతిరేక పోరాటాలు, వెట్టి చాకిరి నిర్మూలన ప్రజా చైతన్య ఉద్యమాలు గంగు నవలలో వస్తువు. గంగు నవలను రాజకీయ, సామాజిక , చారిత్రక నవలగా చెప్పవచ్చు. సామాన్యుడి గొడ్డు గోదా కూడా దొరలు బలవంతంగా లాక్కునే దౌర్జన్యకర పరిస్థితులు ప్రజల మనిషి నవలలో కనిపిస్తాయి. కథానాయకుడు కంఠీరవం తల్లిదండ్రులు రఘునాధాచార్యులు , అండాళమ్మ జీవన విధానం వారి సాంప్రదాయిక బ్రాహ్మణ కుటుంబాల జీవన శైలిని ప్రతిబింబిస్తుంది. నాటి బ్రాహ్మణ కుటుంబాలలో పెళ్లిళ్లు, మర్యాదలు, సమాజంలో అంటరానితనం మొదలైన అంశాలు సందర్భానుసారంగా చర్చించారు. హరిజనోద్ధరణ, స్టేట్ కాంగ్రెస్ రాజకీయాలు రామ్ భూపాల్ రావు పాత్ర ద్వారా చక్కగా వివరించారు. ఆనాటి ప్రజల్లో దొరపై పెరుగుతున్న అసహనానికి ప్రతీక కొమురయ్య. దొర మేనాలో బయలుదేరేటప్పుడు ఇద్దరు సేతు సిందీలు బాట ముందుగా బయలుదేరి ఎవరూ కుండలతో ఎదురుకాకుండా, ఎవరూ అరుగుల మీద కూర్చోకుండా చూస్తూ ఉండేవారు అని చెప్పడం నాడు దొరతనం పట్ల ప్రజలలో ఉన్న భయాన్ని, ఏహ్యాభావాన్ని స్పష్టం చేస్తున్నాయి. దొరలు ఎక్కువగా చదువుకోకపోయినా అశక్తులను అణచివేయడమే వాళ్ల గొప్పదనం అని రఘునాధచార్యులు అనడం దొరల దమననీతిని పట్టి చూపుతుంది. కొమురయ్య వేసే తోటను దొర ఇతరులకు కౌలుకు ఇవ్వాలని చూడడం, కథానాయకుడు కంఠీరవంతో కొమురయ్య స్నేహం చేయడం, దొరపై వ్యతిరేక భావన పెంచుకోవడం ఆనాటి ప్రజల మనోస్థితిని ప్రతిఫలించే విధంగా ఉంది. పశువుల కాపరులు అయిన పిల్లలు తెచ్చిన గురిగిలో కంఠీరవం నీళ్లు తాగడం నాటి నాయకుల సంస్కరణ భావాన్ని తెలియచెబుతుంది. దొర చేతిలో కీలుబొమ్మగా మారిన కంఠీరవం అన్న వెంకటాచారి తన రక్త సంబంధాలను సైతం వదులుకోవడానికి సిద్ధపడడం వారి పట్ల అత్యంత క్రూరంగా వ్యవహరించడం ఆనాటి సమాజం లోని కొంతమంది భయంతో, స్వార్థంతో సామాన్య జనాలను ఇబ్బందులకు గురి చేసిన వైనం గుర్తుకు వస్తుంది. కంఠీరవం ఇంటి నుంచి వెళ్లిపోయే సమయంలో అండాళమ్మ పడే వేదన ఆనాటి సామాన్యులైన తల్లులందరి వేదనగా భావించవచ్చు. రైలులో టికెట్లు లేనందుకు దండ కడియం లాక్కోవడం ఆ నాటి పోలీసుల దౌర్జన్యాన్ని బట్టబయలు చేస్తోంది. ప్రజలను మత మార్పిడి, చేయడానికి ఉచిత వైద్యం ఉచిత విద్య ఎరగా వేయడం, సామాన్యులను బలవంతంగా మతమార్పిడి చేయడం వంటి సంఘటనలు అతిసాధారణం అని ప్రజలమనిషి ద్వారా తెలుస్తున్నది.



గ్రంథాలయాలు ప్రజలను చైతన్య పరిచిన విధానం మోహనాచార్యులు పాత్ర ద్వారా తెలుస్తుంది. గ్రంథాలయం ఆవరణలో జాతీయ నాయకుల ఫోటోలు నాటి యువతకు స్ఫూర్తిగా నిలిచాయి. ఆ ఫోటోలను చూసిన కంఠీరవం దేశకాల మాన పరిస్థితులను గురించి ఆలోచించడం అందుకు ఉదావారణ. నైజాం ప్రభుత్వ రాజకీయాలతో పాటు, తెల్లదొరల దాష్టీకాలను కూడా ప్రజల మనిషి నవల చర్చించింది. గుంటనక్క వంటి హైదర్ అలీ నాయకత్వంలో దొర కొమురయ్య భూములను ఆక్రమించుకోవడం, కొమరయ్య తల్లి అన్నమ్మ కూడా దొరకు ఎదురు తిరగడం, హైదర్ అలీ జీతగాడు అయిన కనకయ్యను కొట్టడం దొర జీతగాళ్లలోనూ దొర పట్ల ఒక వ్యతిరేక భావన పెరగడానికి కారణమైంది. నాటి తెలంగాణ అంతటా దాదావు అన్ని గ్రామాలలో అలాంటి పరిస్థితులే ఉండడం గమనార్హం. అణచివేత తీవ్రమైతే తిరుగుబాటు తప్పదని అన్నమ్మ పాత్ర నిరూపించింది. తన భూమిని ఆక్రమించుకోవద్దని దొరలను బతిమాలడానికి వెళ్లిన కొమరయ్యను గుంజకు కట్టి వేసి కొరడాలతో కొట్టడం దొరల దౌర్జన్యానికి పరాకాష్ట. సీతమ్మ పాత్ర ద్వారా ఆనాటి సమాజంలో మనుషుల మధ్య ఉన్న మానవీయ విలువలు సాటి మనిషి దుఃఖంలో పాలుపంచుకోవడం మొదలైన అంశాలు దృశ్యమానం అవుతాయి. మత మార్పిడిని అడ్డుకున్న నేరానికి కంఠీరవంను కొమరయ్యను అరెస్టు చేయడం, న్యాయాధిపతులు, వకీలు, పోలీసులు కుమ్మక్కై ప్రభుత్వ చర్యలను నిరసించిన వారిని ఎటువంటి విచారణ లేకుండా రాజద్రోహం నేరం కింద జైలులో పెట్టడం ఆ కాలంలోని ఆటవిక న్యాయాన్ని ప్రతిఫలిస్తున్నది. తన అనుచరుడైన హైదర్ అలీ మత మార్పిడిని ప్రోత్సహిస్తున్నాడని అతన్ని తిరస్కరించి విజయ్ దేవ్ అనే ఆర్యసమాజ కార్యకర్తను చేరదీస్తాడు రామ్ భూపాల్ రావు, విజయ్ దేవ్ దొర చేస్తున్న అరాచకాలను, దోపిడీని గురించి ప్రశ్నించడంతో విజయ్ దేవ్ పట్ల కూడా కఠినంగా ప్రవర్తిస్తాడు. దొరల పెత్తనానికి అడ్డు వచ్చిన వాడు అనుచరుడైనా, ఆర్యసమాజీయుడైనా ఆగ్రహానికి గురికాక తప్పదని ఈ ఉదంతం స్పష్టం చేస్తున్నది.

నాటి సమాజంలో ప్రజలను చైతన్య పరచడానికి గ్రంథాలయాలు, భజన కార్యక్రమాలు, రాత్రి పాఠశాలలు ఇతోధికంగా వేదికలు అయ్యాయనితెలుస్తున్నది. కంఠీరవం నిజామాబాద్ జైలులో, హైదరాబాద్ జైలులో శిక్ష అనుభవిస్తున్నప్పుడు గ్రామ అధికారుల కుట్రలకు సామాన్య రైతులు ఎలా బలయిపోయారో తెలుసుకుంటాడు. నాటి సమాజ స్వరూపం, పరిపాలన భయంకర దృశ్యం ఈ నవల ద్వారా బహిర్గతమవుతుంది. దొంగతనం నేరంపై జైలుకు వచ్చిన బషీర్ కంఠీరవం బోధనలతో దేశభక్తుడుగా మారడం, జైలులో ఖైదీల హక్కుల కోసం కంఠీరవం పోరాటం చేయడం, అనాటి నాయకుల చిత్తశుద్ధిని ప్రకటిస్తున్నాయి. కులాల పేరిట అనైక్యత వల్లనే మనం ఇటువంటి అన్యాయాలకు బలి అవుతున్నామని, సమిష్టి బాధ్యత సమిష్టి జీవనం, సమిష్టి ఆలోచనలు లేకుండా పోతున్నాయని కంఠీరవం గ్రామ ప్రజలనుద్దేశించి మాట్లాడడం, సహపంక్తి భోజనాలు తదితర సంఘటనలు ఆనాటి సమాజాన్ని సంస్కరించడానికి చేసిన ప్రయత్నాలకు నిదర్శనాలుగా నిలుస్తాయి. వెంకటేశ్వరరావు అనే వకీలు ద్వారా రామ్ భూపాల్ రావు దౌర్జన్యాలను న్యాయస్థానంలో నిరూపించడం ద్వారా అతనికి అతని అనుచరుడు వెంకటాచారికి శిక్ష పడడం నవలలో కొసమెరుపు. వెంకటాచార్యులు స్వయాన కంఠీరవంకు సోదరుడు. తమ్ముడు తన వాడైనా ధర్మం తప్పకూడదు అన్న నీతిని రచయిత ఈ నవలలో చెప్పకనే చెప్పాడు. త్వరలోనే శిక్ష పూర్తి చేసుకొని వచ్చి, తిరిగి గ్రామంపై పెత్తనం చలాయించడం, గ్రంథాలయాన్ని మూత వేయడం, హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు కంఠీరవం , అతని అనుచరులను తిరిగి నిర్బంధించడంతో ఈనవల ముగుస్తుంది.

నాటి తెలంగాణ సమాజానికి దర్పణంగా నిలిచిన నవల ప్రజల మనిషి. 1940 వ్యక్తిగత సత్యాగ్రహాల వరకూ ఈ నవలలో సాంఘిక ప్రజాజీవనం కనిపిస్తుంది. అనంతర కాలాన్ని రికార్డుచేసిన మరొక నవల గంగు. వట్టికోట ఆళ్వారు స్వామి ఆంధ్ర మహాసభ కార్యకర్తగా, కమ్యూనిస్టు కార్యకర్తగా మారిన అనంతరం పరిస్థితులు ఈ నవలలో కనిపిస్తాయి. జగ్గయ్య దొర చేసే అరాచకాలు, అందంగా కనిపించిన స్త్రీలపై అత్యాచారాలు వారి దొరస్వామ్యపు పైశాచికత్వాన్ని ప్రకటిస్తున్నాయి. కంసాలి నాగభూషణం దొరకు విధేయుడు. అతని భార్య అంతమ్మపై దొరకన్నుపడడంతో గ్రామం వదలి రామన్నపేటకు వెళ్లిపోవడానికి సిద్ధపడతాడు. ఇది మనసులోఉంచుకొని నాగభూషణం భూమి లాక్కోవడానికి ప్రయత్నం చేస్తాడు దొర. బలవంతంగా భూములు లాక్కోవడం, అమీన్, దొర కుమ్మక్కై ప్రజలను ఇబ్బందులపాలు చేయడం ఆనాడు నిత్యకృత్యం, తలుపు పెట్టి కొడితే పిల్లి కూడా తిరగబడుతుందనడానికి ఆ నాగభూషణం ఒక ఉదాహరణ. దొరకు ఎదురు తిరిగి ఆంధ్ర మహాసభ కార్యకర్తగా మారిపోతాడు కాంగ్రెస్ ,ముస్లింలీగ్ రాజకీయ వ్యవహారాలు కూడా నవలలో సందర్భానుసారంగా చర్చించబడ్డాయి. ఆనాటి పోలీసు అధికారి అమీన్ ఇంట్లో వెట్టి చాకిరి చేయడానికి నిరాకరించిన వాడిని దారుణంగా కొట్టడం వంటి సంఘటనలు వాడి అధికార దుర్నీతికి నిలువుటద్దాలు.

నవలలో ఒక చోట బ్రాహ్మణుడు ,కంసాలి,హరిజనుడు ఒకే బండిలో ప్రయాణించడం అనే సన్నివేశం ఉంది . ఇది చూసి ప్రజలు అందరూ ఆశ్చర్య పడతారు. ఈ సంఘటన ఆనాటి సమాజంలో అస్పృశ్యత జాడ్యం ఏవిధంగా ఉందో తెలియ జేస్తుంది. గంగు నవలలో కథానాయకుడు నవనీతం. ఈ పాత్ర దేశనాయకుల త్యాగబుద్ధికి ప్రతీకగా నిలిచింది. దొరల ఇళ్లలో దాసి వాళ్లు అడ బాపలు ఎంతటి దయనీయమైన జీవితాన్ని గడిపారో అవగతం అవుతున్నది. కొరడా దెబ్బలు, బండపరుపు లాంటి శిక్షలు నాటి దొరల రాక్షస ప్రవృత్తిని తెలియజేస్తున్నాయి. సుజాత దొరబిడ్డ అయినప్పటికీ గాంధీ మార్గంలో నడుస్తూ దొరతనాన్ని వ్యతిరేకించే శక్తులతో కలిసి నడపడం నాటి సమాజంలో నూతన ఆలోచనా ధోరణికి దర్పణంగా నిలిచింది.

'కమ్యూనిస్టు పార్టీ అంటే మట్టిలో నుంచి మేలిమి బంగారం పుట్టిస్తుంది' అని నాగభూషణం పాత్ర ద్వారా రచయిత పలికించడం నాటి కమ్యూనిస్టులపై ఉన్న ఆదరాభిమానాలను తెలియపరుస్తుంది. రైతులు కౌలుదారుల సమస్యలు, పెత్తందారుల దౌర్జన్యాలు, ప్రభుత్వ ఉద్యోగుల లంచగొండి విధానం, వెట్టి చాకిరి , లెవీ ధాన్యం విషయంలో జరుగుతున్న అవకతవకలు, వీటన్నిటినీ ఎదుర్కొని ప్రజలు సుఖంగా జీవించడానికి ఆంధ్ర మహాసభ ఇచ్చిన రాజకీయ చైతన్యం ఈ నవలలో ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. ఈ విధంగా హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం అయ్యేవరకూ సుమారు రెండు దశాబ్దాల సాంఘిక చరిత్ర వట్టికోట ఆళ్వారుస్వామి నవలలో నిక్షిప్తం చేశారు. అసంపూర్తిగా ఉన్న గంగు నవల పూర్తి చేసి ఉంటే మరింత సమగ్రత వచ్చి ఉండేది. వారి చరిత్రకు సజీవ సాక్ష్యం. తెలంగాణ నుండి గొప్ప నవలా సాహిత్యాన్ని సృజించిన వట్టికోట ఆళ్వార్ సదా చిరస్మరణీయుడు.

**( నవంబర్ 1 వట్టికోట ఆల్వార్ స్వామి జయంతి )**



డాక్టర్ సాగర్ల సత్తయ్య

---

## లోకం... ఒక 'అతిథి గృహం

ఈ జీవితం...
ఒక "పుస్తకమైతే"పఠించక" తప్పదు..!

ఈ జీవితం...
ఒక "నాటకమైతే"నటించక" తప్పదు..!

ఈ జీవితం...
ఒక "రణక్షేత్రమైతే"
"బద్ధశత్రువుల్తో "యుద్ధం చేయతప్పదు..!

ఈ జీవితం...
ఒక "జైలైతే" నిన్ను నీవు
"నిర్దోషిగా" నిరూపించుకోక తప్పదు..!

ఈ జీవితం...
ఒక "సంగీతమైతే" సుఖదుఃఖాల
"శృతిలయలు" ఆలపించక తప్పదు..!

ఈ జీవితం...
ఒక "చిక్కు సమస్యైతే చక్కని
"పరిష్కార మార్గాల్ని"వెతక్క తప్పదు..!

ఈ లోకం...
ఒక "అతిథి గృహమైతే"
"ఆత్మనే అద్దెగా " చెల్లించక తప్పదు...!

ఈ జీవితం...
ఒక "సాగరమైతే"
"సాహసంతో" ఈది తీరంచేరక తప్పదు..!

ఇక చాలు నేలపై
నీ నడక "ఆపమన్న"
పరమాత్మ "పిలుపు విన్న"
మరుక్షణమే మరణం...!
పరలోకానికి పయనం..!
ఆపై ఆ పరమాత్మలో లీనం..!



రచన:
"కవి రత్న"
"సహస్ర కవి భూషణ్"
పోలయ్య కూకట్లపల్లి
అత్తాపూర్ హైదరాబాద్
చరవాణి...9110784502

---

# హక్కుల కోసం అమరుడైన జతీంద్ర నాథ్

**భారత స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో త్యాగధనులు లక్ష్య సాధన కోసం ఆత్మార్పణం చేసుకున్నారు. అలాంటి త్యాగ మూర్తులలో అగ్రభాగాన నిలుస్తాడు జతీంద్ర నాథ్ దాస్. 1929లో 25 ఏళ్ల చిన్న వయస్సులో రాజకీయ ఖైదీల హక్కుల కోసం 63 రోజుల నిరాహార దీక్ష కొనసాగించి ప్రాణ త్యాగం చేసి అమరుడు అయ్యాడు జతీంద్ర. జతీంద్రనాథ్ దాస్ (27 అక్టోబర్ 1904 - 13 సెప్టెంబర్ 1929) స్ఫూర్తిదాయక స్వాతంత్ర్య సమర యోధుడు, మానవ హక్కుల కార్యకర్త, విప్లవ వీరుడు. కలకత్తాలో 1904 అక్టోబర్ 36న జన్మించాడు. చిన్నవయసులోనే బెంగాల్లోని అనుశీలన్ సమితి అనే విప్లవ సంస్థ (20వ శతాబ్దపు భారతీయ విప్లవ సంస్థ)లో చేరాడు. భగత్ సింగ్, హిందుస్థాన్ రిపబ్లికన్ సోషలిస్ట్ అసోసియేషన్ సభ్యులతో కలిసి పనిచేశాడు. 17 ఏళ్ల వయసులో గాంధీజీ ప్రారంభించిన సహాయ నిరాకరణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నాడు. మహాత్మా గాంధీ నడిపిన సహాయ నిరాకరణోద్యమంలో కూడా పాల్గొన్నాడు.**



కలకత్తాలోని విద్యాసాగర్ కాలేజీలో బి.ఎ.చదివే సమయంలో 1925 నవంబరులో రాజకీయ కార్యకలాపాల కారణంగా అరెస్ట్ అయ్యి జైలులో ఉన్నాడు. అక్కడ రాజకీయ ఖైదీలపట్ల చూపుతున్న దురుసు ప్రవర్తనకు నిరసనగా నిరాహారదీక్ష చేపట్టాడు. 20 రోజుల నిరాహార దీక్ష తరువాత జైలు సూపరింటెండెంట్ క్షమాపణ కోరడంతో దీక్ష విరమించాడు. దేశంలోని అన్ని ప్రాంతాలనుండి విప్లవకారులు బాంబుల తయారీకి ఆయన్ను సంప్రదించేవారు. సచీంద్రనాథ్ సన్యాల్ వద్ద బాంబులను తయారు చేయడం నేర్చు కున్నాడు.. భగత్ సింగ్, మరికొందరు విప్లవ వీరులకు బాంబులను తయారు చేశాడు. ఆయన విప్లవ కార్యకలాపాల కారణంగా ఆయనను 1929 జూన్ 14న అరెస్ట్ చేసి లాహోర్ జైలులో పెట్టారు. లాహోర్ జైలులో భారతీయ ఖైదీల పరిస్థితి చాలా దుర్భరంగా ఉండేది. వారు అనేక రోజుల పాటు ఉతకని, మాసిన దుస్తులను ధరించవలసి వచ్చేది. వంటశాలలో బొద్దింకలు, ఎలుకలు తిరుగుతూ ఆహార పదార్థాలను తినడానికి హానికరంగా మార్చేవి. భారతీయ ఖైదీలకు వార్తాపత్రికలను, రాసుకోవడానికి కాగితాలు ఇచ్చేవారు కాదు. కానీ అదే జైలులో బ్రిటిష్ ఖైదీల పరిస్థితి దీనికి భిన్నంగా, పక్షపాతంగా ఉండేది. జతీంద్ర నాథ్ పరిస్థితులను గమనించి యూరోపియన్ ఖైదీలకు సమానంగా భారతీయ ఖైదీలకు సదుపాయాలను కల్పించాలని కోరుతూ కొందరు విప్లవకారులతో కలిసి ఆమరణ నిరాహార దీక్షను చేపట్టాడు. ఆమరణ నిరాహార దీక్ష 1929 జూలై 13 న ప్రారంభమై 63 రోజులపాటు కొనసాగింది. జైలు అధికారులు బలవంతంగా దీక్షను భగ్నం చేయడానికి ప్రయత్నించారు. చివరకు జైలు కమిటీ ఆయనను బేషరతుగా విడుదల చేయాలని సిఫారసు చేసింది. కానీ ప్రభుత్వం దానిని తోసిపుచ్చుతూ బెయిల్ మీద విడుదల కావచ్చని సూచించింది. జతీంద్ర నాథ్ దాస్ భగత్ సింగ్, ఇతర స్వాతంత్ర్య సమరయోధులు కూడా లాహోర్ సెంట్రల్ జైలులో ఈ నిరాహార దీక్ష కొనసాగించారు. జతీంద్ర దాస్ బ్రిటిష్ అధికారులచే దౌర్జన్యాలు, కష్టాలను ఎదుర్కోవలసి వచ్చింది. ఫలితంగా అనారోగ్యం ఆవహించింది. ఊపిరితిత్తులకు హాని కలిగింది. పక్షవాతం శరీర భాగాలకు వ్యాపించడం ప్రారంభించింది. అయినప్పటికీ ఆయన నిరాహార దీక్ష కొనసాగించాడు. అలా ఆయన 1929, సెప్టెంబరు 13వ తేదీన తుది శ్వాస విడిచాడు. విప్లవ వనిత దుర్గావతి దేవి నేతృత్వంలో ఆయన అంతిమ యాత్ర లాహోర్ నుండి కలకత్తా వరకు రైలులో కొనసాగింది. వేలాది మంది శ్రద్ధాంజలి ఘటించడానికి రైల్వే స్టేషన్లకు తరలి వచ్చారు. హౌరా రైల్వే స్టేషన్‌లో శవపేటికను సుభాష్ చంద్రబోస్ స్వీకరించి శవయాత్రకు నేతృత్వం వహించాడు. కలకత్తాలో రెండు మైళ్ళ పొడుగున ప్రజలు బారులు తీరి ఆయనకు తుది వీడ్కోలు చెప్పారు. జతిన్ దాస్ నిరాహార దీక్ష బ్రిటిష్ పాలకుల అక్రమ నిర్బంధాలపై ప్రతిఘటనలో ఒక కీలక ఘట్టంగా నిలిచింది. సుభాష్ చంద్రబోస్ ఆ త్యాగశీలిని "భారత దేశపు యువ దధీచి"గా లక్ష్యం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన పురాతన భారతీయ రుషిగా అభివర్ణించాడు. 2002లో విడుదలైన "ది లెజెండ్ ఆఫ భగత్ సింగ్" సినిమాలో జతిన్ దాస్ పాత్రను అమితాబ్ భట్టాచార్జీ పోషించాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల...**
**9440595494**

---

## నేను మీ నాన్నను...!

నేను మీ నాన్నను
నా కలల్ని త్యాగం చేసుకుని
మీ కలలను సాకారం చేశాను
నేను ఆత్మను ఎవరైతే ప్రళయం సృష్టించారో...!
మీరు సుఖాలను పొంది
నాకు ప్రతిగా ఏమి చ్చారు..?
బహుమతిగా ఇచ్చిందేమిటి...?
నాకు చూయించండి నా ఇల్లు ఎక్కడ...?
వినండి నా ప్రియ తనుజులారా...
నా కథను,గాధను
ఎప్పుడైనా అడిగారా...?
"నాన్న "ఎటు వెళ్లింది మీ "రంగుల బాల్యం" అని...?
గుర్తుంచుకోండి మీరు లేని ప్రపంచాన్ని
నేను ఊహించలేదు...!
నా "యవ్వనం" మొత్తాన్ని మీ "క్షేమం"
కోసమే ధారపోశాను.
మీరు యవ్వనంలో నేను వృద్ధాప్యంలో..!
చూస్తుండగానే రోజులు గడిచి
మృత్యువుకు దగ్గరగా..!
నాకు చూయించండి నా ఇల్లు ఎక్కడ..?
నేను మీ నాన్నను
నా కలల్ని దూరం చేసుకుని
మీ కలల్ని సాకారం చేశాను....



డాక్టర్. మహమ్మద్ హసన్
సహాయ ఆచార్యులు
సెల్ :9908059234

## ప్రభుత్వభూమిలో పార్క్ ఏర్పాటు చెయాలి




**విశ్వంభర, కుత్బుల్లాపూర్ :** నియోజక వర్గం గాజులరామారం సర్కిల్ జగద్గిరిగుట్ట డివిజన్లో ప్రజలకు ఉపయోగపడే విదంగా జగద్గిరిగుట్టలోని 348/1లో ఉన్న ప్రభుత్వ భూమిలో పార్కు ను ఏర్పాటు చెయ్యాలని సోమవారం ప్రజవాణిలో గాజులరామారం సర్కిల్ డిప్యూటీ కమీషనర్ మల్లారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగద్గిరిగుట్ట డివిజన్లో నేటి వరకు ఒక్క పార్కు కూడా లేదని, కాని అనేక ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని ఆ ప్రభుత్వ భూమిలో ఆహ్లాదకరమైన ఒక పార్కును ఏర్పాటు చెయ్యాలని అన్నారు. ముఖ్యంగా 348/1 సర్వే నంబర్లోని రాజీవగృహకల్పలో, పోలీస్ స్టేషన్ పక్కన, ఎదురుగా, అదేవిధంగా హెచ్ ఏం టి ప్రాంతంలో ప్రభుత్వ భూమి ఉందని వీటి పైన నిర్ణయాలను తీసుకొని వెంటనే అమలుచేసేలా చర్యలు తీసుకోవాలని లేకపోతే ఉన్న ప్రభుత్వ భూమి కబ్జాలకు గురవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు స్వామి, హరినాథ్ రావ్, ప్రజానాట్యమండలి కార్యదర్శి ప్రవీణ్, సీపీఐ మండల నాయకులు శేఖర్, ప్రసాద్ పాల్గొన్నారు.

## వెంకటయ్య దహన సంస్కారాలకు ఆర్థిక సాయం



**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండపల్లి మండలం వెంకట్రావుపేట గ్రామానికి చెందిన కమటం వెంకటయ్య అకస్మాత్తుగా సోమవారం మరణించారు. విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ తలకొండపల్లి మాజీ జెడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ.. మూడువేల రూపాయలు, గ్రామ మాజీ సర్పంచ్ కెంచ హైమావతి రమేష్ రెండు వేల రూపాయలు మొత్తం 5000 రూపాయలు ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు రాజు, పాండురంగయ్య, విష్ణు, ఎల్లయ్య, అసత్, శ్రీనివాసులు, జంగయ్య, హుస్సేన్, ఐలయ్య, ఈదమయ్యా, శ్రీశైలం, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల రక్తదాన శిబిరం



**విశ్వంభర, నర్సంపేట :** పోలీస్? అమరవీరుల సంస్కరన దినోత్సవం సందర్బంగా నర్సంపేట పోలీస్ ఆధ్వర్యంలో సిటీజన్ క్లబ్ లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 200 మంది యువకులతో రక్తదానం చేశారు. పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన ఈ శిబిరాన్ని ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్, ఏసీపీ కిరణ్ కుమార్, సీఐలు రమణ మూర్తి, చంద్రమోహన్, సాయి రమణ ప్రారంభించారు. ఈనెల 31 వరకు పోలీసు అమరవీరులను స్మరించుకుంటూ రోజుకో కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. పోలీసులు, యువత పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేశారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ఆపదలో ఉన్న మరొకరి ప్రాణాన్ని కాపాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ మండల ఎస్ఐ లు ఖానాపూర్ రఘుపతి, నర్సంపేట టౌన్ రవికుమార్ , నెక్కొండ మహేందర్, చెన్నారావుపేట రాజేష్ రెడ్డి, దుగ్గొండి వెంకటేశ్వర్లు, నల్లబెల్లి ప్రశాంత్ బాబు, పోలీసులు పాల్గొన్నారు.

## బహుజన సమాజ్ పార్టీ మంథని నియోజకవర్గ అధ్యక్షుడిగా రాజబాబు



**విశ్వంభర, భూపాలపల్లి:** బహుజన్ సమాజ్ పార్టీ ఆదేశాల మేరకు పెద్ద పల్లి జిల్లా ఇంచార్జ్ వరికిల్లా మల్లేష్, జిల్లా అధ్యక్షులు ఇరికిల్లా రాజా నర్సయ్య, కోశాధికారి నర్ల గోపాల్ యాదవ్, ప్రధాన కార్యదర్శి కాంపెల్లి బాబుల సమక్షంలో మంథని నియోజకవర్గ ఇన్చార్జి జనగామ రవికుమార్, మంథని నియోజకవర్గం అధ్యక్షుడిగా కాటారం మండలం కేంద్రనికి చెందిన బొడ్డు రాజబాబును కమాన్ పూర్ మండల్ పెంచికల్ పేట్ గ్రామానికి చెందిన పూరెల్ల రాజేష్ నియోజకవర్గ కార్యదర్శిగా నియమించారు.

## 13వ డివిజన్ రాజీవ్ నగర్ కాలనీలో ఉచిత వైద్య శిబిరం



**విశ్వంభర, బోడుప్పల్ :** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ 13వ డివిజన్ రాజీవ్ నగర్ కమ్యూనిటీ హాల్ డబుల్ బెడ్ రూంల వద్ద ఉచిత హెల్త్ క్యాంపును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక కార్పొరేటర్ దానగల్ల అనిత యాదగిరి హాజరై క్యాంపును ప్రారంభించారు. ఈ ఉచిత హెల్త్ క్యాంపులో సీజన్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యగా దగ్గు, దమ్ము, జ్వరం, బీపీ, షుగర్ లాంటి అనేక పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ నగర్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు, కాంగ్రెస్ నాయకులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి దరఖాస్తుల వెల్లువ



**విశ్వంభర, మహబూబాబాద్ :** మహబూబాబాద్ కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరం లో సోమవారం అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో తో కలిసి జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ ప్రజావాణి కార్యక్రమన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా దరఖాస్తు చేసుకున్నా దరఖాస్తులను పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో వారికి తగిన సమాచారం అందించి సమస్య పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అమీనాపురం గ్రామంలో రేషన్ డీలర్ను నియమించాలని, అంతర్గత రోడ్ల మరమ్మతులు, రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం, ప్రతి గ్రామంలో విలేజ్ లీగల్ సెల్ ఏర్పాటు చేయాలని, కేసముద్రంలో ప్రభుత్వ స్థలాలను పరిరక్షణకై బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజావాణిలో దరఖాస్తు చేశారు. ఇలా తదితర విభాగాలకు చెందిన మొత్తం దరఖాస్తులు ( 91) వచ్చాయని, వాటి పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఏడీ ఎస్ఎల్ఆర్ నరసింహమూర్తి, డీపీఓ హరిప్రసాద్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ నరసింహ స్వామి, డీవీహెచ్ ఓ డాక్టర్ కిరణ్ కుమార్, ఆర్అండ్బీ ఈఈ బీమ్లా నాయక్, డీడీ గ్రౌండ్ వాటర్ సురేష్, డీహెచ్ఓ మరియన్న, జిల్లా మైన్స్ అధికారి వెంకటరమణ, డీఎస్ఓ ప్రేమ్ కుమార్, డీఎం సివిల్ సప్లై కృష్ణవేణి, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, అన్ని విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు అమరులు చేసిన
# త్యాగాలను ప్రతి ఒక్కరు స్మరించుకోవాలి

- డ్రగ్స్ తో యువత భవిష్యత్తు నాశనం అవుతుంది
- వ్యసనాలకు అలవాటు పడవద్దు
- సూర్యాపేట ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్
- 2కే రన్లో ఉత్సాహంగా పాల్గొన్న యువత



**విశ్వంభర, సూర్యపేట:** పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలలో భాగంగా సోమవారం ఉదయం సూర్యాపేట జిల్లా కేంద్రంలో జిల్లా పోలీసుల అధ్వర్యంలో 2 కిలోమీటర్ల పరుగు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్, అధనపు ఎస్పి నాగేశ్వరరావు, జనార్ధన్ రెడ్డి లతో కలిసి పరుగును ప్రారంభించి యువతతో కలిసి 2కిలోమీటర్ల పరుగును పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలలో భాగంగా .. 2కిలోమీటర్ల పరుగు నిర్వహించడం జరిగిందన్నారు. పోలీసు అమరవీరులు చేసిన త్యాగాలను ప్రజలకు తెలియజేయాలని సదుద్దేశంతో, పోలీసులు చేసే కఠినతరమైన విధులను ప్రజలకు తెలియజేయాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. పోలీసు అమరవీరులను అనునిత్యం స్మరించుకుంటూ.. నిరంతరం ప్రజలలో చిరస్మరణీయంగా ఉండటానికి నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలలో పోలీసుల సత్సంబంధాలను మెరుగుపరుచుకోవడానికి బాగా ఉపయోగపడతాయని తెలిపారు. పరుగులో పాల్గొన్న మెడికల్ కళాశాల విద్యార్థులను, యువతను, పౌరులను ఉద్దేశించి డ్రగ్స్, గంజాయి సమాజంలో చాలా ప్రమాదకరమైనవి అని వీటికి దూరంగా ఉండాలని, వీటిని నిరోధించడంలో అందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. చదువుల విషయంలో వత్తిడికి గురైనవారు డ్రగ్స్ తీసుకుంటే ఉత్సాహం వస్తుంది అనేది అపోహ అని దీనికి అలవాటు పడితే క్రమేణా యువత ఆరోగ్యం, భవిష్యత్తు అధికారం అవుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ అదనపు ఎస్పీ నాగేశ్వర రావు, ఏఆర్ అధనపు ఎస్పీ జనార్ధన్ రెడ్డి, సూర్యాపేట డివిజన్ డీఎస్పీ రవి, ఏఆర్ డీఎస్పీ నరసింహ చారి, సీఐ లు రాజశేఖర్, సురేందర్ రెడ్డి, ఆర్ఐ నారాయణ రాజు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐ లు, యువత, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# డబల్ బెడ్ రూంల పేరిట రాజకీయ దందా




**విశ్వంభర, షాద్నగర్:** మున్సిపల్ చైర్మన్ కొందుటి నరేందర్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఎస్ నటరాజన్ మాట్లాడుతూ.. కొందరు కాంగ్రెస్ నాయకుల తీరు వల్ల పట్టణంలో ఇప్పటికే డబల్ బెడ్ రూం ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఇల్లు మంజూరై పట్టాలు చేతికందే టైంలో తిరిగి దరఖాస్తులు చేసుకోవాలని ప్రతి ఇల్లు తిరుగుతూ భయాందోళనలకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఇది రాష్ట్రవ్యాప్తంగా తీసుకున్న నిర్ణయమా, లేక స్థానిక నాయకుల దందాలో భాగమా. సమాధానం చెప్పాలన్నారు. లబ్ధిదారులను ఆధార్, రేషన్ కార్డులతో పాటు ఓటర్ గుర్తింపు కార్డు అడగడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు సంబంధించి ఈ ఏడాది అక్టోబర్ 11వ తేదీన రోడ్ అండ్ డెవలప్మెంట్ శాఖ ద్వారా జీవో జారీ అయిందని, ఈ జీవో ప్రకారం వార్డుల వారీగా కౌన్సిలర్ చైర్మన్ గా, వార్డు అధికారితో కలిసి మహిళ సంఘం సభ్యులతో ఒక కమిటీని ప్రకటించారని, కానీ ఇప్పటిదాకా అది అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలే కమిటీ సభ్యులుగా వార్డుల్లో తిరుగుతూ ఈ భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారన్నారు. నిర్మాణం జరిగిన ఇల్లు లబ్ధిదారుల ఎంపికదాకా వచ్చాక ఇప్పుడు ఈ గందరగోళం సృష్టించడానికి కారణం ఏమిటో అధికారులు, ఎమ్మెల్యే ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. దయచేసి నిరుపేదలను ఇబ్బందులు పెట్టొద్దని అన్ని పార్టీలతో సమావేశం ఏర్పాటు చేసి అర్హుల జాబితాను పరిశీలించాలని సూచించారు. అదేవిధంగా ఎంతో కాలం నుంచి పెండింగ్లో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఎప్పుడు అర్హులకు అందజేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు, కౌన్సిలర్లు యుగంధర్, రెటికల్ నందీశ్వర్, ప్రతాప్ రెడ్డి, ఆలోనిపల్లి శ్రీనివాస్ గౌడ్, కానుగు అంతయ్య, కో ఆప్షన్ సభ్యులు ఒగ్గు కిషోర్, గౌస్, నేతలు మహమ్మద్ ఎజాజ్ (అడ్డు), చీపిరి రవి యాదవ్, సుధీర్, సలీం, పిల్లి శేఖర్, జూపల్లి శంకర్, గుండు అశోక్, నవీన్, శీలం శ్రీకాంత్, చెరుకు శివ, చిన్న, తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి దేప భాస్కర్ రెడ్డి



**విశ్వంభర, ఎల్బీనగర్ :** మహేశ్వరం నియోజకవర్గం ఆర్కే పురం డివిజన్ లోని ఖిల్లా మైసమ్మ దేవాలయ అభివృద్ధికి కృషి చేయాలని అని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు, టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్ రెడ్డి అన్నారు. ఇటీవల ఖిల్లా మైసమ్మ దేవాలయ చైర్మన్గా బాధ్యతలు స్వీకరించిన కుంచారపు సురేంద్ర కుమార్ (సురేష్), డైరెక్టర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దేప భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. చైర్మన్, ధర్మకర్తలు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. పురాతనమైన దేవాలయ పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూదన్ రావు, వెంకటేష్ గౌడ్, జ్ఞానేశ్వర్ యాదవ్, ఖిల్లా మైసమ్మ డైరెక్టర్లు కేతావత్ రాజు నాయక్, పగడాల శ్రీశైలం, ఎల్లికంటి శ్రీశైలం, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాల సందర్భంగా వాలీబాల్ టోర్నమెంట్ విజేతలకు బహుమతి ప్రదానం



**విశ్వంభర, మెట్పల్లి :** అమరవీరుల సంస్మరణ దినోత్సవం 21 అక్టోబర్ సందర్భంగా జగిత్యాల జిల్లా మెట్ పల్లి మినీ స్టేడియంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఫైనల్ మ్యాచ్లో గెలుపొందిన విజేతలకు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మెట్ పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు సబ్ డివిజన్లో గల పోలీస్ స్టేషన్ పరిధిలోని యువకులతో క్రీడా కార్యక్రమాలు నిర్వహించాలని సర్కిల్కు చెందిన ఎస్ఐలకు సూచించారు. వాలీబాల్ టోర్నమెంట్ లో గెలుపొందిన క్రీడాకారులకు డీఎస్పీ ఉమామహేశ్వరరావు, సీఐ నిరంజన్ రెడ్డి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో డీఎస్పీ ఉమామహేశ్వరరావు సీఐ నిరంజన్ రెడ్డి, మెట్పల్లి ఎస్ఐ చిరంజీవి మల్లాపూర్ ఎస్సై కిరణ్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## న్యూడెమోక్రసీ బహిరంగ సభను జయప్రదం చేయాలి



**విశ్వంభర, మహబూబాబాద్ :** మహబూబాబాద్ పట్టణంలోని బట్టు అంజయ్య స్మారక భవనంలో సోమవారం కర పత్రలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భూమికోసం భుక్తి కోసం దేశ ముక్తి కోసం నూతన ప్రజాస్వామ్య రాజ్యం పేరా బుడకపు ఎన్కౌంటర్లు గుండాలు మాఫియాల చేత అనారోగ్యాలతో అనేకమంది విప్లవకారులు విప్లవ ఉద్యమంలో అమరులయ్యారు వారి ఆశయ సాధన తుద కంట ముందుకు సాగుతామని నవంబర్ 1 నుండి 9 వరకు గ్రామ గ్రామాన సంతాప సభలు స్మారక సభలు జరపాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ, మహబూబాబాద్ డివిజన్ కార్యదర్శి కామ్రేడ్ హలవత్ లింగన్న జిల్లా నాయకులు గుజ్జు దేవేందర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా, నాయకులు సామ పాపయ్య, తెల్లబోయిన లక్ష్మయ్య బోనగిరి మధు , తెలబోయిన కృష్ణ, విజయ్, శ్యామ్ సుష్మంత్ తదితరులు పాల్గొన్నారు.

## స్కాలరిప్స్ విడుదల చేయాలి




**విశ్వంభర, మహబూబాబాద్ :** ప్రజా పాలన సవంత్సర కాలం సంబురాలు జరుపుకోకముందే స్కాలర్షిప్లు విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్, కో కన్వీనర్ పట్ల మధు, గుగులోతు సూర్య ప్రకాష్ అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మహబూబాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే మురళీ నాయక్ కార్యాలయం ముట్టడి దాదాపు కిలోమీటరు మేరకు హొరెత్తిన నినాదాలతో వందలాదిమందితో ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రంలో ప్రజాపాలన ఏర్పాటై దాదాపు సంవత్సర కాలం గడుస్తున్నా ఇంతవరకు విద్యార్థులను పట్టించుకోవడం లేదు అంటే కేవలం విద్యా వ్యతిరేక పాలనే అని ఎస్ఎఫ్ఐ నేతలు ప్రభుత్వాన్ని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కో కన్వీనర్ గంధసిరి జ్యోతి బాస్, కన్వినింగ్ కమిటీ సభ్యులు బానోత్ సింహాద్రి, భూక్యా రాజేష్ , గుండ్ల రాకేష్, కొలిపాక వీరేందర్, పట్టణ నాయకులు చరణ్, బొందు, రంజిత్, అరుణ్, ప్రసాద్ కళ్యాణ్, అఖిల, అనితా విద్యార్థులు పాల్గొన్నారు.

## తుక్కుగూడ మున్సిపాలిటీలో పర్యటించిన చైర్మన్ బరిగెల హేమలత రాజు గౌడ్



**విశ్వంభర, మహేశ్వరం :** తుక్కుగూడ మార్కెట్ యార్డులో బీసీ కమ్యూనిటీ హాల్ పనులను సూరం చెరువులో బతుకమ్మ ఘాట్ ఏర్పాటు కొరకు స్థలాన్ని చైర్మన్ బరిగెల హేమలత రాజు గౌడ్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ ఫ్లోర్ లీడర్ ఎరుకల శివకుమార్ గౌడ్, తూర్పు జయరాజ్, బాదావత్ రవి నాయక్ నాయకులుపాశం కృష్ణ, కుక్కల కృష్ణ ముదిరాజ్, బాదావత్ శ్రీనివాస్ నాయక్, దొంత్రమోని రాజు, లవ కుమార్, ప్రశాంత్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## కేఎల్ఆర్ ను కలిసిన మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ నాయకులు



**విశ్వంభర, మహేశ్వరం :** తుక్కుగూడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జి కేఎల్ఆర్ ను శ్రీ దత్త ఎంటర్ ప్రైజెస్ మెమోంట్లల్ను మహేశ్వరం ఎల్ఎన్టీ యూసీ అధ్యక్షుడు నడికూడ శివ, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి మెమోట్లల్ కేఎల్ఆర్ కు అందజేశారు. కార్యక్రమంలో ఒత్తుల రఘుపతి, నేనావత్ రాజు నాయక్, అల్లే కుమార్, రవి నాయక్, రోహిత్, కార్తీక్ పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన



**విశ్వంభర, బోడుప్పల్ :** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ 20వ డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీలో రూ.20 లక్షల నిధులతో స్థానిక కార్పొరేటర్ జెడిగె మహేందర్ యాదవ్ ఆధ్వర్యంలో సీసీ రోడ్డు నిర్మాణ అభివృద్ధి పనులకు మేయర్ తోటకూర అజయ్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొత్త కిషోర్ గౌడ్, శ్రీశైలం,కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం



**విశ్వంభర, తలకొండపల్లి :** తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో బీసీ కాలనీలో 10 లక్షల రూపాయల సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్ యాదవ్, జడ్పీ కో ఆప్షన్ మాజీ సభ్యుడు మూజీబూర్ రహేమాన్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస మూర్తి ఏ ఈ విక్రమ్ రెడ్డి,కార్యదర్శి శరత్, మాజీ ఉప్ప సర్పంచ్ అజిజ్, నర్సింహ, నాయకులు నరందర్ గౌడ్, వెంకట్ రెడ్డి, విజయ్ కుమార్, యాదయ్య, దర్శన్, అభిలాష్ గౌడ్, విజయ యాదవ్, బాలస్వామి, రవి, పరంధాములు, యాదగిరి, నర్సింహ, మధు, సాయి తదితరులు పాల్గొన్నారు.

## పేద వైద్య విద్యార్థినికి ఆర్థిక సాయం



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, శోభనా ద్రిపురం గ్రామం లోని పేద కుటుంబానికి చెందిన ఎండీ సానియా ఎంబీబీఎస్ లో సీటు సాధించింది. కానీ తన కుటుంబ ఆర్థిక పరిస్థితి సహకరించక దాతల కోసం ఎదురు చూసింది, విషయం తెలుసుకున్న తెలంగాణ డెయిరీ కార్పోరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి తన వంతు సాయంగా 50 వేల రూపాయలు ఆర్థిక సహాయం ఆ అమ్మాయికి అందచేశారు.

## కాళేశ్వర ఆలయ హుండీ ఆదాయం రూ.22 లక్షలు



**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం యొక్క హుండీలను ఆలయ కార్యనిర్వహణాధికారి మారుతి ఆధ్వర్యంలో విప్పి డబ్బులు లెక్కించారు. హుండీల పర్యవేక్షణాధికారిగా నందనం కవిత ఇన్స్పెక్టర్ పాల్గొన్నారు. 3 నెలల 25 రోజులకు గాను 22,27,805/-రూపాయల ఆదాయం వచ్చినది. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి ఏ మారుతి, పర్యవేక్షణాధికారి ఎన్ కవిత, దేవస్థానం సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, యూనియన్ బ్యాంక్ సిబ్బంది, దేవస్థానం సిబ్బంది, అన్నమయ్య సేవా ట్రస్ట్ కరీంనగర్ సభ్యులు, శ్రీ రాజరాజేశ్వర సేవా సమితి సభ్యులు కామారెడ్డి, లలిత సేవా ట్రస్ట్ కరీంనగర్ సభ్యులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వినియోగ రహిత సమాజంకై కృషి చేయాలి: పరికిపండ్ల నరహరి



**విశ్వంభర, ఎల్బీనగర్ :** ప్లాస్టిక్ వినియోగ రహిత సమాజంకై కృషి చేద్దాం అని మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ పరికిపండ్ల నరహరి అన్నారు. సోమవారం నాలుగు సార్లు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ పొందిన విభిన్న పాత్రాభినయ కళాకారులు, రచయిత, సోషల్ వర్కర్ డా. పెండెం కృష్ణ కుమార్ శామీర్‌పేట్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి క్లాత్ బ్యాగ్ ను అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణ కుమార్ చేస్తున్న సేవా కార్యక్రమాలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంగం జేఏసీ కన్వీనర్ పెండెం ధనుజయ, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కార్యకర్త కుటుంబానికి చేయూత



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రానికి చెందిన యువజన కాంగ్రెస్ నాయకులు మజ్జిగ రవీందర్ తండ్రి సీనియర్ కాంగ్రెసు నాయకులు మజ్జిగ యాదయ్య అనారోగ్యంతో మరణించారు. వారి కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు పరామర్శించి వారి పార్థివ దేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య స్ఫూర్తితో వారి కుటుంబానికి తాజా మాజీ సర్పంచ్ జన్నాయికోడె నగేష్ రూ. 5000 ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి, పిఎసిఎస్ ఛైర్మెన్ జిల్లాల శేఖర్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు పోతగాని మల్లేష్ గౌడ్, పిఎసిఎస్ డైరెక్టర్ నోముల వెంకట్ రెడ్డి, నాయకులు ఎద్దు వెంకన్న, పైళ్ల దామోదర్ రెడ్డి, దొంతరబోయిన భాస్కర్, రంగ స్వామి, కోరే కనకయ్య, కోరే మల్లేష్, దిగోజు శ్రీనివాసచారి, ఉగ్గె నరేష్, కోరే యాదయ్య, కోరే పాండు, మాధ రాంబాబు, బూడిద శేఖర్, చిత్తర్ల అనిల్, మజ్జిగ ఎలేందర్, తవిటి రాజు, తొండల అనిల్, దిగోజు సురేంద్రచారి, లోడి మహేష్, కొండపల్లి సాంబ, మజ్జిగ రామనర్సయ్య, నర్సయ్య, శ్రీశైలం, కొమురయ్య, ఐలయ్య, కొంగరి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## కాసాని వీరేశంను కలిసిన నేతాజీ యువజన మండలి సభ్యులు



విశ్వంభర, ఆత్మకూరు(ఎం) : తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన కాసాని వీరేష్ ముదిరాజును నేతాజీ యువజన మండలి సభ్యులు హైదరాబాదులోని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అధ్యక్షులు ఎన్నికైన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సత్కరించారు. ఎన్ వై ఎం ఆధ్వర్యంలో నిర్వహించే కబడ్డీ క్రీడలకు, క్రీడాకారులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని వీరేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌వైఎం మాజీ అధ్యక్షులు చెరుకు శ్రీనివాస్ గౌడ్, దొంతర బోయిన భాస్కర్, సభ్యులు ఎలగందుల మహేష్, పలారం బండి మధు, మాటూరి గణేష్, యాస సుభాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అధిక ధరలను వెంటనే తగ్గించాలి

- కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు నశించాలి
- కేరళ తరహాలో రేషన్ షాపుల ద్వారా 14 రకాల నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలి
- సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నాలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి



**విశ్వంభర, సూర్యాపేట కలెక్టరేట్ :** దేశవ్యాప్తంగా రోజురోజుకు పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని సిపిఎం సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం కేంద్ర కమిటీ పిలుపు మేరకు సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు సిపిఎం సూర్యాపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో నిత్యవసర సరుకుల ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయని, వాటిని నియంత్రించడంలో బిజెపి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. 2024 ఎన్నికలలో అచ్చుద్దిన్ పేరుతో దేశంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు కావస్తున్నా నాటి నుండి నేటి వరకు దేశవ్యాప్తంగా అన్ని రకాల నిత్యవసర వస్తువుల ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయని. పెరుగుతున్న ధరలను అరికట్టేందుకు చర్యలు చేపట్టడంలో కేంద్ర బిజెపి ప్రభుత్వం పూర్తిగా వైఫైల్యం చెందిందని విమర్శించారు. పెరిగిన ధరలతో పేద, మధ్యతరగతి ప్రజలు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ సంపదను మాత్రం పెద్ద పెద్ద కార్పొరేట్ సంస్థలకు కట్ట పెడుతున్నారని విమర్శించారు. బిజెపిఅధికారాన్ని అడ్డుపెటుకొని కార్పొరేట్ శక్తులు ప్రజల సంపదను లూటీ చేస్తున్నారనిఅన్నారు. ధరల భారం ప్రజలపై పడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రభుత్వ ఆహార సంస్థలలో మూలుగుతున్న బియ్యం, గోధుమలు తదితర నిత్యవసర వస్తువులను పేదలకు ఉచితంగా పంపిణీ చేయాలన్నారు. ధరలు పెంచేందుకు బడాబాబులు బ్లాక్ మార్కెట్ల లో నిలువ ఉంచిన నిత్యవసర వస్తువులను వెలికి తీసి పేదలకు ఇవ్వాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని డిమాండ్ చేశారు. కేరళ సిపిఎం ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా 14 రకాల నిత్యవసర వస్తువులను ప్రజలకు అందిస్తుందని దేశవ్యాప్తంగా ఈ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలనికోరారు.

అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ కు తేజస్వ పవర్ లాల్ నందకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు,కొలిశెట్టి యాదగిరి రావు, పారేపల్లి శేఖర్ రావు,మేదరమెట్ల వెంకటేశ్వరరావు, మట్టిపల్లి సైదులు, నాగరపుపాండు,కోట గోపి,చెరుకు ఏకలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు జిల్లపల్లి నరసింహారావు, ధనియాకుల శ్రీకాంత్, వేల్పుల వెంకన్న, వీరబోయిన రవి, మేకన బోయిన సైదమ్మ, కొప్పుల రజిత,మేకన బోయిన శేఖర్, పులుసు సత్యం, కొదమగుండ్ల నాగేష్, పల్లె వెంకటరెడ్డి, కందల శంకర్ రెడ్డి, బెల్లంకొండ సత్యనారాయణ,బుర్ర శ్రీనివాస్,దండ వెంకటరెడ్డి, పాం డు నాయక్,నాయకులు ములకలపల్లి రా ములు, సిరికొండ శ్రీను,అవిరే అప్పయ్య, వల్లపు దాసు సాయికుమార్, ములుకూరి గోపాల్ రెడ్డి, బాలు నాయక్,కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలపై సత్వర పరిష్కారం చూపాలి

### కలెక్టర్ రాహుల్ శర్మ



**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల సమస్యలపై స్పందిస్తూ.. వారికి సత్వర పరిష్కారాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశపు హాలులో అన్ని శాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల విజ్ఞప్తులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఎండార్స్మెంట్ చేశారు. ఈ సందర్భంగా సమస్యలపై వచ్చిన ప్రజలతో కలెక్టర్ రాహుల్ శర్మ ఆత్మీయంగా మాట్లాడుతూ.. “మీ పేరేంటి, ఏ మండలం, సమస్య ఏంటి చెప్పండి” అంటూ ప్రాథమిక వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదును స్వయంగా స్వీకరించి, వాటికి తగిన పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించడమే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యమని కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. కాటారం గ్రామం, మండలానికి చెందిన పయ్యావుల పర్వతాలు తనకు 30 గేదెలు ఉన్నాయని వాటి సంరక్షణకు ఉపాధి హామీ పథకం కింద క్యాటిల్ షెల్టర్ ఏర్పాటుకు దరఖాస్తు చేసుకున్నానని, ఏపీఓ అంచనాలు తయారుచేసి పీడీ కార్యాలయానికి పంపించారని ఇంతవరకు మంజూరు కాలేదని కావున తనకు ఉపాధి హామీ పథకంలో కాటిల్ షెల్టర్ మంజూరు చేయగలరని చేసిన దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ తగు చర్యలు నిమిత్తం డీఆర్డీఓకు ఎండార్స్మెంట్ చేశారు. ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సెక్యూరిటి, పేషేంట్ కేర్, శానిటేషన్ సిబ్బంది రెండు నెలలుగా వేతనం సరిగా రావడం లేదని, నెల వేతనం 15 వేలు కాగా 11 వేలు మాత్రమే ఇస్తున్నారని ఈపీఎఫ్, ఈ ఎస్ ఐ కటింగ్స్ గురించి అడిగితే సరియైన సమాధానం ఇవ్వడం లేదని, గత రెండు సంవత్సరాలు నుంచి ఒకటే యూనిఫామ్ ఇవ్వడం జరిగిందని, ఐడి కార్డ్స్ ఇవ్వడం లేదని, యూనిఫామ్ కొరకు తమ నుండి 4200 వసూలు చేసి ఒకటే ఇచ్చారని క్రమం తప్పక ప్రతి నెల వేతనాలు ఇప్పించాలని చేసిన దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ తగు చర్యలు నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ కు ఎండార్స్మెంట్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఆర్డీఓ మంగిలాల్, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కలగానే మిగిలిన చిరు వ్యాపారస్తుల కోరిక

- రోడ్డుపై పడ్డ చిరు వ్యాపారుల కుటుంబాలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు
- వెంటనే మండల కాంప్లెక్స్ భవన నిర్మాణం పనులు చేపట్టాలి



**విశ్వంభర, ఆమనగల్లు :** అమనగల్లు మండల కేంద్రంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయం చుట్టూ చిరు వ్యాపారులు డబ్బాలు చిన్న చిన్న దుకాణాలు వేసుకొని వ్యాపారం చేసుకునే వాళ్ళు కానీ గత మూడు సంవత్సరాల కింద రోడ్డు, చౌరస్తా వెడల్పులో భాగంగా డబ్బాలు, షాపులను తొలగించారు. అనంతరం షాపులు కోల్పోయిన చిరు వ్యాపారస్తులకు మండల కార్యాలయం చుట్టూ ప్రభుత్వ స్థలంలో మండల కాంప్లెక్స్ భవనాన్ని నిర్మించి ఇస్తామని మాజీ ప్రజా ప్రతినిధులు తెలిపారు. గత ఎలక్షన్లో కూడా అన్ని పార్టీల వారు హామీ ఇచ్చిన ఎవరు కూడా పట్టించుకోవడంలేదని వ్యాపారస్తులు వాపోతున్నారు నేతలు మారిన వ్యాపారుల తలరాత మాత్రం మారడం లేదు. అమనగల్లు పట్టణంలో ప్రధాన రవాదానికి ఇరువైపులా హొటలు, మెకానిక్ షాప్ లు, ఏర్పాటు చేసుకొని వందలాది కుటుంబాలు జీవనోపాది పొందేవారు. ఇప్పుడు రోడ్డున పడ్డారు. శ్రీశైలం హైదరాబాద్ జాతీయ రహదారి రావడంతో పదేళ్ల క్రితం చాలామంది వ్యాపారస్తులు అభివృద్ధి గురించి ఆలోచించి స్వచ్ఛందంగా షాపులు తీసేసుకున్నారు అనంతరం కాంప్లెక్స్ భవనానికి గత ప్రభుత్వంలో అనుమతులు రాగా టెండర్ ప్రక్రియకు విరుద్ధంగా చిరు వ్యాపారస్తులు మాకే షాపులు కేటాయించాలని కోర్టుకు వెళ్లడంతో కాంప్లెక్స్ నిర్మాణం ఆగిపోయింది. ఇప్పటికైనా వ్యాపారస్తులకు అనుకూలంగా మండల కాంప్లెక్స్ భవనాన్ని నిర్మిస్తే చిరు వ్యాపారస్తులు కోర్టులో ఉన్న కేసును వాపసు తీసుకుంటామని తెలిపారు. ప్రజా ప్రతినిధులు ఎన్నికలలో ఇచ్చిన హామీలో భాగంగా ఆమనగల్లు మండల పరిషత్ మరియు ఉన్నత పాఠశాల ముందు భాగంలో దుకాణ సముదాయాలు కేటాయించి రోడ్డున పడ్డ చిరు వ్యాపారస్తులను ప్రభుత్వం ఆదుకోవాలని సోమవారం స్థానిక ఎంపీడీవో కుసుమ మాధురిని కలిసి వినతిపత్రం అందజేశారు. త్వరలో చిరు వ్యాపారస్తులు కార్యాచరణ మొదలుపెట్టి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీ మల్లు రవి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను కలిసి మండల కాంప్లెక్స్ భవన నిర్మాణం చేపట్టే విధంగా ముందుకెళ్తామని చిరు వ్యాపారస్తుల సంఘం నాయకులు గాజుల శ్రీను తెలిపారు.

## పరిగి పట్టణంలో బీజేపీ సభ్యత్వ నమోదు



**విశ్వంభర, పరిగి :** పరిగి పట్టణంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం సోమవారం బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు సౌందర్య ఆధ్వర్యంలో నిర్వహించారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ వికారాబాద్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు శిరీష హాజరయ్యారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ.. ప్రపంచంలో అతిపెద్ద పార్టీగా భారతీయ జనతా పార్టీ నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో అవతరించిందని తెలిపారు. నరేంద్ర మోడీ పాలన నచ్చి దేశ ప్రజలందరూ భారతీయ జనతా పార్టీలోకి స్వచ్ఛందంగా వచ్చి సభ్యత్వ నమోదు చేసుకోవడం చాలా సంతోషకరమన్నారు. రాబోవు రోజుల్లో కూడా తెలంగాణలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేయడం కాయం, మహిళా మోర్చా ఆధ్వర్యంలో పరిగిలో పెద్ద ఎత్తున సుమారు 300 మంది సభ్యత్వం తీసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షులు మాధవి, విజయలక్ష్మి, జిల్లా కార్యదర్శి వాణిశ్రీ, బీజేవైఎం జిల్లా కోఆర్డినేటర్ అనిల్, బీజేపీ పట్టణ అధ్యక్షులు బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ పేరుతో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

### స్వామివివేకానంద సేవా బృందం అధ్యక్షుడు శివ కుమార్



**విశ్వంభర, కల్వకుర్తి :** కల్వకుర్తి పట్టణానికి చెందిన స్వామి వివేకానంద సేవా బృందం, మై భారత్ – జిల్లా యువజన, క్రీడా శాఖ ఆధ్వర్యంలో (ఏక్ పేడ్ మా కా నామ్) అమ్మ పేరుతో ఒక మొక్క నాటాలి అనే కార్యక్రమం స్థానిక గాంధీనగర్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి నీరు పోశారు. సేవ బృందం అధ్యక్షుడు శివ కుమార్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు ప్రతీ ఒక్కరు అమ్మ పేరుతో మొక్కలు నాటాలి అని మొక్కలు నాటడం వలన ప్రకృతి బాగుంటుంది కాలుష్యాన్ని జయించిన వారిమౌతామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సునీత, ఉపాధ్యాయులు ప్రదీప్ కుమార్, అంగన్వాడీ టీచర్ ఫాతిమా, సేవా బృందం సభ్యులు లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## గుత్తా వెంకట్ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయం



**విశ్వంభర, సంస్థాన్ నారాయణపురం :** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని వెంకం భావి తండాకు చెందిన పానుగోతు గోవర్ధన్(34) గత తొమ్మిది సంవత్సరాల క్రితం కొబ్బరి చెట్టు పైనుంచి పడి గాయాలపాలై మంచానికే పరిమితమయ్యాడు. గుత్తా వెంకట్ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, డైరీ ఛైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, విషయాన్ని తెలుసుకుని వెంటనే వారి కుటుంబానికి 10,000 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గుత్తా యువసేన వ్యవస్థాపక అధ్యక్షులు, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు వనమా వెంకటేశ్వర్లు, గుదే లింగస్వామి, చిలివేరు రమేష్,బర్ల వెంకటేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను చట్టపరంగా పరిష్కరించాలి



**విశ్వంభర, భూపాలపల్లి :** ప్రజల సమస్యలను చట్టపరంగా పరిష్కారం చేయాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. సోమవారం ప్రజాదివాస్ కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబంధిత పోలీసు అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజాదివాస్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 23 మంది బాధితుల నుంచి అర్జీలను స్వీకరించి, వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత స్టేషన్ల ఎస్ఐ, సీఐలకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని, పరిష్కారానికి సూచనలు చేయడం జరిగిందని అన్నారు. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా, స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకోవాలని ఎస్పీ కోరారు.

## ఎస్‌ఎన్‌డీపీ పనులు పూర్తి సత్ఫలితాలు ఇస్తున్నాయి

### ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



**విశ్వంభర, ఎల్బీనగర్ :** ఎస్ఎన్‌డీపీ పనులు పూర్తి సత్ఫలితాలు ఇస్తున్నాయి అని ఎల్బీనగర్ శాసనసభ్యుడు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. సోమవారం లింగోజిగూడా డివిజన్ పరిధిలోని ధర్మపురి కాలనీ, చుట్టుపక్కల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో చిన్నపాటి వర్షానికి కాలనీలో ఇండ్లలోకి , రోడ్డు మీదకు వరదనీరు వచ్చి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు అని తెలిపారు. వరదనీరు రాకుండా ఉండడానికి అధికారులతో పలు దఫాలుగా చర్చించి ఎస్ఎన్‌డీపీ డ్రైన్స్ నిర్మించినట్లు తెలిపారు. డ్రైన్స్ నిర్మించకముందు చిన్నపాటి వర్షానికి వరదనీరు ఇండ్లలోకి వచ్చి కాలనీవాసులు ఫోన్లు చేసి తమ సమస్యలు చెప్పుకునేవారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండడం జరుగుతుందన్నారు. నియోజకవర్గ పరిధిలోని మరికొన్ని ఎస్ఎన్‌డీపీ పనులు చేపట్టి పూర్తి స్థాయిలో వరదముంపు నుంచి విముక్తి కలిగించడం జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గ అభివృద్దే తన లక్ష్యం అని తెలిపారు. కార్యక్రమంలో తిలక్ రావు, సుజిత్, చిత్రం సాయి, దిలీప్ పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలి

### జిల్లా అదన కలెక్టర్ లింగ్యా నాయక్



**విశ్వంభర, వికారాబాద్ :** ప్రజావాణి దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ తెలిపారు. సోమవారం కల్లెక్టరేట్ సమావేశం హాలులో జరిగిన ప్రజావాణికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చి అందించిన ప్రజా వినతులు, ఫిర్యాదులను జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ స్వీకరించారు. ప్రజావాణిలో మొత్తం (119 ) దరఖాస్తులు రాగా, భూ సమస్యలు, రైతు రుణ మాఫీ, ఇతర సమస్యల కు సంబంధించి ధరఖాస్తులు వచ్చాయని, స్వీకరించిన వాటిలో కొన్నింటిని సత్వరమే పరిష్కరించారు. వివిధ శాఖలకు చెందిన అర్జీలను సంబంధిత శాఖ అధికారులకు పంపించి పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు చేసుకున్న దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో వారికి తగిన సూచనలు ఇవ్వాల్సిందిగా అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ శ్రీనివాస్, ఆర్‌డీఓ వాసు చంద్ర, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పదవికి మహారాష్ట్ర మాజీ సీఎం నామినేషన్



**ముంబయి:** మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పృథ్వీరాజ్ చవాన్ కరాద్ సౌత్ అసెంబ్లీ స్థానం నుంచి నామినేషన్ దాఖలు చేశారు. నియోజకవర్గానికి చెందిన పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయానికి వెళ్లిన పృథ్వీరాజ్ చవాన్.. రిటర్నింగ్ అధికారికి తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. మహారాష్ట్ర, జార?ండ్ రాష్ట్రాల్లో వచ్చే నెలలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. జార?ండ్‌లో నవంబర్ 13, 20 తేదీల్లో రెండు విడతల్లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనుండగా.. మహారాష్ట్రలోని 288 స్థానాలకు ఒకే విడతలో నవంబర్ 20 పోలింగ్ నిర్వహించనున్నారు. రెండు రాష్ట్రాల్లో ఈ నెల 23న ఓట్లను లెక్కించి, ఫలితాలను వెల్లడించనున్నారు. మహారాష్ట్రలో అధికార మహాయుతి కూటమి, ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ కూటమి మధ్య ప్రధాన పోటీ నెలకొని ఉంది. మొత్తం ఆరు ప్రధాన పార్టీలు రెండు కూటములుగా ఏర్పడి పోటీపడుతున్నాయి.

# కొత్త తరం నాయకత్వాన్ని బారామతి ఆదరించాలి

- యుగేంద్ర పవార్ విదేశాల్లో చదువుకున్నాడు
- విద్యావంతుడికి మా పార్టీ అవకాశం ఇచ్చింది
- నామినేషన్ సందర్భంగా శరద్ పవార్



**ముంబయి:** త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు మహారాష్ట్ర సిద్ధమవుతోంది. అభ్యర్థులు నామినేషన్ పత్రాలను దాఖలు చేసే ప్రక్రియ కొనసాగుతోంది. తమకు కంచుకోటగా భావించే బారామతిలో ఎన్సీపీ , ఎన్సీపీ(ఎస్పీ) అభ్యర్థులుగా అజిత్ పవార్, యుగేంద్ర పవార్ బరిలోకి దిగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో యుగేంద్ర నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ మీడియాతో మాట్లాడారు. కొత్త తరం నాయకత్వాన్ని ఆదరించాలని ఓటర్లకు శరద్‌పవార్ విజ్ఞప్తి చేశారు. "యుగేంద్ర నామినేషన్ దాఖలు ప్రక్రియ పూర్తయింది. అతడు విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాడు. ప్రజల అభివృద్ధి కోసం విద్యావంతుడికి మా పార్టీ అతడికి అవకాశం ఇచ్చింది. కొత్త తరం నాయకత్వాన్ని బారామతి ప్రజలు ఆదరిస్తారని ఆశిస్తున్నా" అని పేర్కొన్నారు. అజిత్ పవార్‌ను ఓడించడం గురించి ఎదురైన ప్రశ్నకు యుగేంద్ర స్పందిస్తూ.. "చాలా ఏళ్ల తర్వాత శరద్ పవార్ నామినేషన్ పత్రాన్ని దాఖలు చేయడానికి నాతో పాటు వచ్చారు. ఆయన నాకు మద్దతు ఇవ్వడం నా అదృష్టం. నా ముందు ఉన్న సవాలు కంటే నా వెనక ఉన్న రాజకీయ అనుభవజ్ఞుడిని చూడడం ముఖ్యం" అని యుగేంద్ర పవార్ అన్నారు. ఆయనతో పాటు సుప్రియ సూలే, తదితరులు ఉన్నారు. కాగా.. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అధికార పీఠాన్ని దక్కించుకునేందుకు భాజపా, ఎంవీఏ కూటమి పోటాపోటీగా తలపడుతున్నాయి. ఎన్సీపీ కంచుకోటగా పేరున్న బారామతి నుంచి అజిత్ పవార్ బరిలోకి దిగగా.. ఆయన సోదరుడైన శ్రీనివాస్ కుమారుడు యుగేంద్ర పవార్‌ను శరద్ పార్టీ బరిలోకి దింపింది.

## మహారాష్ట్ర ఎన్నికలకు 25 మందితో బీజేపీ మూడో జాబితా

### అభ్యర్థుల లిస్ట్ విడుదలలో ముందువరుసలో కమలం పార్టీ



**ముంబై:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు మూడో జాబితాను బీజేపీ విడుదల చేసింది. 25 మంది అభ్యర్థుల లిస్ట్‌ను సోమవారం ప్రకటించింది. ముంబైలోని మూడు సీట్లలో పోటీ చేసే వారి పేర్లు కూడా ఈ జాబితాలో ఉన్నాయి. ఘట్‌కోపర్ ఈస్ట్ నుంచి పరాగ్ షా, వెర్సోనా నుంచి భారతి లవేకర్, బోరివాలి నుంచి సంజయ్ ఉపాధ్యాయ్‌ను ముంబై నుంచి పోటీకి నిలిపింది. మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోలేపై స్థానిక నేత అవినాష్ బ్రహ్మంకర్‌ను బీజేపీ బరిలోకి దించింది. అస్తి స్థానం నుంచి సురేష్ ధాస్, మల్షిరాస్ నుంచి సత్పుటే, లాతూర్ సిటీ నుంచి అర్చన చకుర్కర్, వాసాయి నుంచి స్నేహ దుబే, డెగ్లూర్ నుంచి జితేష్ అంతపుర్కర్, సావ్నర్ నుంచి ఆశిష్ దేశ్ ముఖ్ వంటి ప్రముఖ నేతలు బీజేపీ అభ్యర్థులుగా పోటీ చేయనున్నారు. మరోవైపు మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు అభ్యర్థుల జాబితాలను విడుదల చేయడంలో బీజేపీ ముందున్నది. గత వారం విడుదల చేసిన తొలి జాబితాలో అత్యధికంగా 99 మంది అభ్యర్థులున్నారు. శనివారం రిలీజ్ చేసిన రెండో జాబితాలో 22 మంది అభ్యర్థులను ఆ పార్టీ ప్రకటించింది. మహారాష్ట్ర అసెంబ్లీలోని 288 స్థానాలకు నవంబర్ 20న పోలింగ్ జరుగనున్నది. నవంబర్ 23న జార?ండ్‌తోపాటు కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు ప్రకటిస్తారు.

## సోలాపూర్ సౌత్ లో అభ్యర్థిని ఎలా ప్రకటిస్తారు?

- మేము ఇప్పటికే ప్రకటించాం
- కాంగ్రెస్‌పై సంజయ్ రౌత్ మండిపాటు



**ముంబయి:** సోలాపూర్ సౌత్ అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ తన అభ్యర్థిని ప్రకటించడంపై పై శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ మండిపడారు. "మేము ఇప్పటికే అభ్యర్థిని(అమర్ పాటిల్) ప్రకటించిన సోలాపూర్ సౌత్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి (దిలీప్ మానే) బరిలోకి దిగుతున్నట్లుగా ఆ పార్టీ ప్రకటించింది. కాంగ్రెస్ అభ్యర్థుల జాబితాలో ఈ విధంగా ఉండటం బహుశా టైపింగ్ పొరబాటని అనుకుంటున్నాను. మా వైపు నుంచి కూడా అలా జరిగే అవకాశం ఉండొచ్చు" కాని పక్షంలో ఆ తప్పు మేమూ చేయాల్సి వస్తుంది.. ఇటువంటి చర్యల వల్ల మహా వికాస్ అఘాడిలో సమస్యలు వచ్చే ప్రమాదముంది" అని ఆయన హెచ్చరించారు.సీటు షేరింగ్‌లో భాగంగా శివసేన (యూబీటీ) పోటీ చేయాలని నిర్ణయించుకున్న మిరాజ్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి స్థానిక కాంగ్రెస్ నాయకులు పోటీ చేసేందుకు ఆసక్తిగా ఉన్నారని సమాచారం వచ్చిందని..మిత్రపక్షాలకు వ్యతిరేకంగా చేస్తున్న ఈ ఆలోచనలు సరైనవి కాదని అన్నారు.కాగా సోలాపూర్ సౌత్ స్థానంలో పోటీ చేయాలని పార్టీ హైకమాండ్ నిర్ణయించినట్లుగా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు నానా పటోలే తెలిపారు. ఈ విషయంపై రాష్ట్ర స్థాయిలో వ్యాఖ్యానించలేమని.. సంజయ్ రౌత్ కూటమి నేతలతో చర్చించాలని సూచిస్తున్నట్లుగా పేర్కొన్నారు.

# కెనడాలో టెస్లా కారు ప్రమాదం

### నలుగురు భారతీయుల దుర్మరణం

### మితిమీరిన వేగమే కారణం



**టొరంటో:** కెనడాలోని ఒంటారియో ప్రావిన్సులో రోడ్డు ప్రమాదం జరిగింది. ఆ ప్రమాదంలో నలుగురు భారతీయుల మృతి చెందారు. వాళ్లు ప్రయాణిస్తున్న టెస్లా ఎలక్ట్రిక్ కారు.. హైవేపై ఉన్న గార్డ్ రెయిలింగ్‌ను ఢీకొట్టింది. దీంతో భారీ స్థాయిలో మంటలు వ్యాపించాయి. ఆ మంటల్లో నలుగురు దగ్ధమైనట్లు తెలుస్తోంది. లేక్ షోర్ బౌల్‌వార్డ్ ఈస్ట్, చెర్రీ స్ట్రీట్ వద్ద గత గురువారం ప్రమాదం జరిగినట్లు టొరంటో పోలీసులు వెల్లడించారు. టెస్లా కారులో 25 నుంచి 32 ఏళ్ల మధ్య ఉన్న అయిదుగురు ప్రయాణిస్తున్నట్లు తెలిసింది. దీంట్లో ముగ్గురు పురుషులు, ఇద్దరు మహిళలు ఉన్నారు. కారు అదుపు తప్పి గార్డు రెయిల్‌తో పాటు కాంక్రీట్ పిల్లర్‌ను ఢీకొట్టింది. కాంక్రీట్‌ను ఢీకొన్న తర్వాత కారులో భారీ స్థాయిలో మంటలు చెలరేగినట్లు పోలీసులు చెప్పారు. అధిక వేగం వల్లే ప్రమాదం జరిగినట్లు టొరంటో పోలీసు ఫిలిప్ సింక్లెయిర్ తెలిపారు. అక్కడికక్కడే నలుగురు ప్రాణాలు వదిలారు. 25 ఏళ్ల ఓ మహిళ మాత్రం ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నది. ప్రమాద సమయంలో అటుగా వెళ్తున్న కెనడా పోస్టల్ ఉద్యోగి ఒకరు కాలుతున్న కారు నుంచి ఆమెను రక్షించాడు. నలుగురి మృతి పట్ల భారతీయ కౌన్సులేట్ విషాదాన్ని వ్యక్తం చేసింది. తన ఎక్స్ అకౌంట్‌లో ప్రమాదంపై రియాక్ట్ అయ్యింది. బాధిత కుటుంబాలతో టచ్‌లో ఉన్నట్లు భారతీయ కౌన్సులేట్ వెల్లడించింది.

# ధాన్యం కొనుగోళ్లలో మోసాలకు పాల్పడితే చర్యలు

### ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్





**విశ్వంభర, డిండి :** డిండి మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వడ్ల కొనుగోలు కేంద్రాన్ని డీసీసీబీ ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డితో ప్రారంభించిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అనంతరం తహసీల్దార్ ఏర్పాటు చేసిన కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని 36 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ మాట్లాడుతూ.. రైతును రాజును చేయాలన్న దృఢ సంకల్పంతో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం పాటుపడుతుందని తెలిపారు. రైతుల పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మోసాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తప్పవని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ హెచ్చరించారు. రైతు పండించిన ధాన్యానికి మద్దతు ధర ఇవ్వడంతో పాటు సన్నధాన్యానికి క్వింటాలుకు 500 రూపాయల బోనస్ అందించి రైతు పక్షపాతిగా సీఎం రేవంత్ రెడ్డి రైతులకు అండగా నిలిచారని తెలిపారు. రైతు పండించిన ఏ గ్రేడు ధాన్యానికి రూ.2320, బీ గ్రేడు ధాన్యానికి రూ.2300 ప్రభుత్వం మద్దతు ధర అందిస్తుందని తెలిపారు. తేమశాతం 17 వరకు ఉండాలని, కల్లాల వద్దే ధాన్యాన్ని ఆరబెట్టి, తూర్పార బట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని రైతులకు సూచించారు. కాంట అయిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లతో గత ప్రభుత్వం రైతులను మోసం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవ రెడ్డి, నల్గొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్ ఖాన్, పీఏసీఎస్ చైర్మన్ మాధవరం శ్రీనివాస్ రావు, నాగార్జున రెడ్డి, జాల నర్సింహా రెడ్డి, మండల బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంతినేని వెంకటేశ్వర్ రావు,పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ యాదవ్, సిపిఐ నాయకులు బుచ్చి రెడ్డి, శైలేష్,మాజి ఎంపీపీ వెంకట్ రమణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోవర్ధన్ రావు, రేఖ్య నాయక్, డి సి ఈ ఓ శంకర్ రావు,జిల్లా సహకార కేంద్ర అధికారి పాత్యా నాయక్,ఎంపీడీవో వెంకన్న, ఎం ఆర్ ఓ అంబటి ఆంజనేయులు, డి టి సి ఎస్ హన్మంతు శ్రీనివాస్ గౌడ్,యువ నాయకులు సాయి,బాబు రామ్ నాయక్, ఉప సర్పంచ్ నూక వెంకటేష్, విష్ణువర్ధన్ రెడ్డి, బద్దెల శ్రీను, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, సలయ్య, వెంకటేష్, సాయి, మేకల కాశన్న, కలీం, మల్లేష్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు విధులపై అవగాహన కలిగి ఉండాలి



**విశ్వంభర, పరిగి :** విద్యార్థులు పోలీసు విధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని పరిగి ఎస్ఐ సంతోష్ కుమార్ అన్నారు. పోలీసు అమర వీరుల దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా సోమవారం పరిగి పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. పరిగి నంబర్ వన్ స్కూల్కు కు చెందిన విద్యార్థులు పరిగి పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. పోలీస్‌స్టేషన్‌లో కార్యకలాపాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రిసెప్షన్, కోర్టు డ్యూటీ, స్టేషన్ రైటర్, సెక్షన్ ఇంచార్జ్, బీసీ, పెట్రో కార్, లాకప్, ఆయుధాల నిర్వహణ వంటి విషయాలను విద్యార్థులకు వివరించారు. అదేవిధంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు పోలీసుల విధుల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రస్తుత సమాజంలో సైబర్ క్రైమ్ నేరాలు జరుగుతున్న తరుణంలో వాటిని నియంత్రించేందుకు యువత అప్రమత్తంగా ఉండి సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా తన జీవితాలు కాపాడుకోవాలని, సమాజ శ్రేయస్సు, భద్రతల కోసం పోలీసులు అందిస్తున్న సేవలు, త్యాగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, పాఠశాల ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

## ఆలేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌పై విచారణ చేసి చర్యలు తీసుకోవాలి

### కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజు



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా ఎస్ఎఫ్ఐ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆలేరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజారాం స్పెషల్ ఫీజుల పేరుతో విద్యార్థుల వద్ద అదనపు డబ్బులు వసూలు చేస్తున్న విషయంపై కలెక్టర్‌కి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియా రాజు మాట్లాడుతూ.. ప్రభుత్వం పేద విద్యార్థులు చదువు కోసం కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రభుత్వ కళాశాల నడుపుతున్న పరిస్థితుల్లో అదనపు ఫీజుల పేరుతో ప్రైవేట్ కళాశాల స్థాయిలో విద్యార్థుల నుంచి అక్రమంగా ఫీజులు వసూలు చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి విద్యార్థుల నుంచి వసూలు చేసిన అదనపు డబ్బులను తిరిగి చెల్లించాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసుల నరేష్, డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు వడ్డేమాన్ విప్లవ్, భువనగిరి గణేష్ ,మధ్యబోయిన సుందర్ తదితరులు పాల్గొన్నారు.

## అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ పెట్టవద్దని ధర్నా



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలంలోని, రామన్నపేట, కొమ్మాయి గూడెం గ్రామాల పరిధిలో పెట్టబోతున్న అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ పెటవద్దని బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో రామన్నపేట సుభాష్ సెంటర్లో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రామన్నపేటలో సిమెంటుకు సంబంధించిన ఎలాంటి ముడిసరుకు దొరకదు, అయినా ఇక్కడ పరిశ్రమ నిర్మించాల్సిన అవసరం ఏముంది? రామన్నపేటతో పాటు చుట్టుపక్కల మండలాలు, గ్రామాల ప్రజలతో చెలగాటలాడుతుంది ఈ ప్రభుత్వం, అదాని 100 కోట్లు స్కిల్ డెవలప్మెంట్‌కు ఇవ్వగానే సిమెంట్ ఫ్యాక్టరీకి సానుకూలంగా మారిందన్నారు. పర్యావరణ నిర్బంధనను తుంగలోకి తొక్కి, బలవంతంగా రామన్నపేటలో ఫ్యాక్టరీ పెడితే, ఎంతో మంది అనారోగ్యానికి గురయ్యే పరిస్థితి ఉంది, కనుక వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకొని రామన్నపేటలో ఆదాని అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని రద్దుచేసి ప్రజల సంక్షేమం కోసం పాటు పడాలని అన్నారు. ఈ సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పల్లగొర్ల మోదీరాందేవ్, ధర్మసమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ నల్ల నరేందర్, బీజేవైఎం నాయకులు అక్కినపల్లి సైదులు, బీసీ యువజన సంఘం జిల్లా కన్వీనర్ ఎడ్ల మహాలింగం యాదవ్, మాదం లింగస్వామి, డీఎస్పీ మండల అధ్యక్షుడు అశోక్, నకిరేకంటి నరేందర్, బర్ల దిలీప్, మేడి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేవైఎం ఆధ్వర్యంలో నూతన ఎంఈఓకు సన్మానం



**విశ్వంభర, తలకొండపల్లి :** తలకొండపల్లి మండలనికి నూతనంగా (ఎంఈఓ) విద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించిన కేతవత్ చంప్ల నాయక్‌ను బీజేవైఎం కల్వకుర్తి అసెంబ్లీ కన్వీనర్ పద్మ అనిల్ వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పద్మ అనిల్ ముదిరాజ్, పద్మ గణేష్, శ్రీశైలం, మధు, సుధాకర్, రాజశేఖర్, నరసింహ పాల్గొన్నారు.

## ఎమ్మెస్ఎంఈ లోన్ల గురించి యువతకు అవగాహన



**విశ్వంభర, కల్వకుర్తి :** ఎమ్మెస్ఎంఈ లోన్స్, అప్లై విధి విధానాలను అధికారులు, బ్యాంకు మేనేజర్లు, నాగర్ కర్నూల్ జిల్లాలలో ఉన్న కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్ని మండలాల యువతను ఉద్దేశించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గగ్గాలపల్లి గ్రామం తేజ కన్వెన్షన్ లో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సుమారు 400 మంది యువకులు హాజరైనట్లు అధికారులు తెలిపారు. అనంతరం కల్వకుర్తి క్యాంపు కార్యాలయంలో కల్వకుర్తి వెల్దండ మండలాలకు సంబంధించిన 56 మంది లబ్ధిదారులకు కాటమయ్య కిట్లను ఎమ్మెల్యే కశిరెడి నారాయణ రెడ్డి, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి తో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మండల నాయకులు మట్ట వెంకటయ్య గౌడ్, శ్రీనివాస్ గౌడ్, యాట నరసింహ, దోకోరి ప్రభాకర్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

## లెనోవా ఫ్రైడ్ ఉన్నత పాఠశాలకు ఎంఈఓ నోటీసులు



**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమనగల్ మండల పరిధిలోని లేనోర ఫ్రైడ్ ఉన్నత పాఠశాలలో బాలురు, బాలికలకు ఒకే మూత్రశాల మరుగుదొడ్లు ఏర్పాటు చేయడంపై విద్యార్థుల తల్లిదండ్రులు మండల విద్యాధికారికి పలుమార్లు ఫిర్యాదులు రావడంతో గత వారం మండల విద్యాధికారి పాండు పాఠశాలను సందర్శించి మౌఖిక ఆదేశాలు ఇస్తూ వెంటనే బాలురు బాలికలకు ప్రత్యేక మూత్రశాలలు మరుగుదొడ్లు ఏర్పాటు చేయవలసిందిగా ఆదేశించారు. తిరిగి సోమవారం పాఠశాలను సందర్శించి తనిఖీ చేశారు. అయినా ఎలాంటి ప్రత్యేక ఏర్పాట్లు పాఠశాల యాజమాన్యం చేయకపోవడంతో నోటీసును అందజేయడం జరిగింది. ఇతర అంశాలపై సంజాయిషీ ఇవ్వవలసినదిగా నోటీసు కాపీ జారీ చేసామని మండల విద్యాధికారి పాండు తెలిపారు.

## ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డికి వినతి



**విశ్వంభర, కుత్బుల్లాపూర్ :** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ శాసనమండలి చీఫ్ విప్ ఎమ్మెల్సీ, పట్నం మహేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి 129 డివిజన్ పలు సమస్యల కొరకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి తో కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో 129 డివిజన్ మాజీ కార్పొరేటర్ పాల కృష్ణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, వెంకటేష్, రజాక్, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆడపడుచులకు దీపావళి కానుక

### కేఎల్ఆర్ చేతుల మీదుగా చీరల పంపిణీ



**విశ్వంభర, మహేశ్వరం :** తుక్కుగూడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జల్ పల్లి మున్సిపాలిటీ శ్రీరామ్ కాలనీ ఆడపడుచులకు కేఎల్ఆర్ దీపావళి కానుక అందజేశారు. మైనార్టీ ఛైర్మన్ యూసుఫ్ ఖాద్రీ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం, ఆహార పదార్థాలు చీరలును పంపిణీ చేశారు. ఈ సేవ కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా కేఎల్ఆర్ దేప భాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడుతూ పేదలకు మానవతా దృక్పథంతో సరుకులు పంపిణీ చేయడం సంతోషం అన్నారు. ప్రతీ నాయకుడు, కార్యకర్త, కార్పొరేట్ సంస్థలు పండుగలకు వేస్ట్ ఖర్చులు చేయకుండా బస్తీల్లో సేవ కార్యక్రమాలు చేస్తే పేదరికం పోతుందన్నారు. తనతో పాటు ఇతర నాయకులతో వస్త్రాలు పంపిణీ చేయించారు కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, కేఎల్ఆర్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## వివాహ నిశ్చితార్థ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి



**విశ్వంభర, రామన్నపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, కొమ్మాయిగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మండల నాయకుడు మోటి రవీందర్ కూతురు నిశ్చితార్థ కార్యక్రమం రామన్నపేట పట్టణ కేంద్రంలోని జేపీ గార్డెన్‌లో జరగగా, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హాజరై, నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పోషబోయిన మల్లేశం, మాజీ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ బందెల రాములు, మాజీ ఎంపీటీసీ పున్న వెంకటేశం, మాజీ ఉప సర్పంచ్ బెల్లి అంజయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు బుర్ర శ్రీశైలం, నాయకులు కోనూరు ముత్తయ్య, మిర్యాల మల్లేశం, ఆవుల శ్రీధర్, గర్దాస్ విక్రమ్, జాల అమరేందర్ రెడ్డి, ఎడ్ల రామచంద్రారెడ్డి, బాసాని రాజు, కల్లూరి నరేష్, మోటే నరేష్, బోయపల్లి వెంకన్న, వంగాల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## రామన్నపేటలో అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా ప్రజా ప్రయోజన వ్యాజ్యం

**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనబ గిరి జిల్లా, రామన్నపేట మండలంలోని, రామన్నపేట, కొమ్మాయిగూడెం గ్రామాల పరిధిలో పెట్టబోతున్న అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ వలన ప్రజలకు జరిగే ఇబ్బందుల గురించి సోమవారం భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి ఇచ్చినటువంటి బ్రహ్మాస్త్రం ప్రజా పరిరక్షణ ప్రయోజన వాజ్యాన్ని వినియోగించుకుంటూ.. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి రిజిస్టర్ పోస్టు ద్వారా తెలంగాణ టీడీపీ రాష్ట్ర నాయకులు రాపోలు నరసింహా, ప్రముఖ సామాజికవేత్త గంజి రమేష్ పంపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామన్నపేట ప్రాంతంలో పెట్టబోతున్న అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ వలన ఆ ప్రాంతం మొత్తం కూడా నిర్వీర్యం అయ్యే పరిస్థితులు దాపురించిన పరిస్థితుల్లో మనకు ఉన్న అన్ని అవకాశాలను వినియోగించి కొని ఫ్యాక్టరీ ఇక్కడ పడకుండా చూడాల్సిన బాధ్యత రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరిపై ఉన్నదని అందులో భాగంగానే మేము గౌరవ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఈ విషయం వారి నోటీసులో పెట్టి ప్రజా పరిరక్షణ ప్రయోజన వాజ్యాన్ని స్వీకరించి, ఈ విషయంలో విచారణ జరిపి సిమెంట్ ఫ్యాక్టరీ ఇక్కడ పడకుండా చూడాలని మా ప్రాంతానికి న్యాయం చేయాల్సిందిగా కోరడం జరిగిందన్నారు.

## రచ్చ నాగరాజుకు నివాళులర్పించిన ఎమ్మెల్యే సబిత



**విశ్వంభర, మహేశ్వరం :** తుక్కుగూడ మున్సిపల్ రావిరాల గ్రామానికి చెందిన రచ్చ నాగరాజు గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి స్థానిక నాయకులతో కలిసి ఆయన భౌతిక గాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పి అలాగే బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎల్లవేళలా కుటుంబానికి అండ ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తుక్కుగూడ మున్సిపల్ అధ్యక్షులు జిల్లెల్ల లక్ష్మయ్య, కౌన్సిలర్ సప్పిడి రాజు, మాజీ సర్పంచ్ బాట సురేష్, గోనమోని ప్రభాకర్ ముదిరాజ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం అందరి బాధ్యత: చిలుక ఉపేందర్ రెడ్డి

**విశ్వంభర, ఎల్బీనగర్ :** ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం అందరి బాధ్యత అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి అన్నారు. సరూర్ నగర్ డివిజన్ భగత్ సింగ్ నగర్ కాలనీకి చెందిన పులి గౌడ్ ( యాదగిరి ) అనారోగ్యానికి గురిఅయ్యాడు. కార్యకర్తల ద్వారా విషయం తెలుసుకున్న చిలుక ఉపేందర్ రెడ్డి ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం రూ. 20,000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాటి మనిషి కి సహాయం చేయడంలోనే ఎంతో ఆనందం ఉంటుందన్నారు. పేదలను ఆదుకునేందుకు ఎల్లప్పుడు ముందు ఉంటాను అని అన్నారు.

## చెట్లను నరికిన గుర్తుతెలియని వ్యక్తులు



**విశ్వంభర, మేడిపల్లి :** మేడిపల్లి మండలం విలయతాబాద్ గ్రామంలో రహదారికి ఆనుకుని ఉన్న చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికి వేశారు. ఉపాధి హామీ కార్యక్రమంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలు పెరిగి వృక్షాలుగా మారాయి వీలయతాబాద్ హనుమాన్ టెంపుల్ దగ్గర ఇండ్లకు దగ్గరగా ఉన్న రోడ్డుకు ఇరువైపులా 8 చెట్లను నరికి రోడ్డు ప్రక్కన పడవేశారు. దీనిపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## స్వంత ఖర్చులతో తుమ్మచెట్ల తొలగింపు



**విశ్వంభర, భూపాలపల్లి :** జయ శంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ఎర్రబెల్లి పున్నం చందర్ రావు నిత్యం ప్రజాసేవలో నిమగ్నమగుతూ.. ప్రజల అభిమానాన్ని చూరగొంటున్నాడు. మొగుళ్ళపల్లి నవాబుపేట గ్రామాల మధ్యన బీటీ రోడ్డుకు ఇరువైపులా తుమ్మ చెట్లు భారీగా పెరిగి వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్న నేపథ్యంలో గ్రామస్తుల కోరిక మేరకు ఆయన సోమవారం జెసిబి సహాయంతో అట్టి తుమ్మ చెట్లను తొలగించారు. నిన్న పెద్దమ్మ చెరువు కట్టకు భారీగా పెరిగిన తుమ్మ చెట్లను తొలగించి జయశంకర్ భూపాలపల్లి జిల్లా కరీంనగర్ జిల్లాకు అనుసంధానంగా ఉండే బీటీ రోడ్డుకు ఇరువైపులా కలిగిన భారీ తుమ్మ చెట్లను తొలగించి ప్రజల మన్ననలను పొందుతున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, నియోజకవర్గ ప్రజలు ఆయనను అభినందిస్తున్నారు.

## ప్రభుత్వ స్థలాలు కాపాడాలని వినతి



**విశ్వంభర, సరూర్‌నగర్ :** భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ సరూర్నగర్ మండల సమితి కార్యదర్శి బాతరాజు నరసింహ ఆధ్వర్యంలో సరూర్నగర్ మండల్ తహసీల్దార్ కార్యాలయంలో ఏంపీఎస్ఓ వాణికి వినతి పత్రం అందజేశారు. నరసింహ మాట్లాడుతూ ఎన్టీఆర్ నగర్ ఫేసులో ఉన్నటువంటి కుంటాను కొంతమంది ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని ప్రభుత్వ స్థలాలని కాపాడాలని చెరువులను రక్షించాలని కోరుతూ వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. గత 30 సంవత్సరాలుగా ఉంటున్న కుంటాను రక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సరూర్నగర్ మండల సహాయ కార్యదర్శి బోయపల్లి రాములు గౌడ్, బస్తీ వాసులు ఎండీ ఫజల్, కే రవి, ఎం నరేష్, ఎం రవి, జె శ్రీకాంత్, ఎస్ వాసు, పీ నరేష్, పీ ప్రవీణ్, కే శ్రీనివాస్ పాల్గొన్నారు.

# సామాజిక ఆర్థిక సర్వేపై అవగాహన కల్గి ఉండాలి



**విశ్వంభర, భూపాలపల్లి :** సామాజిక , ఆర్థిక సర్వే ద్వారా వివిధవర్గాల ప్రజల సామాజిక, ఆర్థికపరిస్థితులు ఎలాంటి పొర పాట్లుకు తావులేకుండా నమోదులు చేసేందుకు స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో సామాజిక ఆర్థిక సర్వే, ధాన్యం కొనుగోళ్లు, నవంబర్ 2వ తేదీన రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులు హన్మకొండలో నిర్వహించు ప్రజాభిప్రాయ సేకరణ తదితర అంశాలపై అన్ని శాఖల జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న సామాజిక ఆర్థిక సర్వే ప్రక్రియపై సమగ్ర అవగాహనకలిగి ఉండాలని తెలిపారు. ప్రతి రోజు సర్వే అనంతరం వివరాలను డేటా ఎంట్రీ చేసేందుకు అవసరమైన డేటా ఎంట్రీ ఆపరేటర్లును సిద్ధం చేయాలని తెలిపారు. మంగళవారం ఉదయం.9.30 గంటలకు ఐడిఓసి కార్యాలయంలో పర్యవేక్షకులకు మాస్టర్ ట్రైనరులతో శిక్షణా కార్యక్రమం ఉంటుందని, తదుపరి పర్యవేక్షకులు మండల స్థాయిలో సర్వే లో పాల్గొననున్న ఎన్యూమరేటర్లుకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఆర్డీవో మంగీలాల్, బీసీ సంక్షేమ అధికారి శైలజ, పౌరసరఫరాల అధికారి శ్రీనాథ్, మేనేజర్ రాములు, సహకార అధికారి వాలియా నాయక్, డీఆర్డీఓ అవినాష్, వ్యవసాయ అధికారి విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## 2028 నాటికి బలమైన శక్తిగా తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా జిలుకర రవికుమార్



**విశ్వంభర, బషీర్ బాగ్ :** ప్రస్తుత రాజకీయాలకు ప్రత్యామ్నాయంగా తమ పార్టీ అవతరించబోతుందని తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జిలుకర రవికుమార్ స్పష్టం చేశారు. సోమవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ ఆవిర్భావం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర పార్టీల నాయకులు ప్రజలను ప్రలోభాలు పెట్టి అధికార రావడం కోసం ఎంతకైనా దిగజారుతున్నారని తమ పార్టీ వాటికి విరుద్ధంగా ఉంటుందన్నారు. యువత రాజకీయాల వైపు రాణించేలా తమ పార్టీ తరుపున ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ ల పేరుతో అధికారంలో వచ్చి నేటికీ హామీల అమల్లో పూర్తిగా విఫలమైందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేలా తమ పార్టీ తరపున రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామన్నారు. నవంబర్ నెలలో హైదరాబాద్ నగరం నడిబొడ్డున ఎల్బీ స్టేడియంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి తమ పార్టీ విధి విధానాలను ప్రకటిస్తామని వెల్లడించారు. ప్రజల అభివృద్ధి లక్ష్యంగా పార్టీలు, ప్రభుత్వాలు పని చేయాలని అన్నారు. 2028 వరకు రాష్ట్రంలో బలమైన శక్తిగా ఎదుగుతాం అని అన్నారు. ఈ కార్ర్యమంలో దాసరి శ్యామ్ రావు, సోమయ్య, బీ రవికుమార్, నరేందర్, రత్న రాజ్, జీ శైలేష్, బంగారి రమేష్, జ్ఞానేందర్ తదితరులు పాల్గొన్నారు.

## షాద్‌నగర్ అసెంబ్లీ బీఎస్పీ పార్టీ కమిటీ నియామకం



**విశ్వంభర, షాద్‌నగర్ :** సోమవారం బహుజన్ సమాజ్ పార్టీ షాద్‌నగర్ నియోజకవర్గం అధ్యక్షుడు సొంటె శ్రీనివాస్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రంగారెడ్డి జిల్లా ఇన్చార్జ్ దొడ్డి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో నియోజకవర్గ కమిటీని నియమించి నియామక పత్రాలు అందజేశారు. షాద్‌నగర్ నియోజకవర్గం వైస్ ప్రెసిడెంట్‌గా మణుగూరు రాంప్రసాద్ గౌడ్, ప్రధాన కార్యదర్శి గా తుప్పరి కుమార్, కార్యదర్శిగా ఎర్ర రాధాకృష్ణ, కోశాధికారి గాదెపాక మోజేస్, సోషల్ మీడియా ఇన్చార్జిగా కొండేటి మహేందర్‌లను నియమించారు. షాద్‌నగర్ నియోజకవర్గం అధ్యక్షుడు సొంటి శ్రీనివాస్, మున్సిపాలిటీ అధ్యక్షుడుగా నీరటి రాజు, ఫరూక్ నగర్ మండల అధ్యక్షుడిగా శివగల్ల ఆంజనేయులును నియమించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి రంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ దొడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ.. పార్టీ నియమ నిబంధనకు, లోబడి, పార్టీ ప్రోటోకాల్ అనుసరిస్తూ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సీనియర్ నాయకులు గుండెటి నర్సింలు, కొండేటి శరత్, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

# ముసి సుందరీకరణకు జేఏసీ ఏర్పాటు చేయాలి

డాక్టర్ సుధాకర్




**విశ్వంభర, బషీర్ బాగ్:** ముసి సుందరీకరణ కోసం అన్ని పార్టీలతో జాయింట్ యాక్షన్ కమిటీ వేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముసి సుందరీకరణ డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డిపిఆర్) విడుదల చేయాలని కోరారు. మూసి భాదితులకు పూర్తి పరిష్కారం చూపించిన తరువాతే వారిని వేరే ప్రాంతానికి తరలించాలన్నారు. చేరువులను రక్షించడం, నాలాల కబ్జాలు అరికట్టడం, ముసి సుందరీకరణ మంచిదే, కానీ పేద ప్రజల అర్ధంతరంగా రోడ్డున పడేసి వారి బ్రతుకులను చిదిమేయడం సరికాదన్నారు. వారికి పరిష్కారం చూపి, తగు ఏర్పాట్లు చేయాలన్నారు. పేద ప్రజల ఇళ్ళను కూల్చితే ఆమ్ ఆద్మీ పార్టి చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ తెలంగాణా కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాములు గౌడ్ , మహమ్మద్ మాజీద్, మహిళా వింగ్ అధ్యక్షురాలు హేమ జిల్లోజు, ప్డాక్టర్స్ వింగ్ అధ్యక్షురాలు లక్షా నాయుడు, దివ్యంగా కమిటీ అధ్యక్షుడు రమేష్ దర్శనం, అధికార ప్రతినిధులు జావీద్ షరీఫ్, ఖలీం బాబా, కొడంగల్ శ్రీనివాస్, ముసి భాదితుల హక్కుల పరిరక్షణ కమిటీ చైర్మన్ అఫ్సా సలాం, వైస్ చైర్మన్ సుధా రాణి తదితరులు పాల్గొన్నారు.

# చుక్కపూర్‌లో ఘనంగా సదర్ సమ్మేళనం



**విశ్వంభర, తలకొండపల్లి :** తలకొండపల్లి మండలం చుక్కాపూర్ గ్రామపంచాయతీలోని సదర్ సమ్మేళనం యాదవ్ సంఘం అధ్యక్షుడు కాగుల శేఖర్, ఉపాధ్యక్షుడు దశరథం, కార్యదర్శి శ్రీశైలం, కోశాధికారి యాదయ్య, యాదవ సంఘం నాయకులు జోలం చెన్నయ్య, పర్వతాలు సోదరులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఆమనగల్ మార్కెట్ మాజీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్ రెడ్డి, తలకొండపల్లి మాజీ జెడ్పీటీసీలు ఉప్పల వెంకటేష్, పద్మ నరసింహ, మాజీ ఎంపీపీ సీల్ శ్రీనివాస్ యాదవ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ డైరెక్టర్ మావిళ్ళపల్లి వెంకటరెడ్డి, పాండురంగా రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి,శ్రీనివాస్ గౌడ్, మాజీ జెడ్పి కోఆప్షన్ నెంబర్ ముజాపూర్ రెహమాన్,మాజీ వార్డ్ మెంబర్స్ శ్రీను, గుమ్మకొండ మల్లారెడ్డి, శ్రీధర్ రెడ్డి,భీష్మ చారి, కర్ణాకర్ రెడ్డి,మల్లేష్, ఉపాధ్యక్షుడు మల్లేష్, విష్ణు,శ్రీను,పాండు నాయక్, మాజీ ఎంపీటీసీ యాదయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## వ్యాసరచన - పోస్టర్ ప్రజెంటేషన్ బహుమతుల ప్రదానోత్సవం



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా సేవా మహా యజ్ఞం సేవ పక్షం సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు సేవా కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన వ్యాసరచన, పోస్టర్ ప్రజెంటేషన్ల బహుమతుల ప్రదానోత్సవం స్థానిక బిజెపి జిల్లా కార్యాలయంలో సేవ మహా యజ్ఞం జిల్లా కన్వీనర్ తుమ్మల మురళీధర్ రెడ్డి, సేవ మహా యజ్ఞం కో కన్వీనర్ బట్టు క్రాంతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ 74వ జన్మదినాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్త ప్రచారంలో భాగంగా తెలంగాణా బీజేపీ రాష్ట్రంలో 'సేవా పఖ్వాడా' ని సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు సేవా పక్షం రోజులు కార్యక్రమంలో భాగంగా గత నెలలో నిర్వహించిన వ్యాసరచన, పోస్టర్ ప్రజెంటేషన్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రధానోత్సవం ఇవ్వడం జరిగిందన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని కాటేపల్లి, దిలావర్పూర్, ఇక్కుర్తి చామాపూర్(ఆర్థాశిపల్లి), కదిరేనిగూడెం గ్రామాలలో సోమవారం ఆలేర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఐనాల చైతన్య మహేందర్ రెడ్డి, జిల్లా గ్రామీణభివృద్ధి అధికారి నాగిరెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పచ్చిమట్ల మదార్ గౌడ్ కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మదార్ గౌడ్, డైరెక్టర్ పాండురంగం, ఆత్మకూర్ పీఏసీ ఎస్ వైస్ చైర్మన్ జంగిర్, తహసీల్దార్ శాంతిలాల్, ఎంపీడీఓ ఇందిర, ఏపీఎం జీ సత్యనారాయణ, ఎంపీవో చంద్రశఖర్, ఆర్ ఐ వెంకట రామారావు, సీసీలు మల్లేశం, సంతోష, మండల సమాఖ్య అధ్యక్షురాలు ఏ కవిత, సెక్రెటరీ మాధవి తదితరులు పాల్గొన్నారు.

## మదర్ డెయిరీ ఆర్థిక సహాయం



**విశ్వంభర, రామన్నపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, నీర్నెముల గ్రామానికి సాగర్ల ఐలమ్మ నల్లగొండ రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం, నీర్నెములలో సభ్యురాలు సాగర్ల ఐలమ్మ నీర్నెముల పాలసంఘంలో పాలు పోస్తూ, అకాల మరణం చెందారు. వారికి మదర్ డెయిరీ నుండి వచ్చే ఆర్థిక సహాయం రూ.10,000 లు చిట్యాల పాల శీతలీకరణ కేంద్రం మేనేజర్ కర్నాటి చెన్నారెడ్డి కీ.శే.ఐలమ్మ భర్త మల్లయ్యకు అందించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్‌లు కట్ట రాంరెడ్డి, కాసోజు సైదాచారీ, సూరపురెడ్డి జనార్దనరెడ్డి, షణ్ముఖచారి, నీర్నేముల పాల సంఘం చైర్మన్ దొంతరబోయిన శివలీల దాసు, డైరెక్టలు సాగర్ల యాదయ్య, సుర్వి అండాలు, సాగర్ల వెంకన్న, సుర్వి సురేష్, సాగర్ల మల్లయ్య, కార్యదర్శి నోముల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎన్నికైన విద్యార్థినిలకు సర్టిఫికెట్లు




**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమనగల్లు పట్టణంలోని స్థానిక వివేక విద్యా భారతి ఉన్నత పాఠశాలలో సోరువారం రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులకు పాఠశాల ఆవరణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎస్‌జీఎఫ్‌పీటీల ఆధ్వర్యంలో ఆమనగల్లు ఎంఈఓ పాండు చేతుల మీదుగా మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ క్రీడాకారులనుద్దేశించి మాట్లాడుతూ ఆమనగల్లు పట్టణం నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎన్నిక కావడం గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ జి ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సాబీర్ , ఎస్ సి ఎఫ్ జోనల్ సెక్రటరి భీముడు తలకొండపల్లి పీడీ పాండు, మాడుగుల పీడీ విజయ్ రాథోడ్, మహమద్, కరస్పాండెంట్ గోలి శ్రీనివాసులు ఉపాధ్యాయులు, మల్లేష్, నజీర్, స్వప్న, రత్న కుమారి, పీఈటీలు శంకర్, అంజు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బూత్ స్థాయిలో ఓటర్ ముసాయిదా జాబితాను ప్రదర్శించాలి: అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్



**విశ్వంభర, వికారాబాద్ :** బూత్ స్థాయిల్లో ఓటరు ముసాయిదా జాబితాలను ప్రదర్శించాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. వికారాబాద్ జిల్లాలోని వికారాబాద్, పరిగి, తాండూర్, కొడంగల్ నియోజకవర్గంలోని 1133 పోలింగ్ కేంద్రాల్లో ఓటరు ముసాయిదా జాబితాలను ప్రదర్శింపచేయాలని ఆయన తెలిపారు. వికారాబాద్ జిల్లాలోని అన్ని మండలాలతోపాటు నారాయణపేట 4 మండలాలు, మహబూబ్ నగర్ (2) మండలాలు గండిడ్, మామదాబాద్‌లలోని బూత్ స్థాయి అధికారులు మంగళవారం ఓటర్ ముసాయిదా జాబితాలను కార్యాలయ నోటీస్ బోర్డులలో ప్రదర్శింపచేయాలని ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజలందరికీ జాబితాలు అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేసినట్లయితే జాబితాలో తమ పేర్లు నమోదు కాని ఎడల 18 సంవత్సరాలు నిండిన యువత జనవరి 1, 2025 నాటికి ఓటరుగా నమోదు చేసుకునేందుకు వీలుగా ఉంటుందని అదనపు కలెక్టర్ ఓ ప్రకటనలో తెలిపారు.

# జర్మనీ నుంచి ఇక ఏటా 90వేల వీసాలు



- అవసరమైన నైపుణ్యాలు పెంపొందించుకోవాలి
- ఫుట్ బాల్ భారత ప్రజలకూ ఎంతో ఇష్టం
- ప్రధాని నరేంద్ర మోదీ

**వడోదర:** యావత్ ప్రపంచం భారత్ వైపు ఆసక్తిగా చూస్తోందని, భారత్ మాటలను ప్రపంచ దేశాలు అత్యంత శ్రద్ధతో వింటున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. మన దేశం వివిధ రంగాల్లో కల్పిస్తున్న అవకాశాల గురించి విస్తృతంగా చర్చించుకుంటున్నాయన్నారు. భారత్‌తో కలిసి అభివృద్ధిపథంలో నడిచేందుకు బ్రిక్స్ దేశాలు చొరవ చూపుతున్నాయన్నారు. గుజరాత్‌లోని అమ్రేలి జిల్లాలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించిన ప్రధాని మోదీ.. భారతీయులకు ఏటా 90వేల వీసాలు ఇస్తామని జర్మనీ చెప్పిందని, అందుకు అవసరమైన నైపుణ్యా లను పెంపొందించుకోవడం మన చేతుల్లో ఉందన్నారు. లాలిగా టోర్నీలో భాగంగా రియల్ మాడ్రిడ్ జట్టును బార్సిలోనా 4-0 తేడాతో ఓడించింది. శనివారం జరిగిన ఈ మ్యాచ్ విజయం తాలుకా ప్రతిధ్వనులు ప్రపంచ వ్యాప్తంగా వినిపించాయి. అవి గుజరాత్‌నూ చేరాయి. ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఆ విషయం ప్రస్తావించారు. స్పెయిన్ ప్రధాని పెడ్రో శాంచెజ్ గుజరాత్‌లోని వడోదర పర్యటన సందర్భంగా.. స్పానిష్ ఫుట్‌బాల్ ఆటకుండే ఆదరణపై మోదీ స్పందించడం విశేషం. రియల్ మాడ్రిడ్‌పై బార్సిలోనా సాధించిన విజయాన్ని మోదీ ప్రస్తావిస్తూ.. ఈ మ్యాచ్ గురించి స్పెయిన్‌లో మాదిరిగానే భారత్‌లోనూ ఎంత ఉద్వేగభరితంగా చర్చించుకున్నారని వివరించారు. "స్పానిష్ ఫుట్‌బాల్ ఆటను భారత్ ప్రజలు ఎంతో ఇష్టపడతారు. రియల్ మాడ్రిడ్, బార్సిలోనా మ్యాచ్ గురించి ఇక్కడా చర్చించుకున్నారు. బార్సిలోనా అద్భుత విజయం ఇక్కడ కూడా చర్చనీయాంశమైంది. ఈ రెండు క్లబ్‌ల అభిమానుల మధ్య సరదా వాతావరణం స్పెయిన్‌లో మాదిరిగానే భారత్‌లోనూ నెలకొందని నేను చెప్పగలను" అని వడోదర రోడ్‌షోలో ప్రసంగిస్తూ మోదీ వివరించారు. ఈ ప్రసంగం విన్న తర్వాత ప్రధాని మోదీ ఫుట్‌బాల్ పరిజ్ఞానంపై పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఆయన తన ప్రసంగంతో అందర్నీ ఆశ్చర్యపరిచారని కొనియాడుతున్నారు. ఇక ఈ రోడ్‌షోలో ఇద్దరు ప్రధానులు పాల్గొన్నారు. ఎయిర్‌పోర్టు నుంచి టాటా ఎయిర్‌క్రాఫ్ట్ కాంప్లెక్స్ వరకూ 2.5 కి.మీ. మేర సాగిన ఈ రోడ్ షోలో ఇద్దరు నేతలు ప్రజలకు అభివాదం చేస్తూ ఉత్సాహంగా ముందుకు కదిలారు. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్‌ను వీరిద్దరూ కలిసి ప్రారంభించారు. అనంతరం చర్చలు జరిపేందుకు చారిత్రక లక్ష్మీవిలాస్ ప్యాలెస్‌కు బయలుదేరి వెళ్లారు. అక్కడ ఇరుదేశాల నేతల మధ్య ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. ఈ చర్చలు ఇరుదేశాల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేస్తాయని మోదీ అన్నారు.

### ట్రాన్స్‌పోర్ట్ ఎయిర్‌క్రాఫ్ట్ తయారీ కేంద్రాన్ని ప్రారంభించిన ప్రధాని

గుజరాత్‌లోని వడోదరలో సి-295 ట్రాన్స్‌పోర్ట్ ఎయిర్‌క్రాఫ్ట్ తయారీ కేంద్రాన్ని ప్రధాని మోదీ, స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్‌తో కలిసి ప్రారంభించారు. టాటాల భాగస్వామ్యంతో ఎయిర్‌బస్ సంస్థ దీనిని నెలకొల్పింది. ఐరోపాకు చెందిన ఈ సంస్థ బయటి దేశాల్లో ఇటువంటి ఎయిర్‌క్రాఫ్ట్‌లను తయారుచేయడం ఇదే తొలిసారి. స్పెయిన్‌లో తయారైన ఈ రకానికి చెందిన కొన్ని విమానాలు గతేడాది నుంచే భారత్‌కు చేరుకోవడం మొదలైంది. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ఈ ప్లాంట్ 'మేకిన్ ఇండియా, మేక్ ఫర్ ది వరల్డ్' మిషన్‌ను బలోపేతం చేస్తుందని అన్నారు. భారత్-స్పెయిన్ భాగస్వామ్యాన్ని పెడ్రో సాంచెజ్‌తో కలిసి సరికొత్త మార్గంలో తీసుకెళుతున్నామని వెల్లడించారు. "ఇటీవల భారత్ ముద్దు బిడ్డ రతన్ టాటాను కోల్పోయింది. ఆయన జీవించి ఉంటే.. నేడు ఇక్కడ మన మధ్యే ఉండేవారు. ఎక్కడ ఉన్నా ఆయన దీనిని చూసి సంతోషిస్తారు" అని మోదీ నివాళి అర్పించారు. స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్ మాట్లాడుతూ ఎయిర్‌బస్, టాటాల భాగ స్వామ్యం భారత వైమానిక రంగ పురోగతికి బాటలు వేస్తుందన్నారు. ఇతర ఐరోపా దేశాలు భారత్‌కు వచ్చేందుకు ఇది ద్వారాలు తెరిచిందని పేర్కొన్నారు. రెండేళ్ల తర్వాత ప్రధాని డేట్లను రిజర్వు చేయండి. ఈ సందర్భంగా టాటా సన్స్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ మాట్లాడుతూ.. నేటినుంచి కచ్చితంగా రెండేళ్లలో తొలి విమానం డెలివరీ చేస్తామని ప్రధానికి హామీ ఇచ్చారు. ఆ రోజు మళ్లీ ప్రధాని ఇక్కడికి వచ్చి దానిని ఆవిష్కరించేందుకు వీలుగా తేదీని రిజర్వ్ చేసేలా పీఎంవోను కలిసి పనిచేస్తామన్నారు. టాటా గ్రూప్‌నకు చెందిన 200 మంది ఇంజినీర్లు ఇప్పటికే స్పెయిన్‌లో శిక్షణ పొందుతున్నారన్నారు. తాము 40ఎస్ఎంఈలతో కలిసి పనిచేస్తున్నట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టు కోసం 2012 నుంచే దివంగత రతన్ టాటా కృషి చేసినట్లు చెప్పారు. ఎయిర్ బస్ సంస్థతో స్నేహ సంబంధాలు నడిపి ఈ భాగస్వామ్యానికి పునాది వేశారన్నారు. రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఎక్స్‌లో స్పందిస్తూ అక్టోబర్ 28 భారత వైమానిక రంగంలో ప్రత్యేకమైన రోజుగా అభివర్ణించారు. దీని ప్రారంభోత్సవంలో ఆయన కూడా పాల్గొన్నారు. భారత్‌కు 56 సి-295 విమానాల సరఫ రాకు 2021 సెప్టెంబరులో రూ.21,935 కోట్లకు ఒప్పందం కుదిరింది. ఇందులో 16 విమానాలు స్పెయిన్‌లోని ఎయిర్‌బస్ సంస్థ కర్మాగారం నుంచి అందుతాయి. మిగతావి వడోదర యూనిట్‌లో సిద్ధమవుతాయి. కాలం చెల్లిన ఆవ్రో-748 విమానాల స్థానంలో భారత వాయుసేన వీటిని ప్రవేశపెట్టనుంది. సి-295కు సంబంధించిన విడిభాగాల ఉత్పత్తి హైదరాబాద్‌లోని 'మెయిన్ కన్‌స్టిట్యూయెంట్ అసెంబ్లీ'లో ఇప్పటికే ప్రారంభమైంది

## అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే ఉపేక్షించేది లేదు

### 4 ఇసుక లారీలు సీజ్ చేసిన పోలీసులు



**విశ్వంభర, ఏటూరు నాగారం:** ఏటూరు నాగారం మరుముల ఏజెన్సీ గ్రామీణ ప్రాంతాల్లో అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఏటూరు నాగారం ఎస్ఐ తాజుద్దీన్ అన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా అధికారుల కళ్ళు కప్పి అక్రమ ఇసుక రవాణాకు పాల్పడుతున్న 4 ఇసుక లారీలను ఆదివారం సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ తాజుద్దీన్ మాట్లాడుతూ.. ములుగు జిల్లా ఎస్పీ శభరిష్ ఆదేశాల మేరకు ఏటూరు నాగారం సీఐ అనుముల శ్రీనివాస్ సూచనల మేరకు పోలీసుల ఆధ్వర్యంలో ఆదివారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక లారీలలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వారిపై ఉక్కు పాదం మోపడం కోసం నిరంతరం నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఏపీ 24 టీసీ 4834, టీఎస్ 07 యూకే 0369, ఏపీ 20టీబియూబీ 0366, ఏపీ 208586, టీఎస్ 20 8586, టీ ఎస్ 07 యుజి 2969 జీరో ఇసుక లారీలు పోలీసులకు పట్టుబడ్డాయి. రెండు లారీలు తప్పించుకొని వెంకటాపురం సమీపంలోకి వెళ్లారు. ఇట్టి విషయాన్ని సీరియస్‌గా తీసుకొని 24 గంటల్లో నిఘా నేత్రాల ద్వారా లారీలను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కి తరలించారు. పట్టుబడిన ఇసుక లారీలు జంగాలపల్లి గ్రామానికి చెందిన లంకెల శ్యామ్ అనే వ్యక్తివి అని గుర్తించారు. అక్రమ దందాలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తులు తమ పద్ధతులు మార్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సిఆర్పి ఆఫ్ పోలీసులు పాల్గొన్నారు.

### ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు



**విశ్వంభర, సంస్థాన్ నారాయణపురం:** తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ అసోసియేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా (ట్రాస్మా) ఆధ్వర్యంలో యాదగిరిగుట్టలో జరిగిన కార్యక్రమములో ఉత్తమ ఉపాధ్యాయులుగా మండల కేంద్రానికి చెందిన ఈసీ విద్యాసాగర్ ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయునులు డీ పుష్పలత, కే లావణ్యలను ట్రాస్మా రాష్ట్ర అధ్యక్షులు ఎస్ మధుసూదన్, జనరల్ సెక్రెటరీ రమేష్ రావు సన్మానించారు. కరెస్పాండెంట్ కట్ల భాస్కరా చారి పాల్గొని అవార్డులు పొందిన ఉపాధ్యాయునీలను అభినందించారు.

## తెలంగాణ రాష్ట్ర టీడీఏఓస్ అసోసియేషన్ ఎన్నిక



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర స్థాయి ఎన్నికలు, రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస రావు, ప్రధాన కార్యదర్శి ఏ సత్యనారాయణ సమక్షంలో సోమవారం టీజీఓ భవనం నాంపల్లిలో నిర్వహించారు. ఎన్నికల అధికారిగా బీ శ్యామ్, సహాయ ఎన్నికల అధికారిగా శ్రీ డా. రామా రావు నిర్వహించారు. రాష్ట్ర స్థాయిలో 220డీఏఓ సభ్యులు ఎన్నికకు హాజరు అయినప్పటికీ, ఉత్కంఠ భరితంగా చివరకు ఏకగ్రీవంగా సంఘ సభ్యులు ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికల్లో టీడీఏ ఓస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షా కార్యదర్శులుగా సయ్యద్ శౌకత్ హుస్సేన్, పన్నాల మల్లికార్జున రెడ్డి, సహా అధ్యక్షులుగా శ్రీ టి రామకృష్ణ, కోశాధికారిగా ఎన్ శ్రీనివాస రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఆవుల రమేష్ కుమార్, జగన్ మోహన్ రెడ్డి, పుష్పలత, సహకార్యదర్శిలుగా కే శివకుమార్, వీ శ్రీనివాస్, భాగ్యలక్ష్మి కార్యనిర్వాహక కార్యదర్శి బీ అభ్యుదయ, ప్రచార కార్యదర్శి ఆర్ రాంబాబు, కార్యాలయ కార్యదర్శి లక్ష్మీ రాజం, సాంస్కృతిక కార్యదర్శి శ్రీకాంత్ క్రీడా కార్యదర్శి నవీన్కుమార్, కార్యవర్గసభ్యులుగా అశోక్ కుమార్, కే రమేష్, జఫ్ఫార్ ఖాన్ అనురాధ ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఈ సందర్భంగా ఏలూరి శ్రీనివాస రావు నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని అభినందించారు. ప్రభుత్వ అధికారులుగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పనిచేస్తూనే ప్రజలలో భాగమై మన హక్కుల కోసం పోరాడాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో టీజీఓ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ శ్యాం, ట్రెజరర్ ఉపేందర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ జగన్ మోహన్ రావు, జాయింట్ సెక్రెటరీ పరమేశ్వర్ రెడ్డి, లేడి రెప్రజెంటేటివ్ దీప రెడ్డి, ఈసీ మెంబర్ యాదగిరి, సుజాత, హైదరాబాద్ టిజిఓ జిల్లా శాఖా అధ్యక్షుడు ఎంబీ కృష్ణ యాదవ్, కోశాధికారి ఎంవీ రమణ, టిజిఓ, హైదరాబాద్ నగరశాఖా అసోసియేట్ ప్రెసిడెంట్ శిరీష, టిడిఏఓస్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు మొహియుద్దీన్, సెక్రటరీ రాధా రమణ రెడ్డి, కోశాధికారి హాశం, ఏపిఏఓ కేవీ. అప్పారావు, రంగారెడ్డి అధ్యక్షులు డా. రామా రావు పాల్గొని ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గానికి అభినందనలు తెలియజేశారు.

## మండల విద్యాధికారి శంకరయ్యకు వీడ్కోలు సన్మానం



**విశ్వంభర, కాటారం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండల కేంద్రంలో ప్రధానోపాధ్యాయుడికి విద్యాధికారిగా సేవలు అందించిన దడిగల శంకరయ్య ప్రధానోపాధ్యాయులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల. 31/10/2024 రోజున ఉద్యోగ విరమణ పొందుతున్న తరుణంలో శంకరయ్య పదవీ విరమణ సన్మాన వీడ్కోలు ఉత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అశేష విద్యార్థులు స్వాగతం పలుకుతూ శంకరయ్య, విజయ దంపతులకు పూలు చల్లుతూ కరతాళ ధ్వనుల మధ్య సన్మాన వేదికకు ఆహ్వానం పలికారు. వృత్తినే దైవంగా భావించి పుట్టి పెరిగిన తాను చదువుకున్న స్వగ్రామంలోనే ప్రధానోపాధ్యాయుడిగా, మండల విద్యాధికారిగా ఉద్యోగ విరమణ పొందడం వారి అదృష్టమని మండల విద్యాధికారి దేవా నాయక్, ఏఎంఓ రమేష్ అన్నారు. శంకరయ్య ఉద్యోగ ప్రస్థానం, వారి పిల్లలు ఎదిగిన తీరు, జీవితం చూస్తే వారి నిబద్ధత ఎంత గొప్పదో తెలిసిపోతుందన్నారు. ఏసీజీ రవీందర్ రెడ్డి, పురుషోత్తం మాట్లాడుతూ శంకరయ్య బీష్మ పితామహునితో పోల్చి సన్మానం చేశారు. డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి రెడ్డి శంకరయ్య సేవలు అమోఘమని మనమందరం ఆయనను ఇన్స్పిరేషన్ గా తీసుకొని పని చేస్తే సమాజంలో గుర్తింపు పొందడం సాధ్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మండల విద్యాధికారులు, పూర్వ ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, స్నేహితులు, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు మండల విద్యాధికారి శంకరయ్యని శాలువాలతో, పూల మాలలతో సన్మానం చేశారు. పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు బాలరాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది శంకరయ్య జ్ఞాపిక, శాలువాతో సత్కరించి సన్మాన పత్రం బహుకరించారు.

## నేటి మహా ధర్నా వాయిదా..

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ ఆటో & ట్రాన్స్ పోర్ట్ యూనియన్స్ ఐకాస మంగళవారం నిర్వహించ తలపెట్టిన మహా ధర్నా 144 సెక్షన్ విధింపు వల్ల వాయిదా పడింది. తదుపరి కార్యక్రమం ఎప్పుడు నిర్వహిస్తామనేది తర్వాత తెలియ చేస్తామని బీఎంఎస్ నాయకుడు రవిశంకర్ అల్లూరి, తెలంగాణ ఆటో & ట్రాన్స్ పోర్ట్ యూనియన్స్ ఐకాస ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. అందరూ సహకరించాలని వారు కోరారు.

## జూనియర్ లెక్చరర్ల ప్రొవిజనల్ జాబితా విడుదల

**విశ్వంభర, హైదరాబాద్:** జూనియర్ లెక్చరర్ల పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల ప్రొవిజనల్ జాబితాను టీజీపీఎస్సీ సోమవారం విడుదల చేసింది. ఫిజిక్స్, కెమిస్ట్రీ, సంస్కృతం, హిస్టరీ, ఉర్దూ మీడియంలో ఉర్దూ, ఫిజిక్స్ సబ్జెక్టులకు సంబంధించిన పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల హాల్ టికెట్లు వెల్లడించినట్లు అధికారులు వెల్లడించారు. మరిన్ని వివరాలకు టీజీపీఎస్సీ వెబ్‌సైట్ చూడాలని అధికారులు సూచించారు.

## సీఎం రేవంత్ రెడ్డి నివాసం వద్ద భద్రతా ఏర్పాట్లలో మార్పు



**విశ్వంభర, హైదరాబాద్:** జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసం వద్ద భద్రతా ఏర్పాట్లలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఇప్పటివరకు సీఎం ఇంటివద్ద బందోబస్తు విధులు నిర్వహించిన బెటాలియన్ పోలీస్ సిబ్బందిని సీఎం సెక్యూరిటీ వింగ్ తప్పించింది. వారి స్థానంలో ఆర్మ్‌డ్ రిజర్వ్ (ఏఆర్) సిబ్బందితో భద్రత కల్పించింది. సీఎం ఇంటికి మూడు వైపులా ఉన్న 22 మంది టీజీఎస్‌పీ సిబ్బందిని మార్చి ఏఆర్ సిబ్బందిని నియమించారు. గత కొన్ని రోజులుగా బెటాలియన్ పోలీసులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో ఉన్నతాధికారులు ఈ మార్పులు చేశారు.

## రాష్ట్రంలో బలహీన పడిన ఆవర్తనం

### పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు

**విశ్వంభర, హైదరాబాద్:** బంగాళాఖాతంలో గత నాలుగు రోజుల క్రితం ఏర్పడిన వాయుగుండం అల్పపీడనంగా మారింది. అది మరింత బలహీనపడి ఆవర్తనంగా మారినట్లు వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం ఇది ఒడిశా తీర ప్రాంతంపై కొనసాగుతుందని చెప్పారు. అయితే ఈ ఆవర్తనం మరింత బలహీన పడటం వల్ల వర్షాలకు ప్రస్తుతం అవకాశం లేదన్నారు. తెలంగాణతో పాటుగా ఏపీలోనూ వర్షాలు కురిసే అవకాశం లేదన్నారు.

## రాణీ దుర్గావతి ధైర్య సాహసాలు మహిళలకు ఆదర్శం

### నారీ శక్తికి ప్రతీక పుస్తకావిష్కరణ సభలో వక్తలు



**విశ్వంభర, హైదరాబాద్:** వీరనారి రాణీ దుర్గావతి ధైర్య సాహసాలు మహిళలకు ఆదర్శప్రాయమని వక్తలు అభిప్రాయపడ్డారు. రాణీ దుర్గావతి 500 సంవత్సరాల జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా ఆమెను స్మరించుకునే కార్యక్రమాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా వనవాసీ కళ్యాణ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం విద్యానగర్‌లో రాణీ దుర్గావతి -నారీ శక్తికి ప్రతీక అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. అఖిలభారతి వనవాసీ కల్యాణ పరిషత్ విద్యా ప్రముఖ్ రామచంద్రయ్య, వక్తలు రాణి దుర్గావతి ధైర్య సాహసాలను కొని యాడారు. 562 లో మొగల్ సామ్రాజ్యంలోని అక్బర్ మాల్వా ను ఓడించే ప్రయత్నంలో తన తన కుడి కంటిని బాణంతో గాయమైనా.. మెడలో కుడి భుజానికి తీవ్రమైనటువంటి రక్తస్రావం జరిగి ప్రాణాపాయ స్థితి ఏర్పడిన సందర్భంలోనూ వీరోచితంగా పోరాడిన ఘట్టాలను కళ్ళ కట్టినట్టుగా ఈ పుస్తకంలో వివరించారని పేర్కొన్నారు. హిందీ నుంచి తెలుగులోకి పుస్తకాన్ని అనువదించిన హనుమాన్ ప్రసాద్ సైతం ప్రసంగించారు. వనవాసీ కళ్యాణ పరిషత్ క్షేత్ర సంఘటన మంత్రిశివరాంజీ, నరసింహరెడ్డి,చలపతి, భాగ్యనగర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## నెల రోజులు ఆంక్షలు.. ర్యాలీలు, ధర్నాలు నిషేధం

### పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ వెల్లడి

**విశ్వంభర, హైదరాబాద్:** ఆందోళనల నేపథ్యంలో నగరంలో పోలీసులు ఆంక్షలు విధించారు. నెలరోజుల పాటు ఆంక్షలు విధిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. నగరంలో అశాంతిని సృష్టించడానికి పలు సంస్థలు, పార్టీలు ప్రయత్నిస్తున్నాయని విశ్వసనీయ సమాచారం అందిందని, ఆంక్షలు విధిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సోమవారం నుంచి నవంబర్ 28 వరకు సభలు, సమావేశాలు, ధర్నాలు, రాస్తారోకోలు, ర్యాలీ లపై నిషేధం విధిస్తున్నట్లు తెలిపారు. ఐదుగురికి మించి గుమికూడితే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. బీఎన్ఎస్ సెక్షన్ 163 కింద ఆంక్షలు విధించినట్లు తెలిపారు.కాగా, ఏక్‌పోలీస్ విధానం అమలు, సస్పెండ్ చేసిన కానిస్టేబుళ్లను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బెటాలియన్ కానిస్టేబుళ్లు చేస్తున్న ఆందోళన ఉధృతమైంది. యూనిఫాంలతో వచ్చి సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరికలు జారీ చేశారు. పోలీసులు హైదరాబాద్‌లో ఆంక్షలు విధించారు.

## రూ.లక్ష విలువచేసే నాణేలతో చిన్నారికి అలంకరణ

### బారసాల వేడుకల్లో కొత్తదనం



**విశ్వంభర, మహబూబ్‌నగర్:** వేడుక ఏదయినా ఎవరూ చేయని రీతిలో కొత్తదనం చూపించాలనే తాపత్రయం క్రమంగా పెరుగుతోంది. అలాగే తమ సంతోషాన్ని వ్యక్తం చేయడానికి సృజనా త్మకంగానూ ఆలోచిస్తున్నారు. అలాంటి ఉదంతమే ఇది. తమకు సాక్షాత్తూ లక్ష్మీ దేవి పుట్టిందని సంతోషపడుతూ బారసాలను వైవిధ్యంగా నిర్వహించారా కుటుంబసభ్యులు. చిన్నారి తమ ఇంట్లో అడుగుపెట్టిన శుభసమయంలో పాపకు లక్ష రూపాయల విలువ చేసే రూ. 5 నాణేలతో అలంకరించి వేడుక నిర్వహించారు.మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కృష్ణ కాలనీలో చోటు చేసుకుంది. కాలనీకి చెందిన ప్రశాంత్, వర్ష దంపతులకు తొలి సంతానంలో కుమార్తె పుట్టింది. తమ ఇంట్లో లక్ష్మీ దేవి జన్మించిందని భావించి పాపకు బారసాలలో రకరకాలుగా ఇంటిని రంగురంగుల పూలు, బెలూన్‌లతో రూపాలలో అలంకరించి బారసాల వేడుకను నిర్వహించారు. పాపను చాపపై పడుకోబెట్టి రూ. లక్ష విలువ చేసే 5 రూపాయల నాణెలతో అందంగా తీర్చి దిద్ది, అపురూపంగా తల్లి తండ్రులు ఆ పాపను ఎత్తుకుని మురిసిపోయారు. పాపాయి లక్ష్మి దేవిలా కళ కళలాడే లాగా అలంకరించామని ఆనందం వ్యక్తం చేశారు.

## తెలంగాణలో డిప్యూటీ, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు బదిలీ

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో డిప్యూటీ కలెక్టర్లు, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు బదిలీ అయ్యారు. 47 మంది డిప్యూటీ కలెక్టర్లు, 23 మంది స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 15 జిల్లాల అదనపు కలెక్టర్లు, 4 జిల్లాల డీఆర్వోలు బదిలీ అయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

## ఈ బైక్ షోరూం ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే

**విశ్వంభర, పరిగి:** పరిగి పట్టణంలో ఏడిఎంఎస్ ఎలక్ట్రిక్ ఈ- బైక్ షోరూంను పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి అప్నా ఈ- బైక్ వ్యాపార భాగస్వాములైన అస్ఘర్ హుసైన్, వి. ప్రకాష్, నరహరి, అన్వర్ హుసైన్ లకు శుభకాంక్షలు తెలుపుతూ పరిగి పట్టణంలో ఎలక్ట్రిక్ ఈ- బైక్ షోరూమ్ రావడం చాల మంచి విషయమన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డికి అప్నా ఈ- బైక్ యజమానులు శాలువా కప్పి, పూల మాలతో సన్మానించించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ కుమార్, పిఎసిఎస్ చైర్మన్ శ్యామ్ సుందర్ రెడ్డి, దోమ జడ్పీటీసీ నాగి రెడ్డి, పరిగి మాజీ ఏఎంసీ చైర్మన్ సురేందర్ కుమార్, బీఆర్ఎస్ పార్టీ పరిగి పట్టణ అధ్యక్షుడు ఆంజనేయులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రవీణ్ కుమార్ రెడ్డి, కౌన్సిలర్లు మీర్ తాహేర్ అలి, నాగేశ్వర్, టీ వెంకటేష్, రవికుమార్, గడిసింగపూర్ మాజీ సర్పంచ్ అశోక్ వర్ధన్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ హన్మంతు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశ్వంభర V3 NEWS

జనగణనకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు సంబంధిత వర్గాల సమాచారం. ప్రతి పది సంవత్సరాలకోసారి ఆనవాయితీగా నిర్వహించాల్సిన జనగణన మూడేళ్లుగా ఎప్పటికప్పుడు వాయిదా పడుతూ వస్తోంది. రాష్ట్రాలవారీగా, జాతీయస్థాయిలో రకరకాల అభివృద్ధి పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు రూపొందించి అమలుపరచడానికి ఈ జనగణనే కీలకం. చివరిసారిగా 2011లో జనగణన చేపట్టారు. ఆ తర్వాత 2021లో జరగాల్సి ఉన్నప్పటికీ కొవిడ్ మహమ్మారి కారణంగా వాయిదా పడింది. ఆ తర్వాత మహమ్మారి ప్రభావం తగ్గినప్పటికీ జనగణనపై కేంద్రం దృష్టి సారించలేదు. దీంతో ప్రభుత్వంపై అనేక విమర్శలు వచ్చాయి. జనగణన జరగకపోవడం వల్ల ఆర్థిక డాటా, ద్రవ్యోల్బణం, ఉద్యోగాలకు సంబంధించిన సమాచార నాణ్యతపై ప్రభావం పడుతున్నదని పలువురు ఆర్థికవేత్తలు కూడా పేర్కొన్నారు. ఇప్పటివరకు ఈ లెక్కలన్నీ 2011 జనాభా లెక్కల ఆధారంగా చేస్తూ రావడం వల్ల దేశంలో అసలైన పరిస్థితులు ప్రతిబింబించడం లేదని అభిప్రాయపడ్డారు.వచ్చే ఏడాది నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమవుతుందని, 2026 వరకు కొనసాగవచ్చని తాజాగా ప్రభుత్వవర్గాలు పేర్కొన్నాయి. అనంతరం లోక్‌సభ స్థానాల పునర్విభజన ప్రక్రియ ప్రారంభమవుతుందని, అది 2028కి ముగుస్తుందని వెల్లడించాయి. కేంద్ర ప్రభుత్వం ఇందుకు అనుసరించే విధివిధానాల వల్ల దక్షిణాది రాష్ట్రాలకు తీరని నష్టం వాటిల్లుతుందన్న ఆందోళన రేగుతోంది. జనాభా ప్రాతిపదిన నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలు అభిప్రాయం వ్యక్తమవుతోంది. జనాభా తక్కువగా ఉండటం వల్ల లోక్‌సభలో వాటి ప్రాతినిధ్యానికి కోత పడనుందని, జనాభా పెరుగుదల నియంత్రణకు దోహదపడిన దక్షిణాది రాష్ట్రాలు నియోజకవర్గాల పునర్విభజనలో గణనీయంగా నష్టపోనున్నాయని , కుటుంబ నియంత్రణలో దక్షిణాది రాష్ట్రాలు సాధించిన విజయమే వాటి పాలిట శాపం కానుందన్న భారీగా నియోజకవర్గాలను కోల్పోనున్నాయని రాజకీయ విశ్లేషకులు, దక్షిణాది రాష్ట్రాలు నేతలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. జనాభా ప్రాతిపదికన లోక్ సభ నియోజకవర్గాల పునర్విభజనతో నష్టం ఎలా వాటిల్లుతుందో అనే అంశంపై విశ్వంభర దినపత్రిక విశ్లేషణ...



## నియోజకవర్గాల పునర్విభజన...

# దక్షిణాదికి పెనుసవాలు!

## నివారణకు బహుముఖ వ్యూహాన్ని అనుసరించాలి..

దీన్ని నివారించడానికి దక్షిణ భారత రాష్ట్రాలు బహుముఖ వ్యూహాన్ని అనుసరించాలి. తమ ఆర్థిక వాటాలను, రాజకీయ ప్రాతినిధ్యాన్ని కాపాడుకోవడానికి ఒక రాజకీయ కూటమిగా ఏర్పడి కేంద్రంతో సంప్రదింపులు చేపట్టాలి. కేవలం జనాభాకే ప్రాముఖ్యం ఇవ్వడం సరికాదనీ... దేశ ఆర్థికాభివృద్ధిలో దక్షిణాది వాటాను, పరిపాలనా సామర్థ్యాన్ని, అభివృద్ధిలో నాణ్యతను కూడా దృష్టిలో ఉంచుకోవాలని కేంద్రానికి నచ్చజెప్పాలి. దేశంలోని ఇతర ప్రాంతాలను కూడా కలుపుకొనిపోయి అసమానతలకు తావులేని విధంగా లోక్‌సభా నియోజకవర్గాల పునర్విభజన జరిగేలా చూడాలి. ఈ విషయంలో ఇతర ప్రాంతాల్లోని రాజకీయ పార్టీలతో కలసి స్థూలమైన ఏకాభిప్రాయాన్ని సాధించాలి. రాజకీయ ప్రాతినిధ్యాన్ని కాపాడుకోవడంతోపాటు 16వ ఫైనాన్స్ కమిషన్ ద్వారా దక్షిణాదికి ఆర్థికంగా న్యాయమైన వాటా లభించేలా కృషి చేయాలి. రాజకీయ, ఆర్థిక అధికారాల బదిలీకి జనాభాకన్నా భిన్నమైన సూత్రీకరణ (ఫార్ములా) చేపట్టాలని కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి.

## ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం

జనాభా నిష్పత్తి ఆధారంగా కాకుండా రాజ్యాంగంలోని ఆర్టికల్ 81కు సవరణ చేయడం ద్వారా దక్షిణ భారత రాష్ట్రాలు నష్టపోకుండా కొత్త ఫార్ములా తీసుకురావాలి.లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాదికి సంభవించే అపాయకర పరిణామాల గురించి సమాచార సాధనాల ద్వారా ప్రజలకు వివరించాలి. దక్షిణాదికి అన్యాయం జరగకుండా నివారించడానికి కేంద్రంతో రాజకీయ నాయకులు విస్తృత చర్చలు చేపట్టేలా ప్రజలే వారిపై ఒత్తిడి తీసుకురావాలి. అందుకోసమని వారిని సంఘటితపరచి కార్యోన్ముఖుల్ని చేయాలి. ముఖ్యంగా మేధావులు, పౌర సంఘాలు, జాతీయస్థాయిలో దక్షిణాది రాష్ట్రాల దృక్కోణాన్ని విడమరచి చెప్పాలి. పునర్విభజన ప్రక్రియలో అసమానతలు, అన్యాయాలను అవసరమైతే న్యాయస్థానాల దృష్టికి తీసుకెళ్లాలి. ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీసే రాజకీయ తప్పటడుగులను అరికట్టాలి. ఏతావతా 2026లో లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన దక్షిణ భారత రాష్ట్రాలకు పెను సవాలుగా పరిణమించనుంది. దీనికి రాజకీయ, ఆర్థిక, న్యాయపరమైన పరిష్కారాలను కనుగొనాలి. జనాభా నియంత్రణలో, పరిపాలనలో, అభివృద్ధిలో ముందు ఉన్న రాష్ట్రాలకు రాజకీయ ప్రాతినిధ్యంలో, ఆర్థికాధికారాల బదిలీలో న్యాయం జరిగేలా కేంద్రం చొరవ తీసుకోవాలి.

## 50 ఏళ్లుగా నిలిచిపోయిన నియోజకవర్గాల పునర్విభజన...

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్-82, ఆర్టికల్-170 ల ప్రకారం దేశంలో ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి జనగణన జరగాలి. జనాభా నిష్పత్తి ఆధారంగా లోక్‌సభ, విధానసభ సరిహద్దులను నిర్ణయించాలి. ఆ తర్వాత రిజర్వేషన్లు మారుస్తూ నియోజకవర్గాల సంఖ్యను నిర్ణయించడానికి పునర్విభజన కమిషన్‌ను ఏర్పాటు చేస్తారు. ఇది ఒక చట్టబద్ధ సంస్థ. దేశంలో అన్ని ప్రాంతాలకు, కులాలకు సమన్యాయం చేయడం దీని ప్రధాన ఉద్దేశం. దేశంలో ఇప్పటి వరకు 1952, 1963, 1973, 2002 లలో నాలుగుసార్లు నియోజక వర్గాల పునర్విభజన జరిగింది. ఇప్పుడు మనకున్న నియోజకవర్గాల సంఖ్యను 1971 జనాభా లెక్కల ఆధారంగా 1973 లో నిర్ణయించారు. దేశంలో జనాభా పెరుగుదల ప్రమాదకరంగా మారిందని భావించి జనాభా నియంత్రణ జరగాలనే ఉద్దేశంతో 1976లో 42వ రాజ్యాంగ సవరణ చేసి ఈ ప్రక్రియను 2001 వరకు నిలిపివేశారు. 2002లో పునర్విభజన జరపాలని ఎన్డీఎ ప్రభుత్వం భావించింది. కానీ దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయని దక్షిణాదికి చెందిన భాగస్వామ్య పార్టీలు అడ్డుకున్నాయి. ఫలితంగా 2026 వరకు నిషేధాన్ని పొడిగించారు. అంటే గత 50 సంవత్సరాల నుంచి దేశంలో నియోజకవర్గాల పెరుగుదల నిలిచిపోయింది.

## గణనీయంగా నష్టపోనున్న దక్షిణాది రాష్ట్రాలు..

విపక్ష పార్టీలు సైతం జనగణన చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాయి. దీంతో దిగొచ్చిన ఎన్డీయే ప్రభుత్వం జనగణన చేపట్టి.. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన చేయాలని ఆలోచిస్తున్నది. ఒకవేళ అదే గనుక జరిగితే నియోజకవర్గాల విభజనలో కుటుంబ నియంత్రణను కచ్చితంగా పాటించి, జనాభా పెరుగుదల నియంత్రణకు దోహదపడిన దక్షిణాది రాష్ట్రాలు నియోజకవర్గాల పునర్విభజనలో గణనీయంగా నష్టపోనున్నాయి. భారీగా నియోజకవర్గాలను కోల్పోనున్నాయి. దక్షిణాది రాష్ట్రాలకు మొత్తం కలిపి 165 స్థానాలు మాత్రమే ఉంటాయి. మిగిలిన 24 రాష్ట్రాలకు 683 స్థానాలు ఉంటాయి. ఇందులో కూడా అత్యధిక స్థానాలు గంగానది తీర ప్రాంత రాష్ట్రాలు, హిందీ భాష మాట్లాడే రాష్ట్రాలకు లభిస్తాయి.ఒక్క ఉత్తరప్రదేశ్‌లో 63 స్థానాలు పెరిగి 143 స్థానాలు అవుతాయి. ఉత్తర భారత రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళల జనాభా తక్కువ. ఈ రాష్ట్రాల్లో జనాభా పెరుగుదల శాతమూ తక్కువే. ఏపీ, తెలంగాణలకు కలిపి ప్రస్తుతం లోక్‌సభలో 42 సీట్లు ఉన్నాయి. అవి మొత్తం 543 లోక్‌సభ సీట్లలో 7.73 శాతానికి సమానం. 2026లో లోక్‌సభ సీట్లను 543 దగ్గరే యథాతథంగా కొనసాగించి పునర్విభజన జరిపితే రెండు తెలుగు రాష్ట్రాల సీట్లు 34కు తగ్గిపోతాయి. ఇది 6.26 శాతానికి సమానం. అలాకాకుండా, పాత సూత్రీకరణను అనుసరించి ప్రస్తుత జనాభాకు అనుగుణంగా లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన చేపడితే- సీట్ల సంఖ్య 848కి చేరుతుంది. అప్పుడు తెలుగు రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాలు 54కు పెరుగుతాయి. కానీ, అవి మొత్తం సీట్లలో 6.37శాతానికి సమానం. ఎలా చూసినా ఇప్పుడున్న 7.73శాతంకన్నా అవి బాగా తక్కువ. కాబట్టి, 2026 నుంచి రెండు తెలుగు రాష్ట్రాలకు లోక్‌సభలో రాజకీయ ప్రాతినిధ్యం తగ్గే ప్రమాదముంది. కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాల పరిస్థితీ అంతే. అంటే, జనాభా నియంత్రణలో దక్షిణ రాష్ట్రాల సాఫల్యం వాటి రాజకీయ ప్రాతినిధ్యానికే ఎసరు పెడుతోందన్నమాట!.

**దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం ఇలా... (స్థానాలు, సీట్ల శాతం)**

| రాష్ట్రం | 543 సీట్ల లోక్‌సభలో | | 848 సీట్ల లోక్‌సభలో |
|---|---|---|---|
| | ప్రస్తుతం | పునర్విభజన తరవాత | |
| ఆంధ్రప్రదేశ్+తెలంగాణ | 42 (7.73%) | 34 (6.26%) | 54 (6.37%) |
| కర్ణాటక | 28 (5.15%) | 26 (4.79%) | 41 (4.83%) |
| కేరళ | 20 (3.68%) | 12 (2.21%) | 20 (2.36%) |
| తమిళనాడు | 39 (7.18%) | 31 (5.71%) | 49 (5.78%) |

**ఉత్తరాది రాష్ట్రాల ప్రాతినిధ్యం ఇలా... (స్థానాలు, సీట్ల శాతం)**

| రాష్ట్రం | 543 సీట్ల లోక్‌సభలో | | 848 సీట్ల లోక్‌సభలో |
|---|---|---|---|
| | ప్రస్తుతం | పునర్విభజన తరవాత | |
| దక్షిణాది రాష్ట్రాల మొత్తం ప్రాతినిధ్యం | 129 (23.74%) | 103 (18.97%) | 164 (19.34%) |
| ఉత్తర్‌ప్రదేశ్ | 80 (14.73%) | 91 (16.76%) | 143 (16.86%) |
| మహారాష్ట్ర | 48 (8.84%) | 48 (8.84%) | 76 (8.96%) |
| పశ్చిమ్ బెంగాల్ | 42 (7.73%) | 38 (6.99%) | 60 (7.08%) |
| బిహార్ | 40 (7.36%) | 50 (9.21%) | 79 (9.31%) |
| మధ్యప్రదేశ్ | 29 (5.34%) | 33 (6.08%) | 52 (6.13%) |

## లబ్దిపొందాలని చూస్తున్న బీజేపీ...

ఉత్తర భారతదేశంలో సీట్లు పెంచుకోవటం ద్వారా లబ్ధిపొందాలని బీజేపీ చూస్తున్నది. కానీ అదే జరిగితే ఉత్తర, దక్షిణ భారత దేశాల ప్రజల మధ్య విభజనకు దారి తీస్తుంది. దక్షిణాది ప్రజలు తమకు అన్యాయం జరుగుతున్నదని బలంగా నమ్ముతారు. అది తిరుగుబాటుకు దారి తీస్తుంది. రాజకీయ వైషమ్యాలు పక్కన పెట్టి దక్షిణ భారత రాష్ట్రాల నాయకులంతా ఒక్కతాటిపైకి వచ్చి దేశంలో అన్యాయానికి గురవుతున్న అనేక చిన్న రాష్ట్రాలను కలుపుకొని ఉద్యమించకుంటే శాశ్వత బానిసలుగా మిగిలిపోవాల్సి వస్తుంది.

## దేశాభివృద్ధికి దోహదం చేసిన దక్షిణాది రాష్ట్రాలు..

స్వతంత్రం వచ్చిన తరువాత దక్షిణ భారత రాష్ట్రాలు అన్ని రంగాల్లో గొప్ప ప్రగతిని సాధించి ఈ దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించాయి. జనాభా నియంత్రణను నియమబద్ధంగా పాటించడం వల్ల దేశ జనాభాలో 18శాతం మాత్రమే ఉన్నా దేశ జీడీపీలో 35శాతం వాటా దక్షిణాది రాష్ట్రాలదే. ఇక తలసరి ఆదాయం విషయానికి వస్తే జాతీయ సగటు కంటే అధికంగా నమోదు చేసుకొని మొదటి 5 స్థానాలలో నిలుస్తున్నాయి. దేశంలో మిగతా 24 రాష్ట్రాలలో పోలిస్తే దక్షిణ భారత రాష్ట్రాలు ఆర్థికంగా అత్యంత బలంగా ఉన్నాయి.దేశంలో వసూలయ్యే పన్నుల వాటాలో సింహ భాగం దక్షిణాది రాష్ట్రాల నుంచి వస్తున్నది. కానీ ఇక్కడి నుండి వచ్చే పన్నుల్లో అత్యధిక శాతం ఉత్తర భారతదేశంలో ఖర్చు చేస్తున్నారు. మానవాభివృద్ధి సూచి మొదలుకొని అన్ని అభివృద్ధి సూచిల్లో దక్షిణాది రాష్ట్రాలు ముందువరుసలో ఉన్నాయి. కానీ దేశంలో ఎప్పుడో ఒకటి అర తప్ప అత్యధిక భాగం ఉత్తరాది నాయకుల పెత్తనమే ఉంటుంది. ఎందుకంటే అన్ని పార్టీల్లో వారి సంఖ్య అత్యధిక కావడం వల్ల. కనుక ఉత్తరాది రాష్ట్రాలకు అత్యధిక ప్రాధాన్యం లభిస్తుంది. ఇప్పటికే అన్యాయానికి గురవుతున్న దక్షిణ భారత రాష్ట్రాలకు ఇప్పుడు జనాభా ప్రాతిపదికన నియోజక వర్గాల పెంపుదల చేస్తే మరింత అన్యాయం జరుగుతుందనే భావన వ్యక్తమవుతోంది.

## కటుంబ నియంత్రణ సమర్థవంతంగా అమలుతో దక్షిణాదితో తగ్గిన జనాభా..

ప్రస్తుత పరిస్థితుల్లో విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయి.కారణం.. కుటుంబనియంత్రణ దక్షిణాది రాష్ట్రాలలో ఖచ్చితంగా,సమర్ధవంతంగా అమలుచేయడమేనని తేలింది. ఒకప్పుడు “ఇద్దరైతే ముద్దు..ఆపై వద్దు” ఒక్కరు లేదా ఇద్దరు చాలు అనే కుటుంబనియంత్రణ నినాదం జనంలోకి బలంగా వెళ్లింది. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలలో ప్రజలు అందుకు కట్టుబడ్డారు. తమ ఆర్థిక పరిస్థితి మేరకు చిన్న కుటుంబం, చింతలు లేని కుటుంబం అని భావించి కుటుంబ నియంత్రణను కచ్చితంగా పాటించారు. . పిల్లల చదువులకు అధిక ప్రాధాన్యత ఇచ్చే దక్షిణాది కుటుంబాలు ఒకరిద్దరు పిల్లలో సరి పెట్టుకుని పిల్లల చదువులకు ఎలాంటి ఆటంకాలూ, ఆర్థిక సమస్యలూ ఎదురు కాకుండా చూసుకున్నారు. 1976 తరువాత దక్షిణాది రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వ జనాభా నియంత్రణ కార్యక్రమాలను పాటించి జనాభాను నియంత్రణలోకి తెచ్చి దేశాభివృద్ధికి దోహదం చేశాయి. ఉత్తరాది రాష్ట్రాలు జనాభాను అడ్డు అదుపు లేకుండా పెంచుకుంటూ పోయాయి. జనాభా నియంత్రణ చేసినందుకు శిక్షగా దక్షిణ భారత రాష్ట్రాలు తమ నియోజకవర్గాలు కోల్పోవాల్సి వస్తుంది. అదే ఉత్తర భారత రాష్ట్రాలు తాము చేసిన తప్పుకు బహుమతిగా నియోజకవర్గాలు పెరుగుతాయి. ఉత్తరాది,దక్షిణాది ల మధ్య జనాభా పెరుగుదల రేటులో వత్యాసం ఉండటానికి కారణం ఎందుకంటే ...ప్రైవేటీకరణతో విద్య, వైద్యం చాలా ఖరీదుగా మారిపోయాయి. పిల్లల ఎల్కేజీ చదువుకే లక్షలు ఖర్చుపెట్టాల్సిన పరిస్థితి, చిన్నపాటి జ్వరానికే వేలాది రూపాయల చమురు వదిలే పరిస్థితి వచ్చింది. దీంతో దక్షిణాది రాష్ట్రాల ప్రజలు చిన్న కుటుంబాలే మేలని తలపోసి కుటుంబనియంత్రణ వైపే మొగ్గు చూపాయి. అయితే ఉత్తరాదిలో ప్రజలు మాత్రం అందుకు భిన్నంగా కుటుంబ నియంత్రణపై పెద్దగా దృష్టి పెట్టలేదు. దీంతో జనాభా పెరుగుదల విషయంలో దక్షిణాది ఉత్తరాది మధ్య భారీ అంతరం ఏర్పడింది.

## ఉత్తరాది రాష్ట్రాల రాజకీయ పెత్తనం పెరుగుతోంది..

దక్షిణాది రాష్ట్రాల మాదిరిగా కుటుంబ నియంత్రణకు ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో అధిక జనాభా కలిగిన ఉత్తర్‌ప్రదేశ్, బిహార్‌లు లోక్‌సభలో తమ సీట్ల సంఖ్యను ఇప్పటికన్నా ఎక్కువగా పెంచుకోనున్నాయి. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, బీహార్, మహారాష్ట్ర ...ఈ నాలుగు రాష్ట్రాల్లో గెలిస్తే చాలు దేశాన్ని పాలించవచ్చు. దక్షిణ భారత రాష్ట్రాలు ఈ దేశాన్ని పాలించే అవకాశం శాశ్వతంగా కోల్పోయి మైనారిటీ ప్రజలుగా, మైనారిటీ రాష్ట్రాలుగా మిగిలిపోతాయి. బీజేపీకి దక్షిణ భారతదేశంలో సమీప భవిష్యత్తులో బలం పెరుగుతుందనే నమ్మకం పోయింది. మొన్నటి వరకు అధికారంలో ఉన్న కర్ణాటక కూడా చేజారిపోయింది. ఈ లెక్కన చూస్తే- పరిపాలన, అభివృద్ధి, జనాభా నియంత్రణ వంటి అంశాల్లో సామర్థ్యం కనబరచిన దక్షిణాది రాష్ట్రాలకు శిక్షగా లోక్‌సభలో ప్రాతినిధ్యానికీ, రాజకీయ ప్రాధాన్యానికీ కోతపడబోతోందన్న మాట. దానివల్ల కేంద్రం నుంచి తమకు రావాల్సిన నిధుల కోసం డిమాండ్ చేసే సత్తా దక్షిణాది రాష్ట్రాలకు తగ్గిపోతుంది. తమ అభివృద్ధికి అనుకూలమైన విధానాలు రూపొందించేలా కేంద్రంపై ఒత్తిడి చేయగల స్థితిలోనూ అవి ఉండలేవు. పర్యవసానంగా ఉత్తర-దక్షిణ విభేదాలు, ప్రాంతీయ ఉద్రిక్తతలు పెచ్చరిల్లే ప్రమాదముంది. తాము ఉపేక్షకు, నిర్లక్ష్యానికీ గురవుతున్నామనే భావన దక్షిణ భారత రాష్ట్రాల్లో పాదుకొంటుంది. అధిక జనాభా గల ఉత్తరాది రాష్ట్రాలకు లోక్‌సభలో సంఖ్యా బలం పెరిగితే, కేంద్రం నుంచి అవి పెద్దయెత్తున నిధులు రాబట్టుకోగలుగుతాయి. ఆ మేరకు దక్షిణ రాష్ట్రాల వాటాలో కోతపడుతుంది. రాజకీయాధికారంతోపాటు ఆర్థికాధికారమూ ఉత్తరాదికి తరలిపోతుంది. అధిక జనాభా గల ఉత్తర రాష్ట్రాలది పైచేయి అయినప్పుడు... సమర్థ పాలనకు, సమగ్ర అభివృద్ధికి పట్టం కట్టిన దక్షిణాది వెనకబడిపోతుంది.

## చంద్రబాబుకు జతకలిసిన స్టాలిన్..

‘ఒకరూ ఇద్దరు కాదు, ముగ్గురైతే ముద్దు’ ఇది ఎవరో చెప్పిన మాట కాదు. సాక్షాత్తూ ఏపీ సీఎం చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు కంటే ఎక్కువ పిల్లలున్నవారు మాత్రమే అర్హులు అయ్యేలా చట్టం తెస్తామంటున్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా ఎక్కువ మంది పిల్లల్ని కనాలంటూ ప్రజలకు పిలుపునిస్తున్నారు. కుటుంబ నియంత్రణ అనే మాట మరచిపొమ్మంటున్నారు. చంద్రబాబు అయితే గతంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కుటుంబ నియంత్రణను పాటించడంలో ముందున్న దక్షాణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం జరిగిందని పదేళ్ల కిందటే అన్నారు. ఒక్కరు లేక ఇద్దరు చాలు అన్న నినాదాన్ని పక్కన పెట్టేసి ఎక్కువ మంది పిల్లలను కనండి అన్న పిలుపూ పదేళ్ల కిందటే ఇచ్చారు. ఇప్పుడు చంద్రబాబుకు మద్దతుగా స్టాలిన్ ముందుకు వచ్చారు. ఇద్దరూ కూడా తమతమ రాష్ట్రాలలో జనాభా పెరగాలని కోరుకుంటున్నారు. ఇందుకు కారణం లేకపోలేదు. జనాభా లెక్కల ప్రకారం నియోజకవర్గాల విభజన జరుగుతుంది. ఎందుకంటే.. ఉత్తరాదిలో జనాభా పెరుగుదల రేటు దక్షిణాదిలో కంటే ఎక్కువగా ఉంది. జనాభా ప్రాతిపదికన జరిగే నియోజకవర్గాల నియోజకవర్గాల విభజనతో ఉత్తరాది రాష్ట్రాలలో లోక్ సభ స్థానాలు పెరుగుతాయి. ఆ మేరకు దక్షిణాదిలో తగ్గిపోతాయి. అంటే దక్షిణాది వాయిస్ వీక్ అవుతుంది. ఇప్పటికే దక్షిణాది పట్ల కేంద్రం చిన్న చూపు చూస్తోందన్న భావన దక్షిణాది రాష్ట్రాలలో బలంగా వ్యక్తం అవుతోంది. సాధారణంగా కేంద్ర ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా జనాభా నియంత్రణకు దోహదపడిన దక్షిణాది రాష్ట్రాలకు మేలు జరిగేలా చర్యలు ఉంటాయి. కానీ జనాభా నియంత్రణను పాటించిన దక్షిణాదికి అన్యాయం జరిగేలా ఇప్పుడు నియోజకవర్గాల పునర్విభజన జరుగుతోంది. అదే మాదిరిగా కేంద్రం నిధుల కేటాయింపులు ఉంటున్నాయి. అంటే ఎక్కువ జనాభా ఉంది కనుక ఎక్కువ నియోజకవర్గాలు ఉత్తరాదికి. జనాభా ఎక్కువగా ఉండటం వల్ల పేదరికం ఎక్కువగా ఉంది.. అందుకు కేటాయింపులలో అధిక భాగం ఉత్తరాదికే అన్నట్లుగా పరిస్థితి ఉంది. అంటే జనాభానియంత్రణకు దోహదపడిన కారణంగా దక్షిణాదికి తీరని నిష్టం జరుగుతోంది. అందుకే దక్షిణాది నేతలు కుటుంబ నియంత్రణ వద్దంటున్నారు. ఎక్కువ మంది పిల్లలు ఉంటేనే స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీకి అర్హత అంటున్నారు. పౌరుని సగటు కుటుంబ ఆదాయం 5వేల నుంచి11వేలరూపాయలకు పెరిగింది.అలాగే సగటు వ్యయం 5వేల నుంచి 12వేల రూపాయలకు పెరిగింది.తెలుగు రాష్ట్రాలలో అత్యధిక కుటుంబాలు గ్రామాల్లో నివసిస్తున్నారు.అలాగే మరో కారణమేంటంటే ప్రస్తుతం దేశంలో యువత జనాభా ఎక్కువగా ఉంది. అయితే ఈ పరిస్థితి రానున్న 30ఏళ్లలో పూర్తిగా మారిపోతుంది. మూడు దశాబ్దాల తరువాత దేశంలో వృద్ధుల జనాభా అధికమౌతుంది. అందుకని ఇప్పుడు జనాభా రేటు పెరాగాల్సిఉంది.అప్పుడే మన దేశం రాబోయే 30ఏళ్లలో కూడా యువత అధికంగా ఉన్న దేశంగా నిలువగలుగుతుంది. యువత అధికంగా ఉంటేనే దేశం అభివృద్ధి పథంలో పరుగులెత్తే అవకాశం ఉంటుంది. అందుకే ఉభయతారకంగా ఉంటుందని చంద్రబాబు, స్టాలిన్ వంటి నేతలు ఎక్కువ మంది పిల్లల్ని కనండి, దేశ పురోభివృద్ధిలో బాగస్వాములు కండి అంటూ ప్రజలకు పిలుపునిస్తున్నారు.

**- పోతుగంటి వెంకటరమణ, బ్యూరో చీఫ్**

# కివీస్‌తో ఆఖరి టెస్టు.. మళ్లీ మూడు మార్పులతో టీమ్‌ఇండియా!



**దిల్లీ:** స్వదేశంలో భారత్‌కు టెస్టు సిరీస్ ఓటమిని న్యూజిలాండ్ రుచి చూపించింది. తొలి టెస్టులో మాదిరిగానే రెండో మ్యాచ్‌లోనూ టీమ్‌ఇండియా బ్యాటర్లు చేతులెత్తేశారు. ముంబయిలోని వాంఖడే వేదికగా చివరి టెస్టు శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఆ తర్వాత భారత ఆటగాళ్లు దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్తారు. ఈక్రమంలో మూడో టెస్టులో మరోసారి మార్పులు చేయాలని మేనేజ్‌మెంట్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. రెండో టెస్టులోనూ మూడు మార్పులు చేసిన సంగతి తెలిసిందే. కేఎల్ రాహుల్, కుల్‌దీప్, సిరాజ్ స్థానాల్లో గిల్, సుందర్, ఆకాశ్‌కు అవకాశం దక్కింది. కానీ, భారత్‌కు మాత్రం ఓటమి తప్పలేదు. కనీసం చివరి మ్యాచ్‌లోనైనా గెలిచి పరువు కాపాడుకోవాలనే లక్ష్యంతో టీమ్‌ఇండియా ఆడ నుంది. అదే సమయంలో భవిష్యత్తు సిరీస్‌ల కోసం కీలక ఆటగాళ్లకు విశ్రాంతి ఇవ్వాలని భావిస్తోంది. ఇప్పటికే ఆప్షనల్ ప్రాక్టీస్ సెషన్‌ను రద్దు చేసిన సంగతి తెలిసిందే. సీనియర్ అయినా సరే ప్రతి ఒక్కరూ ప్రాక్టీస్ సెషన్‌కు హాజరు కావా ల్సిందేనని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం.

### మళ్లీ సిరాజ్‌కు అవకాశం..

తొలి టెస్టులో పెద్దగా ప్రభావం చూపించని మహ్మద్ సిరాజ్‌ను రెండో టెస్టుకు పక్కన పెట్టారు. ఇప్పుడు చివరి మ్యాచ్ కోసం అతడిని తీసుకుంటారని క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి. వర్క్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా జస్‌ప్రీత్ బుమ్రాకు విశ్రాంతినిచ్చి.. ఆకాశ్‌దీప్‌తో పాటు సిరాజ్ బౌలింగ్ దాడిని ప్రారంభించే అవకాశం లేకపోలేదు. ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల సిరీస్‌కు ఎక్కువ సమయం లేదు. బుమ్రాకి రెస్ట్ ఇవ్వడం ఖాయంగా కనిపిస్తోంది. రెండు టెస్టుల్లో బుమ్రా 3 వికెట్లు మాత్రమే తీశాడు. సిరాజ్ కూడా ఒక టెస్టులో 2 వికెట్లు పడగొట్టాడు.

### పంత్‌కు బదులు ధ్రువ్..

తొలి టెస్టులో గాయపడిన రిషభ్ పంత్ రెండో మ్యాచ్‌కు సిద్ధమవుతాడని ఎవరూ ఊహించలేదు. కానీ, వేగంగా కోలుకున్న అతడు పుణె టెస్టులోనూ ఆడాడు. పంత్‌పై మరీ ఎక్కువ భారం మోపకుండా ఉండాలనే ఉద్దేశంతో చివరి మ్యాచ్‌కు పక్కన పెట్టే అవకాశాలున్నాయి. అతడి స్థానంలో ధ్రువ్ జురెల్‌కు అవకాశం ఇవ్వనుందని సమాచారం. సబ్‌స్టిట్యూట్ వికెట్ కీపర్‌గా అతడు ఇప్పటికే ఈ సిరీస్‌లో సేవలు అందించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు పూర్తిస్థాయిలో బరిలోకి దిగనున్నాడు. అయితే, పంత్ సెంచరీ సాధించి నాలుగు ఇన్నింగ్స్‌ల్లో 137 పరుగులు చేశాడు. బ్యాటింగ్‌లోనూ ఆ లోటును ధ్రువ్ పూరించాల్సి ఉంటుంది.

### జడ్డూకి విశ్రాంతి..

న్యూజిలాండ్ టెస్టు సిరీస్ కోసం నలుగురు స్పిన్ ఆల్‌రౌండర్లను భారత్ ఎంపిక చేసింది. ఇందులో ముగ్గురికి ఆడే అవకాశం లభించింది. రవీంద్ర జడేజా, అశ్విన్, వాషింగ్టన్ సుందర్ ఆడిన సంగతి తెలిసిందే. జట్టులో ఉన్నప్పటికీ అక్షర్ పటేల్‌కు మాత్రం ఛాన్స్ రాలేదు. ఇప్పుడు మూడో టెస్టులో అతడిని బరిలోకి దింపాలని టీమ్‌ఇండియా మేనేజ్‌మెంట్ భావిస్తున్నట్లు సమాచారం. రవీంద్ర జడేజాకు విశ్రాంతి ఇచ్చి.. అతడి స్థానంలో అక్షర్‌ను ఆడించనుందని తెలుస్తోంది. జడేజా రెండు మ్యాచుల్లో 6 వికెట్లు తీయడంతోపాటు లోయర్ ఆర్డర్‌లో విలువైన 85 పరుగులు సాధించాడు. జట్టు విజయం సాధించకపోయినా అతడి ప్రదర్శన మాత్రం ఫర్వాలేదు.

# టీమిండియా హెడ్‌కోచ్‌గా లక్ష్మణ్..?



**దిల్లీ:** స్వదేశంలో న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్ ఆడుతున్న భారత జట్టుకు నవంబర్‌లో బీజీ షెడ్యూల్ ఉంది. ఆస్ట్రేలియా పర్యటన ఉన్నందున ప్రస్తుతం హెడ్‌కోచ్ గౌతం గంభీర్ జట్టుతో పాటు వెళ్లనున్నాడు. ఈ నేపథ్యంలో తాత్కాలిక కోచ్ అవసరం ఏర్పడింది. అందుకని మాజీ ఆటగాడు వీవీఎస్. లక్ష్మణ్‌కు మరోసారి బాధ్యత అప్పగించాలని బీసీసీఐ పెద్దలు నిర్ణయించారు. నవంబర్‌లో దక్షిణాఫ్రికా పర్యటనకు లక్ష్మణ్‌ను ప్రధాన కోచ్‌గా నియమించనున్నారు. త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. లక్ష్మణ్‌తో పాటు నేషనల్ క్రికెట్ అకాడమీ కోచింగ్ బృంద కూడా దక్షిణాఫ్రికా వెళ్లనుందని సమాచారం.

### ఇప్పటికే రెండుసార్లు..

భారత జట్టు తరఫున ఎన్నో చిరస్మరణీయ ఇన్నింగ్స్‌లు ఆడిన హైదరాబాదీ లక్ష్మణ్‌కు కోచింగ్‌లో అనుభవం ఉంది. గతంలో ఐర్లాండ్ పర్యటనకు, టీ20 వరల్డ్ కప్ అనంతరం జింబాబ్వే టూర్‌కు లక్ష్మణ్ టీమిండియాకు తాత్కాలిక కోచ్‌గా పని చేశాడు. అందుకని ఈసారి గంభీర్ దక్షిణాఫ్రికా పర్యటనకు అందుబాటులో లేకపోవడంతో.. మరోసారి అదే పాత్రను పోషించాల్సిందిగా సెలెక్టర్లు, బీసీసీఐ పెద్దలు లక్ష్మణ్‌ను సంప్రదించారు. సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలో భారత బృందం సఫారీ గడ్డపై 4 టీ20లు ఆడనుంది. తొలి మ్యాచ్ నవంబర్ 8న డర్బన్‌లో, గెబెర్హాలో రెండో టీ20 నవంబర్ 10న జరుగనున్నాయి. నవంబర్ 13న సెంచూరియన్‌లో, 15వ తేదీన జోహన్నెస్‌బర్గ్‌లో జరిగే చివరి రెండు టీ20ల్లో భారత్, దక్షిణాఫ్రికాలు తలపడనున్నాయి. దక్షిణాఫ్రికాతో పొట్టి సిరీస్ కోసం ఇప్పటికే సెలెక్టర్లు 15 మందితో కూడిన స్క్వాడ్‌ను ప్రకటించారు. ఐపీఎల్‌లో అమితంగా రాణించిన రమన్‌దీప్ సింగ్, బౌలర్ విజయ్‌కుమార్ వైశాక్, యశ్ దయాల్‌లను ఎంపిక చేశారు.

# కెప్టెన్‌కు గుడ్ బైకు గుడ్‌బై చెప్పేనా..?

### ప్లే ఆఫ్స్‌కే పరిమితం...

కేఎల్ రాహుల్ సారథ్యంలో లక్నో ప్లే ఆఫ్స్‌కే పరిమితం అయింది. మోకాలి గాయం కారణంగా 16వ సీజన్ నుంచి మధ్యలోనే వైదొలిగిన రాహుల్.. 17వ సీజన్‌లో పెద్దగా రాణించలేదు. అతడి కెప్టెన్సీ కూడా ఫ్రాంచైజీని మెప్పించ లేదు. దాంతో, స్టేడియంలో అందరూ చూస్తుండగానే రాహుల్‌పై లక్నో యజమాని సంజీవ్ గొయెంకా ఆగ్రహం చేసిన వీడియో అప్పట్లో తెగ వైరల్ అయింది. సంజీవ్ ఈ వివాదానికి తెరదించినా రాహుల్ మాత్రం జట్టును వీడేందుకే సిద్ధమయ్యాడట. 2022 మినీ వేలంలో లక్నో రూ.17 కోట్లు పెట్టి రాహుల్‌ను కొన్నది.



లక్నో: ఐపీఎల్ వేలం కంటే ముందు ఏ ఫ్రాంచైజీ ఎవరిని వదిలేస్తుంది అనేది అంతు చిక్కడం లేదు. అక్టోబర్ 31కి మరో రెండు రోజులే ఉన్నందున అన్ని ఫ్రాంచైజీలు దాదాపు తుది జాబితా సిద్ధం చేసే ఉంటాయి. అయితే.. స్టార్ ఆటగాళ్లను వదిలేస్తాయా అట్టిపెట్టుకుంటాయా అనేది సందేహాలు రేకెత్తిస్తోంది. ఈ పరిస్థితుల్లో లక్నో సూపర్ జెయింట్స్ తమ రిటెన్షన్ జాబితాను ఖరారు చేసిందనే వార్తలు వినిపిస్తున్నాయి. పద్దెనిమిదో సీజన్ కోసం ఆరుగురిని అట్టిపెట్టుకునేందుకు బీసీసీఐ అనుమతిచ్చింది. ఈసారైనా కప్ కొట్టాలనే కసితో ఉన్న లక్నో స్క్వాడ్‌లో సమూల మార్పులు చేయనుంది. నిలకడే కొలమానంగా తీసుకొని గత గత రెండు సీజన్లుగా అద్భుతంగా రాణించిన ఆటగాళ్లను అట్టిపెట్టుకోవాలని లక్నో యాజమాన్యం భావిస్తోంది. అందులో భాగంగానే ప్రస్తుతానికి ఐదుగురిని రిటైన్ చేసుకోవాలనే నిర్ణయానికి వచ్చేసింది. అందుకని ఐపీఎల్ 18వ సీజన్ కోసం చిచ్చరపిడుగు నికోలస్ పూరన్ ను తొలి ప్రాధాన్యంగా ఆ తర్వాత పేస్ సంచలనం మయాంక్ యాదవ్, యువ స్పిన్నర్ రవి బిష్ణోయ్‌లను రిటైన్ చేసుకోనుంది. అన్‌క్యాప్డ్ ప్లేయర్లుగా ఆకాశ్ బదొని, పేసర్ మొహ్సిన్ ఖాన్‌లు జట్టుతో కొనసాగనున్నారు. కెప్టెన్ కేఎల్ రాహుల్ భవితవ్యంపై ఫ్రాంచైజీ ఇంకా నిర్ణయానికి రాలేదని సమాచారం. రాహుల్ మాత్రం మళ్లీ లక్నోతో ఆడాలని అనుకోవడం లేదట. ఇదే విషయాన్ని అతడు టీమ్ సమావేశంలో చెప్పాడని కథనాలు వచ్చాయి. అదే జరిగితే.. రాహుల్‌ను వదిలేసి పూరన్‌కు పగ్గాలు అప్పగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇంటర్నేషనల్ టీ20 లీగ్‌లో పూరన్ ముంబై జట్టును చాంపియన్‌గా నిలిపాడు. కాబట్టి అతడి వైపు యాజమాన్యం మొగ్గు చూపుతుందని విశ్లేషకులు అంటున్నారు. అంతే కాదు ఈ ఐదుగురికి లక్నో ఎంత ధర చెల్లించనుంది అనేది తెలియాల్సి ఉంది.

## ముంబయి ఇండియన్స్ ఆ ముగ్గురిని
# రిటైన్ చేసుకుంటుంది: హర్భజన్ సింగ్



**ముంబయి:** ఐపీఎల్ ఫ్రాంఛైజీలు తాము రిటైన్ చేసుకునే ఆటగాళ్ల జాబితాను సమర్పించడానికి విధించిన గడువు సమీపించింది. అక్టోబర్ 31 సాయంత్రం ఐదుగంటలలోపు ఫ్రాంఛైజీలు రిటైన్ చేసుకునే ప్లేయర్స్ లిస్ట్‌ని సమర్పించాల్సి ఉంది. ఆరుగురు ఆటగాళ్లను అట్టిపెట్టుకోవడానికి ఫ్రాంచైజీలకు ఐపీఎల్ పాలకవర్గం అనుమతించింది. ఇందులో ఒక రైట్ టు మ్యాచ్ (ఆర్‌టీఎం) కలిసి ఉంటుంది. దీంతో ఏ జట్టు ఎవరిని రిటైన్ చేసుకుంటుందనే దానిపై అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలో భారత మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ ముంబయి ఇండియన్స్ ఎవరిని రిటైన్ చేసుకుంటుందో అంచనా వేశాడు. భజ్జీ చాలాకాలం పాటు ముంబయి తరఫున ఆడిన సంగతి తెలిసిందే. హార్దిక్ పాండ్య, సూర్యకుమార్ యాదవ్, జస్‌ప్రీత్ బుమ్రాలను ముంబయి అట్టిపెట్టుకుంటుందని హర్భజన్ అభిప్రాయపడ్డాడు. అయితే, మాజీ సారథి రోహిత్ శర్మను రిటైన్ చేసుకుంటుందా? లేదా అనే ప్రశ్న మిగిలి ఉందన్నాడు.“ముంబయి ఇండియన్స్ గత రెండు మూడేళ్లుగా సరిగ్గా ఆడలేదు. కానీ, అది ఒక ఛాంపియన్ టీమ్. చాలా బలమైన జట్టు. నాకు తెలిసినంతవరకు వారు కచ్చితంగా భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని జట్టును నిర్మించాలని ఆలోచిస్తారు. అయితే, ఈ సంవత్సరం అనుభవజ్ఞులైన ఆటగాళ్లను తీసుకోదని భావించొద్దు. గతేడాది హార్దిక్ పాండ్యను కెప్టెన్‌గా నియమించారు. అతడిని కచ్చితంగా రిటైన్ చేస్తారని భావిస్తున్నాను. జస్‌ప్రీత్ బుమ్రా, సూర్యకుమార్ యాదవ్‌ను కొనసాగిస్తారు. రోహిత్ శర్మను రిటైన్ చేస్తారా? లేదా అనే ప్రశ్న మిగిలి ఉంది. కెప్టెన్‌గా రోహిత్ ఇటీవల టీ20 ప్రపంచ కప్ సాధించాడు. కాబట్టి అతడిని కొనసాగిస్తారని భావిస్తున్నాను. రోహిత్‌ను రిటైన్ చేసుకునే ఆ సంఖ్య నాలుగుకి చేరుతుంది. ఐదో ప్లేయర్ కావాలనుకుంటే తిలక్ వర్మను కొనసాగించవచ్చు. భవిష్యత్తులో ముంబయి ఇండియన్స్ మ్యాచ్‌లు గెలవడానికి ఉపయోగపడే ఆటగాళ్లలో తిలక్ వర్మ ఒకరు. బౌలింగ్ విషయానికి వస్తే వారు రిటైన్ చేసుకోవడానికి మరెవరూ లేరు. దీంతో అన్‌క్యాప్‌డ్ ప్లేయర్ అయిన నేహాల్ వధేరా వారికి మంచి ఆప్షన్’ అని హర్భజన్ సింగ్ పేర్కొన్నాడు.

# బ్యాంకింగ్ స్టాక్స్ దన్ను.. లాభాలతో ముగిసిన ఈక్విటీ మార్కెట్లు..!

## బుల్ జోష్.. సెన్సెక్స్ మళ్లీ 80వేల ప్లస్

### ర్యాలీకి కారణాలు ఇవే..

స్టాక్‌మార్కెట్ సూచీలు ఇటీవల వరుస నష్టాలు చవిచూశాయి. నిఫ్టీని పరిగణనలోకి తీసుకుంటే జీవనకాల గరిష్ఠాల నుంచి దాదాపు 8 శాతం మేర కుంగింది. ఇదే అవకాశంగా భావించి మదుపర్లు కనిష్ఠాల వద్ద కొనుగోళ్లు జరపడం నేటి ర్యాలీకి ప్రధాన కారణంగా అనలిస్టులు విశ్లేషిస్తున్నారు. ఆసియా మార్కెట్లు లాభాల్లో ప్రారంభమవడంతో దేశీయ మార్కెట్ సూచీలు అదే బాటలో పయనించాయి. జపాన్ నిక్కీ భారీ లాభాల్లో కొనసాగగా.. ఆస్ట్రేలియా, షాంఘై, హాంకాంగ్ మార్కెట్లూ పాజిటివ్‌గా కదలాడాయి. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గడమూ మరో కారణం. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడి చేసినప్పటికీ.. చమురు, న్యూక్లియర్ వంటి వాటి జోలికి పోకపోవడంతో ప్రపంచ దేశాలు ఊపిరి పీల్చుకున్నాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతలపై ఆందోళన కొంతమేర తగ్గింది. దీంతో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ సోమవారం 3 డాలర్ల మేర క్షీణించి 72 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

**ముంబయి:** దేశీయ మార్కెట్ల వరుస నష్టాలకు బ్రేక్ పడింది. విదేశీ మదుపర్ల అమ్మకాలు, బలహీన త్రైమాసిక ఫలితాల కారణంగా గత ఐదు సెషన్లలో నష్టాలు చవిచూసిన స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం



బలంగా పుంజుకున్నాయి. ఆసియా మార్కెట్ల నుంచి అందిన సానుకూల సంకేతాలు, కనిష్ఠాల వద్ద కొనుగోళ్ల మద్దతుతో బుల్ మళ్లీ పరుగులు పెట్టింది. ఫలితంగా సెన్సెక్స్ మళ్లీ 80వేల మైలురాయిని దాటగా.. నిఫ్టీ 24,300 పైన స్థిరపడింది. ఈ ఉదయం సెన్సెక్స్ 79,653 వద్ద ఉత్సాహంగా ప్రారంభమైన సెన్సెక్స్ రోజంతా అదే జోరు కొనసాగించింది. ఒక దశలో 1100 పాయింట్లకు పైగా లాభపడి 80,539.81 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని తాకింది. చివర్లో మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడటంతో కాస్త ఒత్తిడికి గురైనప్పటికీ రాణించింది. మొత్తంగా మార్కెట్ ముగిసే సమయానికి 602.75 పాయింట్లు ఎగబాకి 80,005.04 వద్ద ముగిసింది. అటు నిఫ్టీ కూడా 24,134 – 24,492 మధ్య కదలాడి చివరకు 158.35 పాయింట్ల లాభంతో 24,339.15 వద్ద స్థిరపడింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 84.07 వద్ద ఫ్లాట్‌గా ముగిసింది. నిఫ్టీలో శ్రీరామ్ ఫైనాన్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, ఐసీఐసీఐ బ్యాంక్, ఐషర్ మోటార్స్, విప్రో షేర్లు రాణించాయి. కోల్ ఇండియా, బజాజ్ ఆటో, యాక్సిస్ బ్యాంక్, కొటక్ మహీంద్రా బ్యాంక్, హీరో మోటార్స్ షేర్లు ఒత్తిడికి గురయ్యాయి. ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సూచీ 3.8శాతం, లోహ సూచీ 2.5శాతం మేర పెరిగాయి.

# వారీ ఎనర్జీస్ కాసుల వర్షం.. లిస్టింగ్ తర్వాత 10% డౌన్



**ముంబయి:** సోలార్ ప్యానెళ్ల తయారీ సంస్థ వారీ ఎనర్జీస్ మదుపర్లకు కాసుల వర్షం కురిపించింది. స్టాక్ ఎక్స్ఛేంజీల్లో సోమవారం దాదాపు 70 శాతం ప్రీమియంతో లిస్టయ్యింది. లిస్టింగ్ అనంతరం లాభాల స్వీకరణతో దాదాపు 10 శాతం క్షీణించినప్పటికీ.. ఐపీఓలో షేర్లు అలాట్ అయిన వారికి మాత్రం దీపావళి ముందు బంపర్ గిఫ్ట్ ఇచ్చినట్లయ్యింది. వారీ ఎనర్జీస్ ఇష్యూ ధర రూ.1503 కాగా.. బీఎస్ఈలో 69.66 శాతం ప్రీమియంతో రూ.2,550 వద్ద నమోదైంది. తర్వాత 72.98 శాతం లాభంతో రూ.2,600 వరకు దూసుకెళ్లింది. అటు ఎన్ఎస్ఈలోనూ 66.33 శాతం లాభంతో రూ.2500 వద్ద నమోదైంది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ 67,866 కోట్లకు చేరింది. తర్వాత మదుపరులు లాభాల స్వీకరణకు దిగడంతో షేరు ధర 10 శాతం మేర కుంగింది. 12.20 నిమిషాలకు రూ. 2417.45 వద్ద ట్రేడవుతోంది. రూ.4321.44 కోట్ల ఐపీఓలో భాగంగా సంస్థాగత మదుపర్ల నుంచి మంచి స్పందన రావడంతో వారీ ఎనర్జీస్ 76.34 రెట్లు సబ్‌స్క్రిప్షన్ అందుకున్న సంగతి తెలిసిందే.

## ఓ చిన్న సంస్థను తొక్కేసిన ఫలితంగా
# గూగుల్‌కు భారీ ఫైన్..



**ముంబయి:** సెర్చింజన్ దిగ్గజం గూగుల్ భారీ ఫైన్ చెల్లించాల్సి వస్తోంది. ఓ చిన్న వెబ్‌సైట్‌ను తన స్వార్థం కోసం తొక్కేసినట్లు అది ఆరోపణలు ఎదుర్కొంటోంది. యూకేకు చెందిన షివన్, ఆడమ్ రిఫ్ అనే జంట 2006లో ధరలను పోల్చే వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. దీనికి ‘ఫౌండెమ్’ అని పేరు పెట్టారు. వీరు ఆ వెబ్‌సైట్‌ను లైవ్‌లోకి తెచ్చాక.. గూగుల్ సెర్చ్‌లో నాటకీయంగా దాని విజిబులిటీ పడి పోవడం మొదలైంది. జనం ‘ప్రైస్ కంపా రిజన్’, ‘షాపింగ్’ వంటి కీవర్డ్స్ వాడినా ఈ వెబ్‌సైట్ కనిపించడం లేదు. గూగుల్‌కు చెందిన ఆటోమేటెడ్ స్పామ్ ఫిల్టర్స్ విధించిన పెనాల్టీ కారణంగా తమ వెబ్‌సైట్ పడిపో తోందని షివన్, ఆడమ్ రిఫ్ గుర్తించారు. దీనికితోడు గూగుల్‌లో దాని ర్యాంక్ కూడా గణనీయంగా పడిపోయింది. ఇతర సెర్చ్ ఇంజిన్లలో సాధారణంగానే ఉన్నట్లు గమనించారు. ఫలితంగా ‘ఫౌండెమ్’ ఆదాయం కూడా పడిపోయింది. సాంకేతిక కారణాల వల్లే తమ పేజీ సెర్చ్‌లో కనిపించలేదని గుర్తించి.. గూగుల్ ఈవిషయాన్ని ప్రస్తావించారు. దాదాపు రెండేళ్లైనా అది పెనాల్టీని తొలగించలేదు. దీంతో ఆ జంట చేసేది లేక ఐరోపా కమిషన్‌ను ఆశ్రయించింది. అధికారులు సుదీర్ఘకాలంపాటు దర్యాప్తు చేసి.. గూగుల్ తన షాపింగ్ సర్వీస్‌ను ప్రమోట్ చేసుకోవడానికి.. ‘ఫౌండెమ్’ వంటి సంస్థలతో అన్యాయంగా వ్యవహరిస్తున్నట్లు గుర్తించారు. మార్కెట్ ఆధిపత్యాన్ని దుర్వినియోగం చేసిందని 2017లో తీర్పును వెలువరించింది. 2.4 బిలియన్ పౌండ్ల (సుమారు రూ.26 వేల కోట్లు) ఫైన్‌ను వేసింది. దీనిపై ఆ సెర్చింజన్ అప్పీల్‌కు వెళ్లింది. ఏడేళ్లపాటు న్యాయ పోరాటం జరిగింది. చివరికి ‘ది యూరోపియన్ కోర్ట్ ఆఫ్ జస్టిస్’ కింది న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పు ను సమర్థించింది. గూగుల్ అప్పీల్‌ను తిరస్కరించింది. దీనిపై షివన్, ఆడమ్ రిఫ్ జంట స్పందిస్తూ తీర్పు చాలా ఆలస్యమైందని అభిప్రాయపడింది. వీరి ఫౌండెమ్‌ను 2016లో మూసివేయాల్సి వచ్చినా.. సివిల్ డామేజ్ క్లెయిమ్‌లపై కేసు 2026లో విచారణకు రానున్నట్లు తెలిపారు. ఇక గూగుల్ ప్రతినిధి జాతీయ ఛానల్‌తో మాట్లాడుతూ ఐరోపా కమిషన్‌కు నిర్ణయాలకు తాము 2017లో చేసిన మార్పులను కొనసాగిస్తున్నా మన్నారు. 800 షాపింగ్ కంపా రిజన్ సర్వీసులకు కోట్ల కొద్దీ క్లిక్‌లు వచ్చాయని తెలిపారు.

## భారతీ ఎయిర్‌టెల్ లాభంలో 168 శాతం వృద్ధి



ముంబయి: ప్రముఖ టెలికాం సంస్థ భారతీ ఎయిర్‌టెల్ త్రైమాసిక ఫలితాల్లో అదరగొట్టింది. సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో రూ.3593 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.1341 కోట్ల నికర లాభంతో పోలిస్తే దాదాపు 168 శాతం పెరగడం గమనార్హం. జులైలో చేపట్టిన టెలికాం టారిఫ్‌ల సవరణ ఎయిర్‌టెల్‌కు బాగా కలిసొచ్చింది. గత త్రైమాసికంతో (రూ.4159 కోట్లు) పోలిస్తే లాభం 13.6 శాతం తగ్గడం గమనార్హం. సమీక్షా త్రైమాసికంలో కార్యకలాపాల ద్వారా వచ్చే ఆదాయం సైతం 12 శాతం వృద్ధితో రూ. 37,044 కోట్ల నుంచి రూ. 41,473 కోట్లకు పెరిగినట్లు కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. ఇతర ఆదాయం రూ.254 కోట్లు వచ్చినట్లు ఎయిర్ టెల్ పేర్కొంది. ఒక్కో యూజర్ నుంచి వచ్చే సగటు ఆదాయం (ARPU) రూ.203 నుంచి రూ.233కి పెరగడం గమనార్హం. ఎయిర్‌టెల్ యూజర్ల నెలకు సగటున 23.9 జీబీ డేటాను వాడుతున్నట్లు ఎయిర్‌టెల్ పేర్కొంది.



# అక్కినేని అవార్డుతో.. ఇన్నాళ్లకు ఇంట గెలిచా

**తెలుగువారి గుండెల్లో ఎప్పటికీ చెరిగిపోని ముద్ర వేసిన సినీ దిగ్గజం అక్కినేని నాగేశ్వరరావు. సోమవారం ఆయన శతజయంతి ఉత్సవాలను హైదరాబాద్‌లో అన్నపూర్ణ స్టూడియోలో అట్టహాసంగా నిర్వహించారు. ఈసందర్భంగా మెగాస్టార్ చిరంజీవికి ప్రతిష్ఠాత్మక 'ఏఎన్ఆర్ జాతీయ అవార్డు' ను బిగ్‌బీ అమితాబ్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా బావోద్వేగానికి గురైన మెగాస్టార్ పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.**

**విశ్వంభర, హైదరాబాద్‌:**

నాడు లెజెండరీ అవార్డును క్యాప్సుల్ బాక్సులో వేశా.. అక్కినేని అవార్డుతో ఇన్నాళ్లకు ఇంట గెలిచానని మెగాస్టార్ చిరంజీవి అన్నారు. 'ఏఎన్ఆర్ అవార్డు' అవార్డు ప్రదానోత్సవ వేడుక సోమవారం అన్నపూర్ణ స్టూడియోలో ఘనంగా జరిగింది. అన్నపూర్ణ స్టూడియోస్‌లో సోమవారం మెగాస్టార్ చిరంజీవికి అక్కినేని జాతీయ పురస్కారాన్ని ప్రదానం చేశారు. బాలీవుడ్ బిగ్‌బి అమితాబ్ బచ్చన్ చేతుల మీదుగా చిరు ఈ అవార్డును అందుకున్నారు.

**ఏఎన్ ఆర్ అవార్డు రావడంతో నా సినీ జీవితానికి పరిపూర్ణత**

అక్కినేని అవార్డు తీసుకున్న చిరంజీవి భావోద్వేగానికి గురయ్యారు. ఈ క్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఎవరైనా ఇంట గెలిచి రచ్చ గెలవాలంటారు కానీ నేను నా సినీ ప్రస్థానంలో మొదట బయటే గెలిచానని ఇప్పుడు ఇంట గెలిచానని అన్నారు. కొంత కాలం క్రితమే ఇంట గెలిచే అవకాశం సినీ వజ్రోత్సవాల్లో వచ్చింది. నాడు నాకు లెజెండరీ అవార్డు ప్రదానంతో ధన్యుడిగా అయినట్లు భావించా.. కానీ దాన్ని కొందరు హర్షించలేదు. దాంతో ఆ అవార్డు తీసుకోవడం సముచితం అనిపించలేదు. ఆరోజు లెజెండరీ అవార్డును క్యాప్సుల్ బాక్సులో వేశా. ఇప్పుడు పద్మవిభూషణ్ సహా ఎన్ని అవార్డులు వచ్చినా ఆ అసంతృప్తి ఇంకా మిగిలే ఉండేదని ఇప్పుడు ఈ ఏఎన్ ఆర్ అవార్డు రావడంతో నా సినీ జీవితానికి పరిపూర్ణత చేకూరినట్లైందని అన్నారు.

**అమితాబచ్చన్ నుంచి ఆ మాటలు రావడం ఎంతో ఆనందం.**

బిగ్ స్టార్ ఆఫ్ ఇండియా అమితాబచ్చన్ చేతుల మీదుగా ఈ అవార్డుని తీసుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. పద్మభూషణ్ అవార్డు వచ్చినప్పుడు జరిగిన సన్మాన కార్యక్రమంలో అమితాబచ్చన్ 'చిరంజీవి కింగ్ ఆఫ్ ఇండియన్' సినిమా అని చెప్పడం నేను ఎప్పటికీ మర్చిపోలేను. నిజానికి ఆ మాట విని షేక్ అయ్యాను. ఏం చెప్పాలో అర్థం కాలేదు. ఐయామ్ ఓవర్ వెల్మ్ డ్. ఆ రోజు నేను ఆయనకి థాంక్స్ చెప్పానో లేదో కూడా తెలీదు. ఒక డిఫరెంట్ ప్లేన్ లో ఉన్నాను. బాద్షా ఆఫ్ ఇండియన్ సినిమా అమితాబచ్చన్ నుంచి ఆ మాటలు రావడం ఎంతో ఆనందం. నేను హిందీలో ప్రతిభంద్ సినిమా చేసినప్పుడు కేవలం అమితాబచ్చన్ కు మొదటిగా చూపించాను. ఆయన కోసం స్పెషల్ గా ప్రొజెక్షన్ వేసాం. ఇద్దరమే ఆ సినిమా చూశాం. సినిమా అంత చూసి ఆయన 'వెరీ పవర్ఫుల్ పెర్ఫార్మెన్స్. వెరీ పర్పస్ ఫుల్ ఫిలిం. వెరీ గుడ్ జాబ్. ఆల్ ద వెరీ బెస్ట్' అని చెప్పారు. ఆ మాటలు నాకు ఎంతో ఎనర్జీ ఇచ్చాయి. మా ఇంట్లో జరిగే ప్రతి శుభకార్యానికి ఆయన బ్లెస్సింగ్స్ ఉంటాయి. అమితాబచ్చన్ సైరా సినిమాలో ఒక కామియో రోల్ చేశారు. ఆయనకి ఎలా అడగాలో తెలియక ఒక చిన్న మెసేజ్ పెట్టాను. ఆ మెసేజ్ చూసి వెంటనే ఆ క్యారెక్టర్ చేస్తానని చెప్పారు. సినిమా అంతా పూర్తయిన తర్వాత ఫార్మాలిటీస్ గురించి అడిగాను. 'నీపై ఉన్న ప్రేమతో చేశాను. యు ఆర్ మై ఫ్రెండ్. ఫార్మాలిటీస్ గురించి మాట్లాడొద్దు' అని చెప్పారు. క్షణం మర్చిపోలేను. ఆయన నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను అన్నారు.

**నా విషయంలో రచ్చ గెలిచి ఇప్పుడు ఇంట గెలిచాను**

తెలుగులో ఇంట గెలిచి రచ్చ గెలవాలి అని ఓ నానుడి ఉంది. నా విషయంలో రచ్చ గెలిచి ఇప్పుడు ఇంట గెలిచాను ఏమో అనిపిస్తోంది. నటుడిగా నేను ఎదుగుతున్న సమయంలో బయట ప్రేక్షకులు, సన్నిహితుల నుంచి ప్రశంసలు వచ్చేవి. అయితే ఇంటికి వెళ్లినప్పుడు మా నాన్న సినిమాలు చూసి పొగుడుతారేమో అని అనుకునేవాణ్ని. మా నాన్నకు నటన అంటే చాలా ఇష్టం. అలాంటి మా నాన్న నన్ను ఎందుకు పొగడరు అనిపించేది. ఓ రోజు ఇంటికి వెళ్లినప్పుడు నా కవర్ పేజీలతో కొన్ని పుస్తకాలు చూస్తున్నారు. నేను వెళ్లేసరికి తీసి పక్కన పడేశారు. ఫొటోలు బాగున్నాయిరా అని ఓ మాట అంటారేమో అని అనుకున్నాను. కానీ ఆయన అలా అనలేదు. లోపలకు అమ్మ దగ్గరకు వెళ్లి.. 'ఏంటమ్మా నాన్న ఎప్పుడూ నా గురించి ఓ మాట అనరు, బాగుందని కూడా చెప్పరు' అని అడిగాను. బయట రచ్చ ఎంత గెలిచినా సరే.. ఇంట గెలవడం లేదు అనిపిస్తోంది అని అన్నాను. దానికి అమ్మ 'లేదురా నాన్న చాలా పొగుడుతారు. ఏం చేశాడు నా కొడుకు, అదరగొట్టేశాడు' అని అంటుంటారు అని చెప్పింది. మరి నా దగ్గర ఆ మాటలు అనొచ్చు కదా అని అమ్మను అంటే 'బిడ్డల్ని తల్లిదండ్రుల్ని పొగడకూడదు. అది వారికి ఆయుక్షీణం'' అని అమ్మ చెప్పింది. సినిమా పరిశ్రమలో నేను తొలుత రచ్చ గెలిచాను. నా ఇల్లు అనుకునే పరిశ్రమలో నాకు ఆ అవకాశం టాలీవుడ్ వజ్రోత్సవాల సమయంలో వచ్చింది. లెజండరీ పురస్కారం ప్రదానం చేశారు.







ఆ సమయంలో చాలా ఆనందమేసి ధన్యుణ్ని అనుకున్నా. కానీ ఆ రోజు కొన్ని ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో కొందరు హర్షించని ఆ సమయంలో ఆ పురస్కారాన్ని తీసుకోవడం సముచితం అనిపించలేదు. అందుకే ఆ రోజు ఆ అవార్డుని ఓ క్యాప్సుల్ బాక్స్‌లో పడేసి నాకు అర్హత ఎప్పుడు వస్తుందో అప్పుడు తీసుకుంటాను అని చెప్పాను. అంటే ఆ రోజు నేను ఇంట గెలవలేదు. ఈ రోజు ది గ్రేట్ ఏఎన్నార్ అవార్డును ది గ్రేట్ అమితాబ్ బచ్చన్ చేతుల మీదగా అందుకున్న రోజున ఇప్పుడు అనిపిస్తోంది.. 'నేను ఇంట గెలిచాను.. రచ్చ గెలిచాను' అని. అందుకే ఈ పురస్కారం గురించి చెప్పడానికి నాగార్జున, వెంకట్ ఇంటికి వచ్చినప్పుడు నేను చాలా ఆనందించాను. నాకు పద్మభూషణ్, పద్మ విభూషణ్, గిన్నిస్ బుక్‌లో స్థానం.. ఇలాంటివి ఎన్ని వచ్చినా ఈ అవార్డు విషయంలో నా భావోద్వేగం వేరుగా ఉంది. నా వాళ్లు నన్ను గుర్తించి నాకు అవార్డు ఇస్తుండటం నాకు గొప్ప విషయంగా అనిపించింది. అందుకే నాగార్జునతో ఇది నాకు అన్ని పురస్కారాలకు మించిన ప్రత్యేకమైన అవార్డు అని చెప్పా. ఇదే మాట స్టేజీ మీద చెప్పాలి అనుకున్నాను. ఇప్పుడు చెప్పాను.

**అమ్మ ఏ ఎన్ ఆర్ కి సీనియర్ మోస్ట్ ఫ్యాన్.**

ఈ వేడుకలో అమ్మని ముందు సీటు లో కూర్చోబెట్టడానికి ప్రధాన కారణం.. అమ్మ నాగేశ్వరరావుకి సీనియర్ మోస్ట్ ఫ్యాన్. నేను కడుపులో ఉన్నప్పుడు నాగేశ్వరావు గారి సినిమా విడుదలైంది. ఆ సినిమా ఎలాగైనా చూడాలని నాన్న గారితో చెప్పింది. థియేటర్ కి వెళ్లడానికి ఒక జట్కా బండిని ఏర్పాటు చేశారు. జట్కా బండిలో వెళ్తున్నప్పుడు అది కాస్త దారి తప్పి కాస్త పక్కకు దొర్లింది. నాన్న చాలా కంగారు పడ్డారు. ఇంటికి వెళ్లి పోదాం పద అని చెప్పారు. అయినప్పటికీ అమ్మ సినిమాకి వెళ్దామని పట్టుబట్టింది. ఆ సినిమా అమ్మ చూసింది. తర్వాత ఒకటి రెండు నెలల్లో నేను బయటికి వచ్చాను. అమ్మకి నాగేశ్వరరావు గారి సినిమాలు అంటే అంత ఇష్టం. అక్కినేని నాగేశ్వరరావు సినిమాల్లో డాన్స్ లు అంటే నాకు చాలా ఇష్టం. నడవవే వయ్యారి.. అయ్యయ్యో బ్రహ్మయ్య ..దసరా బుల్లోడు సాంగ్స్.. ఇవన్నీ కూడా నాకు చాలా ఇష్టం. ఆ పాటలు వచ్చినప్పుడు నా పంథాలో డాన్స్ చేసే వాడిని. నాకు డాన్స్ లో ఇన్స్పిరేషన్ నాగేశ్వరరావు. ఆయన డ్యాన్స్ చూస్తూ ముందుకు వెళ్లాను. నాగేశ్వరరావు స్వతహాగా నా డాన్స్ ని మెచ్చుకుంటూ మాట్లాడడం నాకు ఎంతో నాకు ఎన్నో గొప్ప అవార్డులతో సమానం. ఎన్నో సందర్భంలో ఆయన నా గురించి ప్రస్తావించారు.

**ఏఎన్ఆర్ ప్రతిష్టాత్మకమైన అవార్డు నాకు దక్కడం నా పూర్వజన్మ సుకృతం.**

దేవానంద్, లతా మంగేష్కర్, అమితాబచ్చన్ ఇలా ఎంతో గొప్ప గొప్ప వ్యక్తులకి వచ్చిన ఈ ఏఎన్ఆర్ ప్రతిష్టాత్మకమైన అవార్డు నాకు దక్కడం నా పూర్వజన్మ సుకృతం. ఈ అవార్డు రావడం నా సినీ జీవితానికి ఒక పరిపూర్ణత ఏర్పడిందని భావిస్తున్నాను. నాగేశ్వరరావు గారి ఆశీస్సులు మనందరిపై నిండుగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ. ఈ క్షణాన్ని జీవితాంతం నా మనసులో పదిలపరుచుకుంటాను. ఈ అవకాశం ఇచ్చిన నాగార్జున కి ధన్యవాదాలు. ఈ సందర్భంగా టి సుబ్బిరామిరెడ్డి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నాను. జైహింద్' అన్నారు

**ఇండియన్ సినిమాకి నాగేశ్వరరావు చేసిన సేవలు అనితర సాధ్యం.**

బిగ్ బి అంతా బచ్చన్ మాట్లాడుతూ.. అక్కినేని నాగేశ్వరరావు ఫౌండేషన్, నాగార్జున, అక్కినేని ఫ్యామిలీ అందరికీ నా కృతజ్ఞతలు. ఇండియన్ సినిమాకి నాగేశ్వరరావు చేసిన సేవలు అనితర సాధ్యం. డియన్ సినిమాకి నాగేశ్వరరావు గారి కాంట్రిబ్యూషన్ ని ఎవరు మ్యాచ్ చేయలేరు. నాగేశ్వరరావు లెగిసిని కంటిన్యూ చేస్తున్న నాగార్జునకి నా అభినందనలు. నేను చిరంజీవి సినిమాలో నటించాను. నాగ్ అశ్విన్ సినిమాలో నటించాను. నేను కూడా తెలుగు సినిమా ఇండస్ట్రీలో పార్ట్ అని చెప్పుకోవడం చాలా గర్వంగా ఉంది. చిరంజీవి గారి ప్రేమ అభిమానం ఆప్యాయతకి ధన్యవాదాలు. ఇకపై నన్ను తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ మెంబర్ గా తీసుకుంటారని కోరుతున్నాను. నాగ్ అశ్విన్ నెక్స్ట్ టైం తన ఫిలిమ్ లో తీసుకోవాలని కోరుతున్నాను(నవ్వుతూ) అందరికీ థాంక్యూ సో మచ్ 'అన్నారు

**ఏయన్నార్.. ఈ మూడు అక్షరాలే నాకు ప్రపంచం.**

కింగ్ అక్కినేని నాగార్జున మాట్లాడుతూ.. ఏయన్నార్ ఈ మూడు అక్షరాలే నాకు ప్రపంచం. నాకే కాదు మా కుటుంబం, స్నేహితులు, అభిమానులు అందరికీ. మా నాన్న గారు హ్యూమానిటీని నమ్మారు. మనుషుల్ని నమ్మారు. అన్నిటికంటే ముఖ్యంగా సినిమాని బిలీవ్ చేశారు. అభిమానులు, ప్రేక్షకులు మనసులో చిరస్థాయిగా ఒక లెజెండ్ గా నిలిచారు. భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిల్చే అలాంటి గొప్ప వ్యక్తులని గౌరవించడం ఏయన్నార్ అవార్డు ముఖ్య ఉద్దేశం. ఈరోజు అలాంటి గొప్ప వ్యక్తులు ఇద్దరు, ఇండియన్ సినిమా ఏ బి సి.. అమితాబచ్చన్ జి, మెగాస్టార్ చిరంజీవి గారిని ఆహ్వానిస్తున్నాను. ఈ ఏడాది నా డియర్ ఫ్రెండ్, పద్మ విభూషణ్ మెగాస్టార్ చిరంజీవికి అవార్డు ఇవ్వడం ఎంతో ప్రత్యేకం. ఈ అవార్డుని నేను ఎంతగానో ఆరాధించే పద్మ విభూషణ్ అమితాబచ్చన్ ప్రజెంట్ చేయడం ఇంకా స్పెషల్. కొన్నేళ్ల క్రితం అమితాబచ్చన్ గారు ఏఎన్నార్ అవార్డుని అందుకోవడం అవార్డు ప్రతిష్టని మరింతగా పెంచింది. ఈరోజు చిరంజీవికి అవార్డు ప్రధానం చేయడానికి అమితాబచ్చన్ రావడం మాకు ఎంతో ఆనందంగా ఉంది. ఏఎన్ఆర్ శతజయంతి సందర్భంగా ఇది మాకు ఎంతో ప్రత్యేకం. రీసెంట్ గా కల్కి సినిమా చూశాను. అమితాబచ్చన్ గారిని అశ్వద్ధామ చూసినప్పుడు మా ఒరిజినల్ మాస్ హీరో ఈజ్ బ్యాక్ అనిపించింది. ఇదే విషయం ఆయనకి కాల్ చేసి చెప్పాను. ఆయన ఎంతో ఆనందంగా నవ్వారు. అది నాకు చాలా సంతోషాన్ని ఇచ్చింది. అమితాబచ్చన్ గారి స్క్రీన్ ప్రజెంట్, మేనరిజం, ఇంపాక్ట్ సింప్లీ అండ్ అన్ టచబుల్. అమితాబ్ బచ్చన్ గారు ఎన్నో సామాజిక కార్యక్రమాలకి బ్రాండ్ అంబాసిడర్ గా ఉంటున్నారు. ఆయన సినిమాలు గురించి మీ అందరికీ తెలుసు ఆయన హిట్లు సూపర్ హిట్లు బ్రేక్ చేసిన రికార్డులు అంతా ఇంతా కాదు. ఈమధ్య గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ లో కూడా ఎక్కారు. నేను సినిమాల్లోకి వద్దాం అనుకున్నప్పుడు.. నాన్నగారు ఒకసారి అన్నపూర్ణ స్టూడియోస్ లో చిరంజీవి షూటింగ్ జరుగుతుంటే ఆయన డాన్స్ ని చూడమని నాకు చెప్పారు. అప్పుడు రెయిన్ సాంగ్ జరుగుతుంది. చిరంజీవి డాన్స్, గ్రేస్ చూసి నాకు కొంచెం గుబులు పుట్టింది. ఆయనలాగా డాన్స్ చేయగలనా అనిపించింది. అలా ఆయనతో ఎన్నో జ్ఞాపకాలు ఉన్నాయి. చిరంజీవి స్పెక్టాక్యులర్ సినిమా జర్నీ మనందరికీ తెలుసు. అలాగే ఆయన వెలకట్టలేని సామాజిక సేవ కార్యక్రమాలు ఎన్నో చేశారు. చిరంజీవి బ్లడ్ బ్యాంక్ ఎంతోమంది ప్రాణాలను కాపాడింది. కోవిడ్ టైంలో ఫిలిం వర్కర్స్ అందరికీ ఒక దారి చూపించారు. అమితాబ్ బచ్చన్ గారు చిరంజీవి గారిని కింగ్ ఆఫ్ ఇండియన్ సినిమా అని పిలిచారు.అది ముమ్మాటికి నిజం. ఇలాంటి ఈ వేదికపై ఉండడం నాకు చాలా ఆనందంగా ఉంది అమితాబచ్చన్ గారు ఏఎన్ఆర్ అవార్డు ని చిరంజీవి గారిని చిరంజీవి గారికి ప్రజెంట్ చేయడం మా అందరికీ ఎంతో సంతోషం. కీరవాణి గారు మా ఫాదర్ జర్నీ ని వారి మ్యూజిక్ తో చాలా బ్యూటిఫుల్ గా చూపించారు. థాంక్యూ కీరవాణి గారు. ఈ వేడుకకి విచ్చేసిన స్నేహితులు, సినీ పరిశ్రమ ప్రముఖులు, మీడియా మిత్రులు అందరికీ స్వాగతం. అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. థాంక్యూ ఆల్. ఏఎన్ఆర్ లీవ్స్ ఆన్' అన్నారు

**ఆయన నటన హిమాలయాల శిఖరాలకు వెళ్లింది.**

టి . సుబ్బిరామిరెడ్డి మాట్లాడుతూ. నాగార్జున ఎక్స్ ట్రార్డినరీ పర్సన్. ఎంత అద్భుతంగా మాట్లాడారు. ఎంత గొప్పగా ఈ అవార్డు వేడుకని ఏర్పాటు చేశారు. నాగార్జునని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. దాదాపు 60 సంవత్సరాల నుంచి నాకు, అక్కినేని నాగేశ్వరరావు గారికి అనుబంధం ఉంది. ఆయన నటన హిమాలయాల శిఖరాలకు వెళ్లింది. ఆయన జీవితం అద్భుతం అమోఘం. ఆయన ఎప్పుడూ నా గుండెల్లో జీవిస్తూనే ఉంటారు. నాగేశ్వరావుకి దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు వచ్చినప్పుడు నాతో ఒక మాట చెప్పారు. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు ఎంత ప్రతిష్టాత్మకంగా ఉందో ఏఎన్ఆర్ అవార్డు కూడా అంత ప్రతిష్టాత్మకంగా ఉండాలని నన్ను చైర్మన్ గా చేశారు నేను రెండుసార్లు చైర్మన్ గా ఉన్నాను . ఈ అవార్డు కమిటీ చైర్మన్ ఉండడం నాకు ఎంతో సంతోషం, గొప్ప గౌరవం. ఎంతో మంది లెజెండ్స్ కి అవార్డ్స్ ఇస్తూ వచ్చాం. ఈసారి మరో గొప్ప లెజెండ్ చిరంజీవి గారికి అవార్డు ఇవ్వడం మాకెంతో గౌరవంగా ఉంది. చిరంజీవి అందరి గుండెల్లో చిరంజీవిగా ఎప్పుడు వెలుగుతూనే ఉంటారు. చిరంజీవి బ్లడ్ బ్యాంక్ ద్వారా ఎంతో మంది ప్రాణాలు కాపాడారు. చరిత్రలో ఎవరు ఇలా చేయలేదు. ఎంతోమంది ఎంతోమందికి స్ఫూర్తిని ఇచ్చారు అలాంటి చిరంజీవి గారికి ఏఎన్నార్ అవార్డు రావడం చాలా ఆనందంగా ఉంది. థాంక్యూ టు ఆల్' అన్నారు.

ఈ అవార్డు వేడుకలో ఆస్కార్ విజేత ఎంఎం కీరవాణి ని ప్రత్యేకంగా సన్మానించారు. హీరోలు వెంకటేష్, రామ్ చరణ్, నాని, సిద్దు జొన్నలగడ్డ, సుధీర్ బాబు, దర్శకులు రాఘవేంద్రరావు, త్రివిక్రమ్ శ్రీనివాస్, బోయపాటి శ్రీను, నాగ్ అశ్విన్, చందూమొండేటి, నిర్మాతలు అల్లు అరవింద్, అశ్వినీదత్, శ్యాం ప్రసాద్ రెడ్డి, టీజీ విశ్వప్రసాద్, సునీల్ నారంగ్, స్వప్న దత్, హీరోయిన్స్ రమ్యకృష్ణ, శ్రీలీల, నటులు ప్రకాష్ రాజ్, మురళిమోహన్, అలీ, రాజేంద్రప్రసాద్, రైటర్ విజయేంద్రప్రసాద్, అక్కినేని కుటుంబ సభ్యులతో పాటు అనేక మంది ప్రముఖులు పాల్గొన్నారు.

### ఏఎన్ఆర్ చేసిన కృషి ఈరోజు మనమంతా అనుభవిస్తున్నాం..

మేము మద్రాస్ నుంచి ఇక్కడికి షూటింగ్ కి వచ్చేటప్పుడు ఆయన మమ్మల్ని కలిసి మీరంతా మద్రాస్ నుంచి ఇక్కడికి రావాలని కోరేవారు. సినిమా పరిశ్రమ ఇక్కడికి తరలిరావాలని ఆయన చేసిన ప్రయత్నం ఆయన చేసిన కృషి ఈరోజు మనమంతా అనుభవిస్తున్నాం. నాగేశ్వరావు గారు ఎంతో పెద్ద మనసుతో నాలాంటి వారిని ఎంకరేజ్ చేశారు. ఆయన గొప్ప మనసుకి ఈ సందర్భంగా ఆయనకి నివాళులర్పిస్తున్నాను. ఆయనతో మెకానిక్ అల్లుడు సినిమా చేసే గొప్ప అవకాశం నాకు వచ్చింది. అది నాకు గొప్ప ఎక్స్పీరియన్స్. ఆయన నడిచి వచ్చే ఒక ఎన్సైక్లో పీడియాలా అనిపించేది. ఆయన ఎన్నో ప్రశ్నలకు సమాధానం చెప్పేవారు . ఎన్నో సందేహాలని నివృత్తి చేసేవారు. ఆయన చాలా సరదా మనిషి. చాలా సరదాగా ఉంటారు. అలనాటి ముచ్చట్లు పంచుకుంటారు. ఆయన నాకు ఒక ఫాదర్లీ ఫిగర్ లో ఉండేవారు. వారి కుటుంబ సభ్యులందరికీ తెలుసు నేను ఆయన్ని ఎంతగా ప్రేమిస్తానో తెలుసు. తర్వాత ఆ ప్రేమ నాకు నాగర్జున మీద కలిగింది. నాగార్జున నాకు ఎంతో ఇన్స్పిరేషన్ ఆరోగ్య సూత్రాలు పాటించడంలో ఎక్సర్సైజ్ చేయడంలో ఎప్పుడూ యంగ్ గా ఉండడానికి ఆయన తీసుకునే శ్రద్ధ శక్తులు నాకు ఎంతో స్ఫూర్తినిస్తాయి. వాటిని అలవర్చుకుంటాను ఆచరిస్తుంటాను. నాకు నాగార్జున ఒక స్నేహితుడు, బ్రదరే కాదు.. నాకు ఆరోగ్య సూత్రాలు తెలిపే డాక్టర్ కూడాను. ఆ భగవంతుడు నాకు ఇచ్చినటువంటి అద్భుతమైన స్నేహితుడు నాగార్జున. అఖిల్ నాకు మరో బిడ్డ లాగా పెదనాన్న అని పిలుస్తున్నప్పుడు నాకెంతో ఆనందంగా ఉంటుంది. వాళ్ళ పిల్లలందరూ మా కుటుంబ సభ్యులు అనిపిస్తారు. వాళ్ళ కుటుంబ సభ్యులందరికీ వాళ్ళు చూపించే ప్రేమకు నేను దాసుడిని. నాగ్ లాంటి స్నేహితుడిని నేను జీవితాంతం పదిలంగా దాచుకుంటాను.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com

# వరుస బాంబు బెదిరింపులతో విమానాశ్రయాల్లో భద్రత పెంపు



**ముంబయి:** దేశంలో ఇటీవలే వరుస బాంబు బెదిరింపు ఘటనలు ఆందోళనకలిగిస్తున్నాయి. ముఖ్యంగా విమానాలకు ఇలాంటి బెదిరింపులు కలకలం రేపుతున్నాయి. రెండు వారాల వ్యవధిలోనే ఏకంగా 400కుపైగా విమానాలకు ఇలాంటి బెదిరింపులు వచ్చాయి. ఈ నేపథ్యంలో జాతీయ దర్యాప్తు సంస్థ అప్రమతమైంది.దేశ వ్యాప్తంగా అన్ని విమానాశ్రయాల్లో భద్రతా చర్యలను ముమ్మరం చేసింది.ఇలాంటి ఘటనలను పరిష్కరించడానికి ఎన్ఐఏసైబర్ విభాగం బెదిరింపు కాల్స్‌పై సమగ్ర విశ్లేషణ ప్రారం భించింది. బెదిరింపు కాల్స్‌కు వెనుక ఉన్న ఉద్దేశాలను తెలుసుకునే పనిలో పడింది. ఇతర భద్రతా సంస్థలతో కలిసి బెదిరింపు కాల్స్‌పై విచారణ చేపడుతోంది. ప్రధాన విమానాశ్రయాల్లో బాంబ్ థ్రెట్ అసెస్‌మెంట్ కమిటీ (%దీూాజ%) బృందాన్ని మోహరించింది. బెదిరింపులు, అత్యవసర పరిస్థితుల్లో ప్రతిస్పందించేలా ఈ బృందం శిక్షణ ఇస్తుంది. అంతేకాదు విమానాశ్రయాల్లో భద్రతా మౌలిక సదుపాయాలను మరింత మెరుగు పరుస్తుంది.గత కొన్ని రోజులుగా ఇండిగో, ఎయిర్ ఇండియా సహా వందలాది విమానాలకు బెదిరింపులు వస్తున్న విషయం తెలిసిందే. రోజులో కనీసం వంద విమానాలకు ఇలాంటి బెదిరింపు కాల్స్, మెయిల్స్‌రావడం ఆందోళన కలిగిస్తోంది. ఈ కారణంగా విమానాలు ఆలస్యం కావడానికి తోడు.. ప్రయాణికుల్లో తీవ్ర భయాలు నెలకొంటున్నాయి. అదే సమయంలో విమానయాన సంస్థలు భారీగా నష్టపోవాల్సిన పరిస్థితి.

### బాంబు బెదిరింపులతో కోట్ల మేర నష్టం..!

'విమానంలో బాంబు పెట్టాం' అని దుండగులు, ఆకతాయిలు పంపిస్తున్న హెచ్చరికలతో విమానాశ్రయాల్లో హైరానా నెలకొంటున్నది. ఏ విమానానికి బాంబు బెదిరింపు వచ్చినా కచ్చితంగా బాంబు థ్రెట్ అసెస్‌మెంట్ కమిటీ(బీటీఏసీ) ప్రొటోకాల్, అంతర్జాతీయ మార్గదర్శకాల ప్రకారం తనిఖీల ప్రక్రియను చేపట్టాల్సిందే. దీంతో అనేక విమానాలు ఆలస్యమవుతున్నాయి. అప్పటికే ప్రయాణంలో ఉన్న విమానాలను ఉన్నపళంగా వేర్వేరు విమానాశ్రయాలకు దారి మళ్లించాల్సి వస్తున్నది. ఫలితంగా విమానయాన సంస్థలు నష్టపోతున్నాయి. గత తొమ్మిది రోజుల్లో వచ్చిన బాంబు బెదిరింపులకు విమానయాన సంస్థలు దాదాపుగా 600 కోట్లకుపైగా నష్టపోయి ఉంటాయని గతంలో ఓ విమానయాన సంస్థలో పని చేసిన ఓ అధికారి తెలిపారు. సాధారణంగా ఒక డొమెస్టిక్ విమాన సర్వీసుకు అంతరాయం కలిగితే సగటున రూ.1.5 కోట్లు నష్టం వస్తుందని, అంతర్జాతీయ విమానానికి ఇది దాదాపు రూ.3.5 కోట్ల వరకు ఉండొచ్చనే అంచనాలు ఉన్నాయి.

### తాజ్ హోటల్‌కు బాంబు బెదిరింపులు

విమానాలకు బాంబు బెదిరింపు లతో ఇప్పటికే ఆందోళన నెలకొనగా, తాజాగా హోటళ్లకు కూడా బాంబు బెదిరింపులు రావ డం కలకలం రేపుతున్నది. ఆదివారం తిరుపతి, రాజ్‌కోట్, కోల్‌కతా, లక్నోలోని ప్రముఖ హోటళ్లకు ఈ–మెయిళ్ల ద్వారా బాంబు బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా లక్నోలోని ఓ ఫైవ్ స్టార్ హోటల్‌కు కూడా ఇలాంటి బెదిరింపులే వచ్చాయి. హజ్రత్‌గంజ్ ప్రాంతం లో ఉన్న తాజ్ హోటల్ కు సోమవారం ఉదయం ఈ మెయిల్ ద్వారా బెదిరింపులు వచ్చాయి. గుర్తు తెలియని వ్యక్తులు హోటల్ ఆవరణలో బాంబు పెట్టినట్లు అందులో పేర్కొన్నారు. అప్రమత్తమైన హోటల్ యాజమాన్యం వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. రంగంలోకి దిగిన పోలీసు అధికారులు బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో హోటల్‌ను క్షుణ్ణంగాతనిఖీచేశారు. అయితే,ఈ తనిఖీల్లో ఎలాంటి అనుమానాస్పద వస్తువూ, పేలుడు పదార్థాలూ లభించలేదని తెలిసింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.కోల్‌కతాలోని 10 ప్రముఖ హోటళ్లకు, రాజ్‌కోట్‌లో 10 హోటళ్లకు,లక్నోలో 10ప్రధాన హోటళ్లకు ఆదివారంఈ–మెయిల్ ద్వారాబాంబు బెదిరింపులు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో ఉన్న మూడు హోటళ్లకు శుక్ర, శనివారాల్లో నకిలీ బాంబు బెదిరింపులు వచ్చాయి. హోటళ్లకే కాదు దాదాపు 50 విమానాలకు ఆదివారం బాంబు బెదిరింపులు వచ్చాయి. గడచిన 14 రోజుల్లో 350కిపైగా విమానాలకు నకిలీ బాంబు బెదిరింపులు వచ్చాయి.

# రూ.300లకు అంత పెద్ద చెక్కు అవసరమా..? యోగి ప్రభుత్వంపై కాంగ్రెస్ విమర్శలు





**లక్నో:** ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్ సీఎం ఆదిత్యనాథ్ విద్యార్థులకు రూ.300 చెక్కులు పంపిణీ చేయడంపై కాంగ్రెస్ మండిపడింది. ఉత్తరప్రదేశ్‌లోని సంపూర్ణానంద సంస్కృత విశ్వవిద్యాలయంలో నిర్వహించిన సంస్కృత స్కాలర్‌షిప్ స్కీమ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ రాష్ట్రంలోని సంస్కృత పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల విద్యార్థులకు రూ.300 నుంచి రూ.900 ఉపకార వేతనాలను చెక్కురూపంలో పంపిణీ చేశారు. కాగా రూ.300లను అందజేసేందుకు భారీ చెక్కు నమూనాను వినియోగించిన ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో నెటిజన్లు విమర్శలు వ్యక్తంచేశారు.ఈ విషయంపై ప్రతిపక్షాలు తీవ్రస్థాయిలో మండిపడ్డాయి. ప్రస్తుత పరిస్థితుల్లో రూ.300లతో విద్యార్థులకు ఏం వస్తుందంటూ ప్రశ్నించాయి. కాంగ్రెస్ నేత షమా మహ్మద్ స్పందిస్తూ వాటిని ప్రింటింగ్ చేయడానికి అంతకంటే ఎక్కువ ఖర్చు చేసి ఉండొచ్చని అన్నారు. ఇలాంటి చర్యలు కేవలం భాజపా ప్రభుత్వానికి మాత్రమే సాధ్యమని ఎద్దేవా చేశారు. యోగి ప్రభుత్వం విద్యార్థులను పబ్లిసిటీ కోసం వాడుకుంటుందని విమర్శించారు.

### గురుకులాల తరహాలో సంస్కృత పాఠశాలలు: యోగి ఆదిత్యనాథ్..

కార్యక్రమంలో చెక్కుల పంపిణీ అనంతరం విద్యార్థులనుద్దేశించి ప్రసంగించిన ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ యూపీలో రెసిడెన్షియల్ గురుకులాల తరహా సంస్కృత పాఠశాలలను పునరుద్ధరించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో దాదాపు 1.5 లక్షల మంది విద్యార్థులు సంస్కృతం నేర్చుకుంటున్నారని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో దేశ సంస్కృతిపై మక్కువ పెంచుకుందని అన్నారు.

# అత్యధిక డిజిటల్ అరెస్టులు ఆ మూడు దేశాల నుంచే..!




**దిల్లీ:** 'డిజిటల్ అరెస్టు'ల పేరిట ఆన్‌లైన్‌లో జరుగుతున్న మోసాలను ప్రధాని మోదీ ఏకంగా మన్‌కీబాత్‌లో ప్రస్తావించి.. అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించడంతో అందరి దృష్టి వీటిపై పడింది. ఇటీవల వీటికి సంబంధించిన కీలక సమాచారాన్ని కేంద్ర హోం మంత్రిత్వశాఖ వెల్లడించింది. దేశంలో చోటుచేసుకొంటున్న డిజిటల్ అరెస్టులు, ట్రేడింగ్, రొమాన్స్ స్కామ్‌లు, ఇన్వెస్ట్‌మెంట్ మోసాల్లో దాదాపు 46% మూడు దేశాల నుంచే జరుగుతున్నట్లు గుర్తించారు. వాటిల్లో పొరుగున్న మయన్మార్, లావోస్, కంబోడియా కేంద్రంగా ఈ ముఠాలు రెచ్చిపోతున్నాయని వెల్లడించింది. ఇప్పటివరకు మొత్తంగా బాధితులు దాదాపు రూ.1,776 కోట్లు నష్టపోయారని గణాంకాలు చెబుతున్నాయి. అత్యధికంగా ట్రేడింగ్ స్కామ్‌ల్లో రూ.1,420 కోట్లు, ఇన్వెస్ట్‌మెంట్‌పేరిటమోసాల్లోరూ.222.58 కోట్లు, డిజిటల్ అరెస్టుల్లో రూ.120.3 కోట్లు, డేటింగ్/రొమాన్స్ పేరిట రూ.13.23 కోట్లు పోగొట్టుకొన్నారు. వీటి సంఖ్య ఏటా పెరిగిపోతోందని గణాంకాలు చెబుతున్నాయి. ఆన్‌లైన్ మోసాలపై ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ 30 నాటికే మొత్తం 7.4 లక్షల ఫిర్యాదులు వచ్చాయి. ఇక 2023లో 15.56 లక్షలు, 2022లో 9.66 లక్షలు, 2021లో 4.52 లక్షల ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై ఇండియన్ సైబర్ కోఆర్డినేషన్ సెంటర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాజీవ్‌కుమార్ మాట్లాడుతూ.. "ఈ దేశాల్లో సైబర్ క్రైమ్ బృందాలు సమగ్రమైన మోసపూరిత వ్యూహాలను అమలుచేస్తాయి. వీటికోసం అవి తప్పుడు ఎంప్లాయిమెంట్ అవకాశాలను చూపిస్తూ రిక్రూట్‌మెంట్ చేసుకొంటాయి" అని వివరించారు.

### హైదరాబాద్‌లో 24గంటల పాటు టెకీ డిజిటల్ అరెస్ట్..!

హైదరాబాద్‌కు చెందిన 44 ఏళ్ల టెకీని సైబర్ నేరగాళ్లు బెదిరించి 24 గంటలు డిజిటల్ అరెస్టు చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. శుక్రవారం రాత్రి నుంచి మెసేజ్‌లు వచ్చినా అవి స్పామ్ అని అతడు పట్టించుకోలేదు. శనివారం తెల్లవారుజామున 3 గంటలకు ఓ ప్రముఖ కొరియర్ ఏజెంట్, ముంబయి పోలీసులు ఫోన్లు చేస్తున్నట్లుగా అతడికి ఫోన్లు వచ్చాయి. అతడి ఆధార్ నెంబర్‌కు మనీలాండరింగ్‌తో సంబంధం ఉందని పేర్కొన్నారు. ఖాతాను చెక్ చేసే వరకు వాట్సాప్ వీడియోకాల్‌లో కొనసాగాలని కోరారు. దీంతోపాటు అతడిని ఇంటి నుంచి దూరంగా వచ్చి ఓ లాడ్జిలో ఉండాలని సూచించారు. ఇది సోమవారం ఉదయం బ్యాంకులు తెరిచేవరకు ఉండాలని వారు చెప్పారు. ఆదివారం తెల్లవారుజామున 4 గంటలవరకు ఈ వ్యవహారం కొనసాగింది.హఠాత్తుగా కాల్‌కట్ కావ డంతో.. బాధితుడు సైబర్ పోలీసులను ఆశ్ర యించాడు.దీంతో పోలీసులు అతడినిసురక్షితంగా తిరిగి కుటుంబ సభ్యులకు అప్పజెప్పా రు. అదృష్టవశాత్తూ బ్యాంకులు మూసి ఉండటంతో అతడి ఖాతా నుంచి డబ్బులు పోలేదు.

# గగన్‌యాన్ మిషన్‌ను 2026లో చేపట్టనున్నాం

## ఇస్రో కీలక అప్‌డేట్



**దిల్లీ:** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో చైర్మన్ సోమనాథ్ కీలక ప్రకటన చేశారు. అంతరిక్షానికి మినిషిని పంపించే లక్ష్యంగా నిర్దేశించుకున్న మొట్టమొదటి మానవ సహిత మిషన్ 'గగన్‌యాన్' మిషన్ కు సంబంధించి కీలక అప్‌డేట్ ఇచ్చారు. ముందుగా అనుకున్నట్లు 2025 లో కాకుండా.. ఈ మిషన్‌ను 2026లో చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఆల్ ఇండియా రేడియోలో సర్దార్ పటేల్ మెమోరియల్ లెక్చర్ సందర్భంగా సోమనాథ్‌ఈ కొత్తషెడ్యూల్‌ను వెల్లడించారు.చంద్రయాన్–3,మిషన్ ఆదిత్య ప్రయోగాలను విజయవంతంగా నిర్వహించి సరికొత్త చరిత్ర సృష్టించిన ఇస్రో ఆ ఊపుతో.. తొలిసారిగా మానవులను అంతరిక్షంలోకి పంపే గనన్‌యాన్ యాత్రను చేపట్టేందుకు సిద్ధమైన విషయం తెలిసిందే. నలుగురు వ్యోమగాములను అంతరిక్షంలోకి మూడు రోజుల పాటు పంపి, సురక్షితంగా వారిని భూమిపైకి తేవడమే ఈమిషన్ లక్ష్యం.ఆగస్టులో చంద్రయాన్–3 విజయవంతం తర్వాత తదుపరి మిషన్ అయిన గగన్‌యాన్ కోసం సిబ్బంది రేయింబవళ్లు చేసిన కృషితో ఈ మిషన్ సిద్ధమవుతున్నట్లు ఇస్రో చీఫ్ ఇటీవలే వెల్లడించారు.గగన్‌యాన్ మిషన్‌లోఇస్రో వ్యోమగాములనుఅంతరిక్షంలోకి పంప నున్నది. ముగ్గురు వ్యోమగాములను దాదాపు 400 కిలోమీటర్ల ఎత్తయిన కక్ష్యలోకి చేర్చి.. తిరిగి వారిని భూమిపైకి తీసుకురావాలని నిర్ణయించింది. ఈ ప్రయోగం మూడు రోజులపాటు జరుగనున్నది. వ్యోమగాములు తిరుగు ప్రయాణంలో సముద్రంపై సురక్షితంగా దిగాల్సి ఉంటుంది. వాస్తవానికి2022లోనే ప్రాజెక్టు చేపట్టాల్సి ఉండగా.కరోనా కారణంగా వాయితా పడుతూ వచ్చింది. ఇస్రో చేపట్టిన ఈ మిషన్ విజయవంతమైతే అమెరికా, చైనా, సోవియట్ యూనియన్ తర్వాత ఈ ఘనత సాధించిన నాలుగో దేశంగా భారత్ అవతరించనున్నది.మరోవైపు రానున్న సంవత్సరాల్లో భారత్ చేపట్టనున్న అంతరిక్ష యాత్రల వివరాలను కూడా సోమనాథ్ వెల్లడించారు. శాంపిల్ రిటర్న్ మిషన్ చంద్రయాన్–4 2028లో ప్రారంభమయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఇక భారత్–అమెరికా సంయుక్తంగా చేపట్ట దలచిన నిసార్ మిషన్‌పై కూడా సోమనాథ్ కీలక అప్‌డేట్ ఇచ్చారు. ఈ మిషన్‌ను వచ్చే ఏడాది అంటే 2025లోనే ప్రారంభించే అవకాశం ఉందని తెలిపారు. జపాన్ అంతరిక్ష పరిశోధన సంస్థ జగ్జాతో చంద్రయాన్–5 మిషన్ ప్రయోగం చేపట్టనున్నామని, ఇది మూన్–ల్యాండింగ్ మిషన్ అని వివరించారు. ఈ మిషన్ అసలు పేరు లుపెక్స్ లేదా 'లునార్ పోలార్ ఎక్స్‌ప్లోరేషన్' అని చెప్పారు. అయితే ఈ ప్రయోగాన్ని ఎప్పుడు చేపడతారన్న సమయాన్ని ఆయన వెల్లడించలేదు. అయితే ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం 2025లో ఈ ప్రయోగం చేపట్టాల్సి ఉంటుంది. కానీ ఇప్పుడు ఆ ప్రాజెక్టుని చంద్రయాన్–5గా సోమనాథ్ పేర్కొన్నారు కాబట్టి చంద్రయాన్–4 పూర్తయిన తర్వాత 2028లో చేపట్టే సూచనలు కనిపిస్తున్నాయి.

# విజయవంతంగా ఐరన్‌మ్యాన్ ఛాలెంజ్ పూర్తి.. బీజేపీ ఎంపీని మెచ్చుకున్న ప్రధాని మోదీ




**న్యూదిల్లీ:** బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య ఐరన్‌మ్యాన్ ఛాలెంజ్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. ఐరన్‌మ్యాన్ 70.3 ఛాలెంజ్‌లో ట్రయథ్లాన్ ఉంటుంది. గోవాలో ఈ కాంపిటీషన్ జరిగింది. దీంట్లో 1.9 కిలోమీటర్ల ఈత, 90 కిలోమీటర్ల సైక్లింగ్, 21.1 కిలోమీటర్ల పరుగు ఉంటుంది. ఐరన్‌మ్యాన్ ఛాలెంజ్‌లో పాల్గొన్న వాళ్లు మొత్తం 113 కిలోమీటర్లు అంటే 70.3 మైళ్లు ప్రయాణం చేయాల్సి ఉంటుంది. ట్రయథ్లాన్ ఛాలెంజ్‌ను విజయవంతంగా పూర్తి చేసిన తొలి పార్లమెంటేరియన్‌గా తేజస్వి సూర్య రికార్డు సృష్టించారు.ఎంపీ తేజస్వి ఫీట్ పట్ల ప్రధాని మోదీ రియాక్ట్ అయ్యారు. ఐరన్‌మ్యాన్ ఛాలెంజ్ చేపట్టేందుకు ఫిట్ ఇండియా ఉద్యమమే ప్రేరణగా నిలిచిందన్నారు.ఎంపీ తేజస్వి అద్భుతమైన ఫీట్‌ను అందుకున్నట్లు ప్రధానిమోదీ తనఎక్స్ అకౌంట్‌లో పేర్కొన్నారు. తేజస్వి అనేక మంది యువతకు ఫిట్‌నెస్‌లో ప్రేరణగా నిలుస్తుందని ఆయన అన్నారు. ఫిట్‌నెస్ కోసం గత నాలుగు నెలల నుంచి తీవ్రంగా శిక్షణ తీసుకున్నట్లు ఎంపీ సూర్య తెలిపారు.

# మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పూజా ఖేడ్కర్ తండ్రి పోటీ




**0ముంబయి:** తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించి సివిల్స్ ఎంపిక ప్రక్రియలో అవకతవకలకు పాల్పడ్డారన్న ఆరోపణల నేపథ్యంలో మహారాష్ట్రకు చెందిన పూజా ఖేడ్కర్ అభ్యర్థిత్వాన్ని యూపీఎస్సీ రద్దు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఆమె పేరు మరోసారి వార్తల్లో నిలిచింది. పూజా తండ్రి దిలీప్ ఖేడ్కర్ మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. ఈమేరకు ఆయన అహ్మద్‌నగర్ దక్షిణ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు.అయితే, ఈసందర్భంగా ఆయన దాఖలు చేసిన అఫిడవిట్ వివాదాస్పదమైంది. తాను భార్య నుంచి విడాకులు తీసుకున్నట్లు తాజా అఫిడవిట్‌లో దిలీప్ పేర్కొన్నారు. కొన్ని నెలల క్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లోనూ ఆయన నామినేషన్ వేయగా.. అప్పుడు తాను భార్యతో కలిసే ఉంటున్నట్లు పేర్కొనడం గమనార్హం.2024 సార్వత్రిక ఎన్నికల్లో అహ్మద్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి దిలీప్ ఖేడ్కర్ పోటీ చేసి ఓడిపోయారు. ఆ సమయంలో సమర్పించిన నామినేషన్ పత్రాల్లో మనోరమ ఖేడ్కర్ (పూజా తల్లి)ను తన భార్య పేర్కొన్న దిలీప్.. తమది అవిభాజ్య హిందూ కుటుంబమని తెలిపారు. అయితే, తాజాగా దాఖలు చేసిన అఫిడవిట్‌లో తాను తాను మనోరమ నుంచి విడాకులు తీసుకున్నట్లు ప్రకటించడం గమనార్హం. 2009లో పుణెలోని ఫ్యామిలీ కోర్టులో తామిద్దం పరస్పర సమ్మతితో విడాకులకు దరఖాస్తు చేసుకున్నామని, ఆ మరుసటి ఏడాదికి విడాకులు మంజూరయ్యాయనిదిలీప్ తాజా అఫిడవిట్‌లో తెలిపారు.అయినప్పటికీ వీరిద్దరూ ప్రస్తుతం ఒకే బంగ్లాలో కలిసే ఉంటున్నట్లు పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. పుణెలో ట్రైనీ సహాయ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సమయంలో పూజా ఖేడ్కర్‌పై అధికార దుర్వినియోగంతో పాటు యూపీఎస్సీలో తప్పుడు అఫిడవిట్ పత్రాలు సమర్పించారనే ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై దర్యాప్తు చేపట్టిన యూపీఎస్సీ.. ఈ ఏడాది ఆగస్టులో ఆమె సివిల్స్ అభ్యర్థిత్వాన్ని రద్దు చేసింది. అంతేగాక, భవిష్యత్తులో యూపీఎస్సీకి చెందిన ఎలాంటి పరీక్షలను రాయకుండా ఖేడ్కర్‌పై శాశ్వత నిషేధం విధించింది. దీనిపై ప్రస్తుతం ఆమె న్యాయ పోరాటం చేస్తోంది. కాగా.. ఈ వివాదం సమయంలో పూజా ఖేడ్కర్ తలిదండ్రుల వైవాహిక స్థితిపై అనేక వార్తలు వచ్చాయి. వాళ్లిద్దరూ విడిపోయారని, తాను తల్లితో కలిసి ఉంటున్నానని గతంలో పూజ తెలిపారు. అందుకే సర్టిఫికెట్లలోనూ తల్లి తరఫు వివరాలు పేర్కొన్నానని చెప్పారు. అప్పట్లో దీనిపై అధికారులు దర్యాప్తు జరిపారు.

# ఆర్మీ వాహనంపై ఉగ్రవాదులు కాల్పులు.. టెర్రరిస్ట్ హతం



**శ్రీనగర్:** జమ్మూకశ్మీర్‌లో వరుస ఉగ్ర ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఉగ్రదాడి ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇటీవలే కాలం లో ఆ ప్రాంతంలో ఉగ్రవాదులు రెచ్చిపోతున్నారు. ఎక్కడో ఒకచోట భద్రతా బలగాలపై కాల్పు లకు తెగబడుతున్నారు. మరోసారి ఆర్మీ వాహనంపై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. తాజాగా అఖ్నూర్ సెక్టార్‌లో ఆర్మీ వాహనం పై ఉగ్రవాదులు కాల్పులు జరపడం కలకలం సృష్టించింది.ఆర్మీ అధికారులు తెలిపిన సమాచారం ప్రకారం.. అఖ్నూర్ సెక్టార్ ప్రాంతంలో సోమవారం ఉదయం 7 గంటల సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఆర్మీ వాహనంపై పలు రౌండ్ల కాల్పులు జరిపిన ఉగ్రవాదులు అనంతరం అక్కడి నుంచి పారిపోయారు. వెంటనే అప్రమత్తమైన అధికారులు.. ఉగ్రవాదుల కోసం భారీ సెర్చ్ ఆపరేషన్ చేపట్టిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ ఆపరేషన్‌లో ఓ ఉగ్రవాదిని ఆర్మీ మట్టుబెట్టినట్లు తెలిసింది. దీపావళి సందర్భంగా జమ్ము ప్రాంతంలో విస్తృతంగా భద్రతా ఏర్పాట్లు జరుగుతోన్న తరుణంలో ఈ ఘటన చోటు చేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది.నాలుగురోజుల క్రితం ఇదే తరహాలో కాల్పులు జరిగాయి. ప్రముఖ పర్యటక ప్రాంతమైన గుల్‌మార్గ్ సమీపంలో నాగిన్ పోస్టు వైపు వెళ్తున్న ఆర్మీ వాహనంపై ఉగ్రవాదులు దాడి చేశారు. ఇద్దరు సైనికులు, ఆర్మీలో పనిస్తోన్న ఇద్దరు కూలీలు ప్రాణాలు కోల్పోయారు. అంతేగాకుండా కొన్నిరోజుల క్రితం గాందర్‌బల్ జిల్లాలోని సోన్‌మార్గ్ ప్రాంతంలో ఓ సొరంగ మార్గం నిర్మాణ ప్రదేశంలో ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఓ వైద్యుడు, ఐదుగురు వలస కార్మికులు మృతి చెందిన సంగతి తెలి సిందే. కాగా, జమ్ముకశ్మీర్ అంతటా.. ముఖ్యంగా లోయలో గత వారంలో జరిగిన కాల్పుల్లో ఇద్దరు సైనికులు సహా కనీసం 12 మంది మరణించారు. ఇటీవల కాలంలో వరుసగా జరుగుతోన్న ఈ ఘటనలపై ఆందోళన వ్యక్తమవుతోంది.

# దిల్లీలో అధ్వాన స్థితికి గాలి నాణ్యత..



**దిల్లీ:** దేశరాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రమవుతోంది. దీపావళి పండుగకు ముందే వాయు నాణ్యత దారుణంగా పడిపోయింది. పొరుగు రాష్ట్రాల్లో వ్యర్థాలను తగులబెడుతుండడంతో ఢిల్లీలో కాలుష్యం పెరిగింది. దీనికి తోడు పొగమంచు కూడా రాజధాని ప్రాంతాన్ని ఆవహించింది. దీంతో నగరంలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ అధ్వానస్థితికి చేరినట్లు కాలుష్య నియంత్రణ మండలి పేర్కొంది.సోమవారం ఉదయం ఢిల్లీలో ఏక్యూఐ 328 వద్ద నమోదైనట్లు కాలుష్య నియంత్రణ మండలి తెలిపింది. ముఖ్యంగా ఆనంద్ విహార్ ప్రాంతంలో గాలి నాణ్యత ప్రమాదకరంగా మారింది. ఇక్కడ సోమవారం ఉదయం 7 గంటల సమయంలో ఏక్యూఐ 357గా నమోదైనట్లు పేర్కొంది. ఇక అక్షర్‌ధామ ఆలయం వద్ద 357గా గాలి నాణ్యత నమోదైనట్లు పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ తెలిపింది. నగరంలోని ఇతర ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి ఉన్నట్లు వెల్లడించింది. గాలి నాణ్యత క్షీణించడంతో ఢిల్లీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎయిర్ క్వాలిటీ అండ్ వెదర్ ఫోర్‌కాస్టింగ్ అండ్ రిసెర్చ్ నివేదిక ప్రకారం.. గాలి నాణ్యత 447కు పడిపోవడం అంటే దాన్ని తీవ్ర వాయు కాలుష్యంగా పరిగణించవచ్చు. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 0–100 మధ్య ఉంటే గాలి నాణ్యత బాగా ఉండి, కాలుష్యం లేదని,100–200 మధ్య ఉంటే గాలి నాణ్యత మధ్య స్తంగా ఉందని అర్థం. ఇక 200–300 మధ్య ఉంటే గాలి నాణ్యత అధ్వాన్నంగా ఉందని, 300–400 మధ్య ఉంటే గాలి నాణ్యత మరింత అధ్వాన్నంగా ఉందని,400–500 మధ్యఉంటే కాలుష్యం తీవ్ర స్థాయిలో ఉందని అర్థం చేసుకోవచ్చు. కాగా, ఈ మధ్య ఢిల్లీలో వాయు కాలుష్యం ఆందోళనకరంగా మారుతున్న విషయం తెలిసిందే.

# అమెరికాలో మంత్రి లోకేశ్ పర్యటన.. టెస్లా, పెరోట్ గ్రూప్ ప్రతినిధులతో భేటీ



**విశ్వంభర, అమరావతి:** ఏపీ మంత్రి నారా లోకేశ్ అమెరికా పర్యటన కొనసాగుతోంది. పెరోట్, టెస్లా సంస్థల ప్రతినిధులతో మంత్రి సమావేశమయ్యారు. ఏపీలో పెట్టుబడులు పెట్టాలని ఆయా సంస్థలను ఆహ్వానించారు. పెరోట్ గ్రూప్ అండ్ హిల్‌వుడ్ డెవలప్‌మెంట్ ఛైర్మన్ రాస్ పెరోట్ జూనియర్‌తో లోకేశ్ భేటీ అయ్యారు. రాష్ట్రంలో ఏవియేషన్, మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టాలని కోరారు. అలయెన్స్ టెక్సాస్ తరహా ప్రాజెక్టులకు ఏపీ తీరప్రాంతం అనుకూలమని ఆయనకు వివరించారు. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో రాష్ట్రంలో పోర్టులు, హైవేలు, పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు. దీనిపై రాస్ పెరోట్ సానుకూలంగా స్పందించారు.

### అనంతపురంలో 'టెస్లా' యూనిట్లు ఏర్పాటు చేయండి..

మరోవైపు ఎలక్ట్రిక్ వాహనాల తయారీ రంగంలో అగ్రగామిగా ఉన్న 'టెస్లా' సంస్థ సీఎఫ్‌వో వైభవ్ తనేజాతోనూ లోకేశ్ భేటీ అయ్యారు. ఆస్టిన్‌లోని టెస్లా కేంద్ర కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీల తయారీ యూనిట్ల ఏర్పాటుకు అనంతపురం జిల్లా వ్యూహాత్మక ప్రదేశంగా ఉంటుందని వివరించారు. 2029 నాటికి ఏపీలో 72 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన విద్యుదుత్పత్తిని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని.. దీనికి టెస్లా సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఎలక్ట్రిక్ వాహనాలు, క్లీన్ ఎనర్జీ సొల్యూషన్స్, బ్యాటరీ స్టోరేజీలో టెస్లా గ్లోబల్ లీడర్‌గా ఉందని వైభవ్ తనేజా తెలిపారు. రాష్ట్రంలో సౌరశక్తి వ్యవస్థలు, స్మార్ట్‌సిటీలు, గ్రామీణ విద్యుదీకరణకు సౌర ఫలకాల అమర్చడంలో భాగస్వామ్యం కావాలనిలోకేశ్ విజ్ఞప్తి చేశారు. ఈవీఛార్జింగ్ నెట్‌వర్క్ అభివృద్ధి, సూపర్ ఛార్జింగ్ టెక్నాలజీ అమల్లోనూ పాలుపంచుకోవాలని కోరారు. రాష్ట్రంలో టెక్నాలజీ పార్కులు ఏర్పాటు చేయాలని టెస్లా సీఎఫ్‌వోకు మంత్రి విజ్ఞప్తి చేశారు.

## ఏపీఎండీసీ కార్యాలయంలో ఏసీబీ అధికారుల తనిఖీలు

**విశ్వంభర, విజయవాడ:** ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎండీసీ) కార్యాలయంలో ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. మైనింగ్ శాఖ మాజీ డైరెక్టర్ వెంకటరెడ్డి కేసు విషయంలో ఏసీబీ అధికారులు ఈ సోదాలు చేశారు. ఇసుక టెండర్ల విషయంలో జరిగిన అవకతకవల్లో వెంకటరెడ్డి అరెస్టు అయిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన విజయవాడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఇటీవల వెంకటరెడ్డిని కస్టడీకి తీసుకొన్న ఏసీబీ అధికారులు.. పలు కీలక అంశాలపై విచారించారు. ఆయన ఇచ్చిన సమాచారం ఆధారంగా సోమవారం ఉదయం నుంచి ఏపీఎండీసీ కార్యాలయంలో తనిఖీలు చేపట్టారు. సోదాలకు సంబంధించి ఏసీబీ అధికారులు అధికారికంగా స్పందించాల్సి ఉంది.

## ఏపీలో శాప్ నెట్ మూసివేత..
### సిబ్బంది, ఆస్తులు ఉన్నత విద్యామండలికి బదిలీ




**విశ్వంభర, అమరావతి:** సొసైటీ ఫర్ ఏపీ నెట్‌వర్క్(శాప్ నెట్)ను మూసివేస్తూ ఏపీ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విభాగానికి చెందిన సిబ్బంది, ఆస్తులు, అప్పులను ఉన్నత విద్యా మండలికి బదిలీ చేసింది. 2018లో శాప్ నెట్‌ను తెదేపా ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ఈ కార్యక్రమంలో భాగంగా మన టీవీ ద్వారా విద్యారంగానికి సేవలందించింది. తాజాగా మూసివేత అనంతరం.. విద్యామండలి నుంచే సమర్థంగా సేవలందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

## జగన్ సీఎంగా ఉన్నప్పుడు ధనవంతుల్నే కలిసేవారు: మాణికం ఠాగూర్



**విశ్వంభర, అమరావతి:** జగన్ తన పదవీ కాలమంతా వసూళ్లతోనే గడిపారని ఏపీ కాంగ్రెస్‌వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మాణికం ఠాగూర్ విమర్శించారు. 'ఎక్స్'లో వైకాపా చేసిన పోస్టుపై ఆయన ఘటుగా స్పందించారు. ప్రజా సమస్యలపైపరిష్కారమే వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మొదటి ప్రాధాన్యత అంటూ వైకాపా 'ఎక్స్'లో పోస్టు చేసింది. దీనికి మాణికం ఠాగూర్ "జగన్ సీఎంగా ఉన్నప్పుడు ధనవంతుల్నే కలిసేవారు. పదవీ కాలమంతా వసూళ్లతోనే బిజిబిజీగా గడిపారు. ప్రజాదర్బార్ పేరిట సమస్యలు తెలుసు కునే ఆలోచనే చేయలేదు. నిజానికి జగన్‌ఎప్పుడూవైఎస్‌రాజశేఖర్‌రెడ్డిని అనుసరించలేదు" అని పేర్కొన్నారు.

## ఆడబిడ్డ కన్నీరు ఆ ఇంటికి అరిష్టం: మాజీ మంత్రి బాలినేని



విశ్వంభర, హైదరాబాద్: వైఎస్సార్ కుటుంబం ఆస్తుల కోసం తగదాలు పడటం బాధాకరమని మాజీ మంత్రి, జనసేన నేత బాలినేని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వైకాపా అధ్యక్షుడు జగన్, ఆయన సోదరి, ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల మధ్య ఆస్తుల వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో ఆయన స్పందించారు. ఆడబిడ్డ కన్నీరు ఆ ఇంటికి అరిష్టమని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో బాలినేని మాటాడారు. ఈ సమస్య పరిష్కారం కోసం వైఎస్ విజయమ్మ ముందుకు రావాలని.. వేరే వాళ్లు దీనిలో జోక్యం చేసుకోవద్దని బాలినేని కోరారు. ఈ విషయంలో సీఎం చంద్రబాబుపై విమర్శలు చేయడం సరికాదన్నారు. తాను ఏ పార్టీలో ఉన్నా వైఎస్సార్ కుటుంబం బాగుండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఆస్తులు సంపాదించుకుని పార్టీ మారినట్లు కొంతమంది వైకాపా నేతలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. "నా కుమారుడి సాక్షిగా చెబుతున్నా. వైకాపా ఉన్నప్పుడు నా ఆస్తులు పోగొట్టుకున్నా తప్ప సంపాదించుకోలేదు. ఆ విషయం జగన్‌కూ తెలుసు. ఎలా అన్నది మనసులో పెట్టుకున్నా. చాలా ఇబ్బంది కలిగినా ఏంటనేది బయటపెట్టలేదు. సంస్కారం ఉంది కాబట్టే దాని గురించి మాట్లాడలేదు. అప్పులైతే నా తండ్రి, కోడలి ఆస్తి అమ్మి తీర్చాను. ఇదీ జగన్‌కు తెలుసు. డిప్యూటీ సీఎం పవన్‌ను కలిసినప్పుడు ఎన్నికలకు ముందే పార్టీలోకి తీసుకుందామనుకున్నట్లు చెప్పారు. కానీ జగన్‌కు బంధువులు కదా.. అడగలేకపోయాను అని పవన్ అన్నారు. ఆయన హుందాగా మాట్లాడారు. వైసీపీలో బాలినేని వంటి మంచివాళ్లు ఉన్నారని అప్పట్లో చెప్పారు. జగన్ ఒంగోలు వచ్చి కూడా ఇళ్ల పట్టాల విషయంలో నా గురించి ఒక్క మాట కూడా చెప్పలేదు. మంత్రి పదవి వదులుకుని జగన్ వెంట నడిచాను. ఆ పార్టీలో నాకు ఏం జరిగిందో ప్రజలకు తెలుసు" అని బాలినేని వ్యాఖ్యానించారు.

## వైసీపీ రహస్య జీవోలను 'జీవోఐఆర్'లో అప్‌లోడ్ చేయండి
### ఏపీ ప్రభుత్వం ఆదేశాలు

విశ్వంభర, అమరావతి: వైసీపీ హయాంలో రహస్యంగా ఉంచిన జీవోలను జీవోఐఆర్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. 2021 ఆగస్టు 15 నుంచి 2024 ఆగస్టు 28 వరకూ గోప్యంగా ఉంచిన జీవోలన్నింటినీ ఆ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. రహస్యంగా ఉంచిన అన్ని జీవోలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం జీవోఐఆర్ వెబ్‌సైట్‌ను పునరుద్ధరించి పాత జీవోలన్నింటినీ అందులో అప్‌లోడ్ చేయాలని ఐటీ ఎలక్ట్రానిక్స్ శాఖ అధికారులకు సూచించారు. వెబ్‌సైట్ ప్రారంభమైన 2008 నుంచి ఇప్పటి వరకూ అన్ని ప్రభుత్వ ఉత్తర్వులూ జీవోఐఆర్ వెబ్ పోర్టల్‌లో అందుబాటులో ఉన్నాయని సాధారణ పరిపాలన శాఖ పేర్కొంది. అయితే వైకాపా ప్రభుత్వ హయాంలో 2021 ఆగస్టు 15 నుంచి 2024 ఆగస్టు 28 వరకు ఉన్న జీవోలు మాత్రం అందుబాటులో లేకుండా పోయాయని తెలిపింది. పారదర్శకత, సమాచారం నిమిత్తం ప్రభుత్వం విడుదల చేసే అధికారిక ఉత్తర్వులు పౌరులకు అందుబాటులో ఉండాల్సిందేనని సాధారణ పరిపాలశాఖ పేర్కొంది. వాటన్నింటిని అప్‌లోడ్ చేసేలా ఆదేశాలు జారీ చేసినట్లు సురేష్ కుమార్ వెల్లడించారు. మూడేళ్ల కాలానికి సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు ప్రజలకు అందుబాటులో లేకపోతే సమాచార లోపం ఏర్పడుతుందని, అధికారిక నిర్ణయాలు జీవోల రూపంలో ప్రజలకు స్పష్టత ఇస్తాయన్నారు.

## కంటైనర్ టెర్మినల్‌ను పునరుద్ధరించాల్సిందే: సోమిరెడ్డి



**విశ్వంభర, నెల్లూరు:** కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్‌ను పునరుద్ధరించాల్సిందేనని మాజీ మంత్రి, టీడీపీఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. జగన్ హయాంలో ఎత్తేసిన ఈ టెర్మినల్ మూతపడటంతో 10వేల ఉద్యోగాలు పోయాయన్నారు. కృష్ణపట్నం పోర్టు వద్ద ఆయన నిరసన తెలిపారు. అఖిలపక్ష నేతలతో కలిసి పోర్టు సీఈవో నుసోమిరెడ్డి నిలదీశారు. టెర్నినల్‌ను పునరుద్ధరించాలని కోరారు. తొలుత పోర్టులోకి వెళ్లకుండా సోమిరెడ్డిని సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు.


## విజయవాడ ధర్నాచౌక్‌లో అగ్రిగోల్డ్ బాధితుల మహా విజ్ఞాపన దీక్ష

**విశ్వంభర, విజయవాడ:** నగరంలోని ధర్నాచౌక్‌లో అగ్రిగోల్డ్ బాధితులు మహా విజ్ఞాపన దీక్ష చేపట్టారు. తమ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిటీని నియమించాలని డిమాండ్ చేశారు. ఆర్థిక, మానసిక ఒత్తిడితో ఉన్న బాధితులకు సత్వరమే డిపాజిట్లు చెల్లించాలని డిమాండ్‌చేశారు. ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వర్‌రావు తెలిపారు. కమిటీలో సమర్థులైన అధికారులను ఉంచాలన్నారు. 26 జిల్లాల్లో తిరిగి బాధితుల సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలని కోరారు.



## గత ఐదేళ్లలో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు: మంత్రి అనిత

**విశ్వంభర,అనకాపల్లి:** గత ఐదేళ్లలో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. వైసీపీ ప్రభుత్వం తప్పుడు కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేసిందని విమర్శించారు. అనకాపల్లిలోని పెంటకోట కన్వెన్షన్‌లో కూటమి పార్టీల ప్రజా ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జ్ మంత్రి కొల్లు రవీంద్రను సత్కరించారు. అనంతరం అనిత మాట్లాడుతూ వైసీపీ హయాంలో కొల్లు రవీంద్రపై హత్య కేసు పెటారని.. 54 రోజులు ఆయన జైల్లో ఉన్నారని గుర్తుచేశారు. అయినా భయపడకుండా నిలబడ్డారని చెప్పారు. గత పాలకులు అనకాపల్లిని పట్టించుకోలేదని.. అందుకే అభివృద్ధిలో జిల్లా వెనుకబడి ఉందన్నారు. రాష్ట్ర ఖజానాను దోచుకుని ఇప్పుడు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. అనకాపల్లిని మోడల్ జిల్లాగా మార్చుకుందామని పిలుపునిచ్చారు.



## ఆర్థిక నేరస్థుడు 11 ఏళ్లుగా బెయిల్‌పై ఉండటమేంటి?: యనమల



**విశ్వంభర, అమరావతి:** తల్లి,చెల్లిపై కేసులేయడంతో వైసీపీ అధ్యక్షుడు జగన్ పాతాళంలో కూరుకుపోయారని తెదేపా సీనియర్ నేత, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. ఆయన చేయి పట్టుకున్నోళ్లంతా పాతాళంలోకే అని ఎద్దేవా చేశారు. ఆస్తుల వివాదం కాదు.. ఇది రాజకీయ ఆత్మహత్యే అని పేర్కొన్నారు. చివరికి జగన్ తన సొంత తల్లి, చెల్లిని కూడా మోసం చేశారన్నారు. షర్మిలకు ఇచ్చిన రూ.200 కోట్లు ఆయనకు ఎక్కడివని ప్రశ్నించారు. రూ.200 కోట్లు ఇచ్చానని పేర్కొన్నా.. ఐటీ, ఈడీ ఎందుకు స్పందించట్లేదన్నారు. "ఒక ఆర్థిక నేరస్థుడు 11 ఏళ్లుగా బెయిల్‌పై ఉండటమేంటి? ఇప్పటికే అనేక మంది వైకాపాను వీడుతున్నారు. భవిష్యత్తులో జగన్ మళ్లీ అధికారంలోకి వస్తారనుకోవడం పగటి కలే. ఇవాళ కాకపోతే రేపైనా జగన్ జైలుకెళ్లడం ఖాయం. పాత కేసులకు తోడు కొత్త కేసులు ఆయనపై సిద్ధంగా ఉన్నాయి" అని యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు.

## తప్పులన్నీ మీరు చేసి.. కూటమి ప్రభుత్వంపై విమర్శలా?: జగన్‌కు గొట్టిపాటి కౌంటర్



**విశ్వంభర, అమరావతి:** వైసీపీ అధినేత జగన్‌కి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కౌంటర్ ఇచ్చారు. విద్యుత్ ఛార్జీల పెంపుపై మాట్లాడే కనీస అర్హత మీకు ఉందా? అని ప్రశ్నించారు. మిగులు విద్యుత్ రాష్ట్రంగా ఏపీని అప్పగిస్తే వ్యక్తిగత స్వార్థంతో నాశనం చేసింది మీరు కాదా అని ధ్వజమెత్తారు. వైకాపా అసమర్థ పాలన, అస్మదీయులకు దోచిపెట్టింది వాస్తవం కాదా అని నిలదీశారు. పీపీఏలను రద్దు చేయడం, ఉత్పత్తిదారులను భయపెట్టడంతో కేంద్ర ప్రభుత్వం, విదేశీ బ్యాంకుల వద్ద రాష్ట్రం పరువు పోవడానికి మీరు కారణం కాదా జగన్.. అని ఆగ్రహం వ్యక్తం చేశారు. "2022-23, 2023-24 సంవత్సరాలకు గాను ఇంధన సర్దుబాటు ఛార్జీలను ప్రజలపై మోపాలని డిస్కంలకు అనుమతి ఇచ్చింది మీరే కదా. తొమ్మిది సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజల రక్తం తాగారు. అలాంటి మీరు చంద్రబాబు పాలనను విమర్శించడమేంటి? మీరు చేసినతప్పిదాలతోనే కదా అనవసరంగా హిందూజాపవర్‌కు రూ.1200 కోట్లు కట్టాల్సి వచ్చింది. వైకాపా హయాంలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయి. పోలవరం పూర్తి చేస్తానన్నారు.. చేయలేదు. మూడు రాజధానులు నిర్మిస్తానని చెప్పి రాష్ట్రంలో అల్లకల్లోలం సృష్టించారు. తప్పులన్నీ మీరు చేసి.. కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడమేంటి?" అని ప్రశ్నించారు.

## జెత్వానీ కేసులో వైసీపీ నేత విద్యాసాగర్‌కు హైకోర్టులో చుక్కెదురు




విశ్వంభర, అమరావతి: ముంబయి నటి జెత్వానీ కేసులో వైకాపా నేత కుక్కల విద్యాసాగర్‌కు హైకోర్టులో చుక్కెదురైంది. విజయవాడ కోర్టు తనపై విధించిన రిమాండ్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఇటీవల ఆయన హైకోర్టును ఆశ్రయించారు. రిమాండ్ రద్దు చేయాలని పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సోమవారం విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం.. విద్యాసాగర్ పిటిషన్‌ను కొట్టివేసింది. అరెస్టు విషయంలో జోక్యానికి హైకోర్టు నిరాకరించింది.

## టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ప్రధాన నిందితుడికి రిమాండ్ పొడిగింపు



విశ్వంభర, మంగళగిరి: తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడి ఘటనలో ఏ1గా ఉన్న పానుగంటి చైతన్యకు న్యాయస్థానం 14 రోజుల పాటు రిమాండ్ పొడిగించింది. మూడు రోజుల సీఐడీ కస్టడీ ముగియడంతో అధికారులు సోమవారం గుంటూరులోని 6వ అదనపు న్యాయస్థానం ఎదుట నిందితుడిని హాజరుపరిచారు. మూడు రోజుల కస్టడీలో అధికారుల ప్రశ్నలకు చైతన్య స్పందించలేదని, అన్నింటికీ తెలియదు, గుర్తులేదు, మర్చిపోయాననే సమాధానాలిస్తూ.. విచారణకు సహకరించలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో న్యాయస్థానం చైతన్యకు మరో రెండు వారాలు రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీంతో పోలీసులు అతడిని కోర్టు నుంచి విజయవాడ జైలుకు తరలించారు..

# ప్రభుత్వం మోసం చేయనిది ఎవర్ని..?

- సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించిన హరీశ్‌రావు
- ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని ఆరోపణ



**విశ్వంభర, హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో. మోసం చేయనిది ఎవర్ని..? ఉసురు పోసుకోనిది ఎవర్ని..? రోడ్డు మీదకు తీసుకురానిది ఎవర్ని..? అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. అన్ని కోణాల్లో ఈ ప్రభుత్వం విఫలమై దిక్కు తోచక ప్రతిపక్షంపై దాడులు చేస్తున్నారని హరీశ్‌రావు మండిపడ్డారు. ఈ రాష్ట్రంలోని విద్యార్థులను, నిరుద్యోగులు, ఉద్యోగులను మోసం చేసిండు రేవంత్ రెడ్డి. 2 లక్షల ఉద్యోగాలను ఏడాదిలో భర్తీ చేస్తానని చెప్పారు. నిరుద్యోగులకు 4 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని మాయమాటలు చెప్పి నట్టేట ముంచారు. ఇక కాంగ్రెస్ ఏడాది పాలనకు ఒక్క నెల మిగిలింది. కనీసం 10 శాతం అంటే 20 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చావా..? నిరుద్యోగులను దగా చేశావు. నిరుద్యోగ భృతిపై అసెంబ్లీలో అడిగితే హామీ ఇవ్వలేదని రేవంత్ రెడ్డి మోసపు మాటలు మాట్లాడారు. విద్యార్థులకు భరోసా కార్డు ఇస్తా అన్నావు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు ఇప్పటి వరకు కూడా నయా పైసా ఇవ్వలేదు. దివంగత సీఎం రాజశేఖర్ రెడ్డి ప్రవేశ పెట్టిన ఫీజు రీయింబర్స్ మెంట్ పథకాన్ని కేసీఆర్ మానవీయకోణంలో ఆలోచించి కొనసాగించారు. కరోనా కష్టకాలంలో కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు ఏడాదికి రూ. 2 వేల కోట్లు ఇచ్చారు కేసీఆర్. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ఫీజు రీయింబర్స్ మెంట్ ఇవ్వలేదు. విద్యార్థుల బతుకులు ఆగం అవుతుంటే.. నీ ప్రభుత్వం మొద్దు నిద్ర పోతోంది అని హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. అధికారంలోకి రాగానే ప్రభుత్వ ఉద్యోగులకు మూడు డీఏలు ఇస్తానని మాటిచ్చావు. పెండింగ్‌లో బిల్లులు క్లియర్ చేస్తా అన్నావు. పీఆర్సీ ప్రకటించి వేతనాలు పెంచు తానని ప్రకటించావు. ఇందులో ఏ ఒక్కటి కూడా అమలు కాలేదు. పీఆర్సీ ఉలుకే లేదు. ఒక్క డీఏ ఇచ్చి దీపావళి పండుగ జరుపుకోండి అంటున్నారు. ఎన్నికలకు ముందు కేసీఆర్ నిర్ణయించిన డీఏనే ఇప్పుడిస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 15 డీఏలు ఇచ్చింది. ఐదు డీఏలు పెండింగ్‌లో ఉండే.. కనీసం మూడు అయినా ఇస్తావు అనుకుంటే.. ఒక్క డీఏతో సర్దిపెడుతు న్నావు. పీఆర్సీ ఇవ్వక, ఓపీఎస్ అమలు చేయక, 317 జీవో పరిష్కరించకుండా ఉద్యోగులను మోసం చేశారు. ఉపాధ్యాయ ఉద్యోగులకు తీవ్రమైన అన్యాయం చేశారు. 6 వేల మంది టీచర్లు పదవీ విరమణ పొందారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌లో వారికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. మూడేండ్లకు నాలుగేండ్లకు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఏదైనా ఉందా అంటే అది కేవలం రేవంత్ రెడ్డి ప్రభుత్వమే అని హరీశ్‌రావు తెలిపారు.

## ఆధార్‌కు వ్యతిరేకంగా పోరాడిన

### న్యాయమూర్తి కేఎస్ పుట్టస్వామి మృతి

### సుప్రీంకోర్టులో న్యాయపోరాటం



**బెంగుళూరు :** ఆధార్ స్కీమ్‌కు వ్యతిరేకంగా న్యాయ పోరాటం చేసిన కర్ణాటక హైకోర్టు మాజీ న్యాయమూర్తి కేఎస్ పుట్టస్వామి కన్నుమూశారు. 2012లో ఆధార్ నమోదుకు వ్యతిరేకంగా ఆయన సుప్రీంకోర్టులో న్యాయ పోరాటం చేశారు. ఎటువంటి శాసనపరమైన మద్దతు లేకుండానే ఆధార్ స్కీమ్‌ను ప్రవేశ పెట్టినట్లు ఆయన ఆరోపించారు. సోమవారం ఆయన తన నివా సంలో తుది శ్వాస విడిచారు. 98 ఏళ్ల వయసున్న పుట్టస్వామి.. ఫిబ్రవరి 8వ 1926లో జన్మించారు. మైసూరులోని మహారాజ కాలేజీ, బెంగుళూరులోని లా కాలేజీలో విద్యాభ్యాసం పూర్తి చేశారు. 1952లో అడ్వకేట్‌గా నమోదు చేసుకున్నారు. హైకోర్టుకు ప్రభుత్వ అదనపు అడ్వకేట్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఆధార్‌ను తప్పనిసరి చేయడాన్ని వ్యతిరేకించారు. ఆ అంశంలో ప్రైవసీ హక్కు కోసం పోరాటం చేశారు. ప్రైవసీ అనేది ప్రాథమిక హక్కు అన్నారు.

## భారతీయ అమెరికన్ల మద్దతు కమలా హారిస్‌కే..

- 61 శాతం మంది ఆమె వైపే
- డొనాల్డ్ ట్రంప్‌నకు 31 శాతం మంది మద్దతు
- తాజా సర్వేలో వెల్లడి



**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారం వాడీవేడిగా సాగుతోంది. ఈక్రమంలో వెలువడిన తాజా సర్వేల్లో భారతీయ అమెరికన్ల మద్దతు డెమోక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్‌కే ఉందని వెల్లడైంది. 61 శాతం మంది భారతీయ అమెరికన్లు హారిస్ వైపే ఉన్నారని 'ఇండియన్ అమెరికన్ ఆటిట్యూడ్ సర్వే' వెల్లడించింది. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు 31 శాతం మంది మద్దతు ఉందని తెలిపింది. యూగవ్, కార్నేగి ఎండొమెంట్ ఫర్ ఇంటర్నేషనల్ పీస్ సంయుక్తంగా ఈ సర్వేను నిర్వహించాయి. ఇండియన్ అమెరికన్ల మద్దతు హారిస్‌కే ఎక్కువగా ఉన్నప్పటికీ.. ఇది డెమోక్రాటిక్ పార్టీకి ప్రతికూల అంశమే. ఎందుకంటే.. 2020 నాటి ఎన్నికల నాటితో పోల్చుకుంటే, డెమోక్రాటిక్ అధ్యక్ష అభ్యర్థికి వారి మద్దతు తగ్గింది. అప్పట్లో జోబైడెన్‌కు 68 శాతం మంది అనుకూలంగా ఉన్నారు. అదే సమయంలో ట్రంప్‌నకు 22 శాతం మంది మాత్రమే మద్దతివ్వగా, తాజాగా ఆ సంఖ్య 31 శాతానికి పెరగడం గమనార్హం. డెమోక్రాట్లుగా గుర్తింపు పొందే భారతీయ అమెరికన్ల సంఖ్య 56 శాతం నుంచి 47 శాతానికి తగ్గింది. అలాగే ఆ పార్టీ వైపు మొగ్గు చూపేవారి సంఖ్య 66 శాతం నుంచి 57 శాతానికి పడిపోయింది. అధ్యక్ష ఎన్నికల్లో పోటీపడుతోన్న తొలి భారతీయ అమెరికన్ అయిన కమలకు ఈ గణాంకాలు ఆందోళన కలిగించేవే. ఇదిలాఉంటే.. ఈ ఎన్నికల్లో భారతీయ అమెరికన్లు తీవ్ర ప్రభావం చూపనున్నారు. అమెరికాకు వలస వచ్చినవారిలో మెక్సికన్ల తర్వాత భారతీయులదే రెండో స్థానం. ఈ ఏడాది ఎన్నికల్లో భారతీయ అమెరికన్ల ఓట్లు కీలకంగా మారాయి. సంఖ్య పరంగా చూస్తే.. ఓటర్ల సంఖ్య తక్కువగా ఉన్నా నానాటికీ భారతీయ అమెరికన్ల ప్రభావం పెరుగుతుండటంతో వారిని విస్మరించే పరిస్థితి లేదు. అందుకే రెండు ప్రధాన పార్టీలు వీరి ఓట్లను దక్కించుకునేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి, అమలుచేస్తున్నాయి.

# బుచ్చమ్మది ఆత్మహత్య కాదు ..రేవంత్ రెడ్డి చేయించిన హత్య

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణ
- ఆమె కుటుంబానికి పరామర్శ

**విశ్వంభర, హైదరాబాద్:** హైడ్రా కూల్చివేతల భయం కారణంగా కూకట్‌పల్లిలో ప్రాణాలు కోల్పోయిన బుచ్చమ్మది ఆత్మహత్య కాదు.. హైడ్రా అనే అరాచక సంస్థతో సీఎం రేవంత్ రెడ్డి చేయించిన హత్య అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. బుచ్చమ్మ కుటుంబాన్ని కేటీఆర్ పరామర్శించి వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్థం, పర్థం లేకుండా ఆనాలోచితంగా గుడ్డెద్దు చేలో పడినట్లు ఇష్టమొచ్చినట్లు కూకట్‌పల్లిలోని నల్ల చెరువు వద్ద కూల్చివేతలు చేశారు. హైడ్రా అనే బ్లాక్‌మెయిల్ సంస్థను పేదల మీదకు ఉసిగొల్పి.. నోటీసులు ఇవ్వకుండానే మీ ఇళ్లు కూలగొడుతామంటూ భయానక వాతావారణం ఈ కాంగ్రెస్ ప్రభుత్వం సృష్టించింది. పిల్లలు పుస్తకాలను తీసుకుంటామంటే కూడా తీసుకొనివ్వకుండా పేదల ఇళ్లు కూలగొడుతున్నారు. ఎక్కడ నా ఇల్లు కూలగొడుతారమోనని 52 ఏళ్ల బుచ్చమ్మ అనే మహిళ మూడు రోజులు ఆందోళన చెంది ఆత్మహత్య చేసుకున్నారు. వాళ్ల కుటుంబాన్ని చూస్తే బాధనిపిస్తోంది. ఎంతో కష్టపడి మా బిడ్డలకు ఉపయోగపడతదని ఇళ్లు కట్టామని బుచ్చమ్మ కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఆలోచన, ప్రణాళిక, పద్దతి లేకుండా చేశారు. వాళ్లే పర్మిషన్లు ఇచ్చి ట్యాక్స్ కట్టించుకొని వాళ్లే ఇల్లు కూలగొడుతారంట. హైడ్రా అనే సంస్థ కారణంగానే బుచ్చమ్మ బలవన్మరణం పొందారని కేటీఆర్ పేర్కొన్నారు. "మీ దిక్కుమాలిన చర్యల కారణంగా పేదలు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి. వేదశ్రీ అనే పాప ఏడుస్తూ పుస్తకాలు తీసుకుంటామంటే కూడా తీసుకోనివ్వకుండా ఇళ్లు కూలగొట్టారు. ఇంత అమానవీయంగా ప్రవర్తించాలా..? ఈ రాష్ట్రంలో పేద



వాళ్లకు మాత్రమే చట్టాలున్నాయా..? రేవంత్ రెడ్డి నీ అన్నకు మాత్రం ఎఫ్‌టీఎల్‌లో ఉన్న ఇల్లుకు నోటీసులిస్తారా..? పేదవాళ్లు పుస్తకాలు తీసుకుంటామంటే కూడా తీసుకోనివ్వకుండా ఇల్లు కూల్చటమనేది ఇంతకంటే దిగజారిన, దిక్కుమాలిన చర్య ఏదైనా ఉంటుం దా? ఎన్నో హామీలు ఇచ్చి ఇందిరమ్మ ఇల్లు కడతాం, ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు అన్నారు. ఒక్క ఇల్లు కట్టలేదు. కానీ ఎన్ని ఇళ్లు కూలగొట్టవో ప్రజలు గమనిస్తున్నారు" అని కేటీఆర్ అన్నారు. "బుచ్చమ్మ కుటుంబానికి అండగా ఉంటాం. వారికి ఆర్థిక సాయం చేశాం. హైడ్రా బాధితులందరికీ బీఆర్ఎస్ అండగా ఉంటుంది. మీకు న్యాయ సాయం చేస్తుంది. రాష్ట్రం మొత్తం మీద ఇవ్వాళ అరాచకం నడుస్తోంది. గరీబోళ్ల పొట్టకొట్టే ప్రభుత్వ చర్యలపై పోరాడుతాం, న్యాయ పోరాటం కూడా చేస్తాం. గరీబోళ్లకు మేము అండగా ఉంటాం. వారికి బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు తోడుగా ఉంటారు. హైదరాబాద్ ప్రజలు మాకు ఓటు వేసినందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పగ, కసి పెంచుకుంది. కచ్చితంగా ఈ ప్రభుత్వం మీద మనందరం తిరగబడాల్సిందే" అని కేటీఆర్ చెప్పారు.

## ముక్కలుగా నరికి హత్య.. నిందితుడికి జీవిత ఖైదు

### ఎల్బీనగర్ కోర్టు తీర్పు



**విశ్వంభర, హైదరాబాద్:** ఓ వ్యక్తిని ముక్కలు ముక్కలుగా నరికి హత్య చేసిన కేసులో ఎల్బీనగర్ కోర్టు తీర్పు వెలువరించింది. నేరస్తుడికి యావజ్జీవ కారాగారశిక్ష పాటు రూ.15 వేల జరిమానా విధించింది. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా తొమ్మిదవ తరగతి అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి హరీష తీర్పునిచ్చారు.జిల్లెడ్ చౌదరిగూడెం ఎస్సై కె. విజయ్ తెలిపిన వివరాల ప్రకారం.. కాసులాబాద్ గ్రామానికి చెందిన తట్టపల్లి రాజు, గంజేటి అంజయ్య మధ్య డబ్బుల విషయంలో 2020 ఆగస్టు 15న గొడవ జరిగింది. ఈ క్రమంలో రాజును అంజయ్య గొడ్డలితో నరికి చంపేశాడు. ఆ తర్వాత మృతదేహాన్ని మోయడం కష్టమవడంతో మూడు ముక్కలుగా నరికేసి.. అదే గ్రామంలోని మురికి కాల్వలో తలభాగం, మిగతా రెండు భాగాలను పాడుబడ్డ బావిలో పడేశాడు. అక్కడికి మూడు రోజుల తర్వాత బావి నుంచి దుర్వాసన రావడంతో గ్రామస్థులు వెళ్లి చూసి.. రాజు మృతదేహంగా గుర్తించారు. అతడి సోదరి బాలామణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. పలు మార్లు విచారణ జరిపిన న్యాయస్థానం సోమవారం సాక్ష్యాధారాలను పరిశీలించి అంజయ్యకు శిక్ష ఖరారు చేసిందని ఎస్సై కె. విజయ్ తెలిపారు. ఇద్దరూ స్నేహితులేనని రూ.1000 కోసం గొడవ పడి ఈ హత్య జరిగిందని తెలిపారు.

# వీసా లేకుండా రష్యాకు

- వచ్చే ఏడాది నుంచి అందుబాటులోకి
- భారత పర్యాటకులు పెరుగుతారని అంచనా
- రష్యా టూరిజంలో ఇండియా కీలక మార్కెట్



**దిల్లీ:** భారతీయ పర్యటకులను ఆకర్షించేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తోన్న రష్యా వీసారహిత పర్యటనలకు అనుమతి ఇచ్చే అంశంపై కొంతకాలంగా చర్చలు జరుపుతోంది. ఇందుకు సంబంధించిన ఒప్పందాలు కీలక దశలో ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో 2025 స్ప్రింగ్ సీజన్ నుంచి వీసా-ఫ్రీ సదుపాయం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు రష్యాకు చెందిన ఉన్నతాధికారి ధ్రువీకరించారు. ఈ ఒప్పందానికి సంబంధించి పురోగతి కనిపిస్తోందని.. దీంతో భారత్ నుంచి పర్యటకుల సంఖ్య గణనీయంగా పెరగనున్నట్లు అంచనా వేస్తున్నామని మాస్కో సిటీ టూరిజం కమిటీ ఛైర్మన్ ఎవ్జెనీ కోజ్లోవ్ తాజాగా వెల్లడించారు. "టూరిజం విషయంలో రష్యాకు భారత్‌కు ఇప్పటికే కీలక మార్కెట్‌గా అవతరించింది. ఈ ఏడాది తొలి ఆరునెలల్లోనే 28,500 మంది భారతీయులు మాస్కోలో పర్యటించారు. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే ఈ సంఖ్య ఒకటిన్నర రెట్లు పెరిగింది. వాణిజ్యం, వ్యాపార సంబంధిత కారణాలతో రష్యాలో పర్యటించడం ఎక్కువగా ఉంటోంది. ముఖ్యంగా సుదీర్ఘ సంబంధాల దృష్ట్యా భారత్‌ను కీలక మార్కెట్‌గా పరిగణిస్తున్నాం" మాస్కో అధికారి పేర్కొన్నారు. గతేడాది ఆగస్టు 1 నుంచి భారత్ నుంచి రష్యా వచ్చే ప్రయాణికులు ఈ-వీసా దరఖాస్తు చేసుకునే (నాలుగు రోజుల్లో జారీ అవుతుంది) వెసులుబాటు అందుబాటులోకి వచ్చింది. సంఖ్యా పరంగా గతేడాది అత్యధిక వీసాలు పొందిన తొలి ఐదు దేశాల్లో భారత్ నిలిచింది. మొత్తంగా గతేడాది 9500 భారత పర్యటకులకు ఈ-వీసాలు జారీ అయ్యాయి. రష్యాకు వచ్చే విదేశీ పర్యటకుల్లో ఇది ఆరుశాతమని మాస్కో అధికారులు వెల్లడించారు. ఏడాది పొడవునా పండగలతో పాటు సమావేశాలు, ప్రదర్శనలు, సదస్సులతో 'వాణిజ్య టూరిజం'కు మాస్కో కేంద్రంగా మారుతోందని రష్యా అధికారులు పేర్కొన్నారు. వీటికితోడు భారతీయ వివాహాది శుభకార్యాలకు రష్యాలోని పలు ప్రాంతాలను ఎంపిక చేసుకునేందుకు వీలుగా ఆకర్షించాలని యోచిస్తున్నట్టు తెలిపారు. అతిథుల కోసం హోటల్ గదుల సంఖ్యను 25వేలకు పెంచేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు.

# మోమోస్ తిని మహిళ మృతి

## 60 మందికి అస్వస్థత

**మోమోస్ తయారు చేసిన సంస్థ సీజ్..**

మోమోస్ తయారు చేసిన సంస్థను జీహెచ్ఎంసీ అధికారులు సీజ్ చేశారు. చింతల్ బస్తీలో మోమోస్ తయారు చేసినట్లు గుర్తించి శాంపిల్స్ సేకరించారు. సదరు సంస్థకు ఎలాంటి అనుమతులు లేనట్లు జీహెచ్ఎంసీ అధికారులు తేల్చారు.

**విశ్వంభర, జూబ్లీహిల్స్:** మోమోస్ తిని మహిళ మృతిచెందగా.. సుమారు 60 మంది అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన బంజారాహిల్స్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. అస్వస్థతకు గురైన వారు వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నందినగర్, సింగాడకుంట బస్తీ, గౌరీ శంకర్ కాలనీలో శుక్రవారం జరిగిన సంతలో మోమోస్ విక్రయించారు. సింగాడకుంట బస్తీకి చెందిన రేష్మ బేగం (31)తో పాటు ఆమె పిల్లలు, ఆయా బస్తీల్లోని సుమారు 60 మంది వీటిని తిన్నారు. వీరందరికీ శనివారం నుంచి వాంతులు, విరేచనాలు ప్రారంభమయ్యాయి. దీంతో బంజారాహిల్స్ చుట్టుపక్కల ప్రాంతాల్లోని పలు ఆస్పత్రుల్లో చేరారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. మోమోస్ తిన్నవారిలో దాదాపు 10 మంది మైనర్లు ఉన్నారు. రేష్మ బేగం ఆరోగ్య పరిస్థితి విషమించడంతో నిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లే క్రమంలో ఆమె మృతిచెందారు. ఈ సంఘటనపై ఇప్పటికే బాధితులు బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో మోమోస్ విక్రయించిన ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాధితుల కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. మోమోస్‌తో పాటు ఇచ్చే మయోనైజ్, మిర్చి చట్నీ కలుషితమై ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

## ప్రసాదాల కోసం వాడే ముడిసరకులు నాణ్యమైనవే

### భద్రాచలం ఆలయ ఈవోకు నివేదిక



**విశ్వంభర, భద్రాచలం:** భద్రాచలం సీతా రామ చంద్ర స్వామి ఆలయంలో స్వామివారి నివేదనకు, ప్రసాదాల కోసం వాడే ముడిసరకులు నాణ్యమైనవేనని హైదరాబాద్ ఫుడ్ లేబొరేటరీ నిర్ధరించింది. తిరుమలలో లడ్డూ తయారీకి కల్తీ నెయ్యిని వినియోగించారంటూ వార్తలు వచ్చిన నేపథ్యంలో భద్రాచలం ఆలయ కార్య నిర్వహణ అధికారిణి (ఈవో) ఎల్ రమాదేవి అప్రమత్తమయ్యారు. భద్రాచలంలో ప్రసాదాల తయారీకి ఉపయోగించే ముడిసరకుల నమూనాలను హైదరాబాద్ ఫుడ్ లేబొరేటరీకి పంపించారు. క్షుణ్ణంగా పరిశీలించిన అధికారులు.. ప్రసాదాల తయారీకి ఉపయోగించే నెయ్యి, పప్పు దినుసులు, బియ్యం అన్నీ నాణ్యమైనవేనని నిర్ధరించారు. దేవస్థానా నికి నివేదిక అందినట్లు ఈవో రమాదేవి తెలిపారు.

# టెల్ అవీవ్‌లో ఉగ్రదాడి

- బస్‌స్టాప్‌పైకి దూసుకెళ్లిన ట్రక్కు
- ఆరుగురు ఇజ్రాయెలీల మృతి
- 50 మందికి గాయాలు



**జెరూసలెం:** ఇజ్రాయెల్ రాజధాని టెల్ అవీవ్‌లో మొస్సాద్ ప్రధాన కార్యాలయం సమీపంలో ఆదివారం భారీ ఉగ్రదాడి జరిగింది. ఓ బస్టాండులోకి ట్రక్కు దూసుకువచ్చి పలువురిని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆరుగురు మృతి చెందగా, 50 మందికి గాయాలయ్యాయి. పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. తొలుత ఓ బస్‌స్టాప్‌ను ట్రక్కు ఢీకొందని వార్తలొచ్చాయి. తర్వాత ఆ ట్రక్కు అక్కడే ఉన్న గిలాడి సైనిక స్థావరానికి చెందిన ఐడీఎఫ్ సైనికులపైనా దూసుకెళ్లినట్లు తెలుస్తోంది. గాయాల పాలైన 50 మంది కూడా సైనికులేనని స్థానిక న్యూస్ వెబ్‌సైట్ పేర్కొనడం గమనార్హం. ట్రక్కు డ్రైవర్‌ను అరబ్ జాతీయుడిగా గుర్తించారు. పోలీసులు వెంటనే అతడిని కాల్చి చంపినట్లు తెలుస్తోంది. మరోవైపు ఉత్తర గాజాలో మారణహోమం కొనసాగుతోంది. ఇజ్రాయెల్ సైన్యం (ఐడీఎఫ్) నిర్వహించిన దాడుల్లో రోజుకు 20 నుంచి 25 మంది ప్రాణాలు కోల్పోతూనే ఉన్నారు. శనివారం రాత్రి నుంచి ఐడీఎఫ్ జరిపిన దాడుల్లో దాదాపు 53 మంది మృతి చెందినట్లు పాలస్తీనా ఆరోగ్యశాఖ వర్గాలు తెలిపాయి. శనివారం రాత్రి బెట్ లాహియాలోని ఆరు భవనాలపై ఐడీఎఫ్ నిర్వహించిన దాడుల్లో 35 మంది మరణించారు. ఆదివారం కూడా అదే ప్రాంతంలో మరో 10 మంది చనిపోయారు. అల్-షాతి శరణార్థి శిబిరంలోని పాఠశాలపై జరిగిన దాడిలో 8 మంది ప్రాణాలు కోల్పోయారు. దక్షిణ లెబనాన్‌లో హెజ్‌బొల్లా డ్రోన్ దాడిలో ఐడీఎఫ్‌కు చెందిన ఐదుగురు సైనికులు మృతి చెందారు. 14 మందికి గాయాలయ్యాయి. ఇందులో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది.

## మదర్ థెరెసా నన్ను నిరుపేదల కోసం పనిచేయాలన్నారు



**వయనాడ్:** కేరళలోని వయనాడ్‌లో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ప్రచారంలో భాగంగా ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ మానవతా మూర్తి మదర్ థెరెసాతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. "మా నాన్న రాజీవ్ గాంధీ హత్య జరిగిన కొద్ది రోజులకు మదర్ థెరెసా మమ్మల్ని పలకరించడానికి ఇంటికి వచ్చారు. అప్పుడు నాకు 19ఏళ్లు. ఆమె వచ్చిన సమయంలో జ్వరంతో బాధపడుతున్నాను. అమ్మను పలకరించిన అనంతరం థెరెసా నా దగ్గరికి వచ్చి తలపై చేయి పెట్టి ఆశీర్వదించారు. నిరుపేదల కోసం పని చేయాలని నన్ను ఆహ్వానించారు. దాదాపు 6 సంవత్సరాల తర్వాత నేను వారి సంస్థతో కలిసి పని చేయడానికి వెళ్లాను. అక్కడ ఉన్న సోదరీమణులతో కలిసి బాత్రూంలు శుభ్రం చేయడం, వంట చేయడం వంటి పనులు చేశాను. అప్పుడే కష్టాల్లో ఉన్న వారికి సమాజం ఎలా చేయూత నందిస్తుందో తెలుసుకు న్నాను. వారు పడే బాధలను కళ్లారా చూశాను. అదే విధంగా వయనాడ్‌లో కొండ చరియలు విరిగిపడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో మీరు ఒకరికొకరు సహాయపడ్డారో చూశాను. కష్టాల్లో ఉన్న తోటి వారికి సహాయం చేయాలనే మదర్ థెరెసా మాటలను మీరు రుజువు చేశారు" అని ఆమె పేర్కొన్నారు. వయనాడ్ ప్రజల ప్రేమకు ఎప్పటికీ కృతజ్ఞతతో ఉంటానని ప్రియాంక గాంధీ అన్నారు. తాను నామినేషన్ వేయడానికి వచ్చనప్పుడు ఓ ఆర్మీ అధికారి తల్లి తనపై చూపిన అభిమానాన్ని ఎప్పటికీ మరచిపోలేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే పేదల సమస్యల గురించి ఆలోచిస్తుందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ వ్యాపారవేత్తలైన తన స్నేహితులకు అనుకూలంగా పాలసీలు రూపొందిస్తున్నారని ఆరోపించారు.